మే, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 4 పేజీలు: 64 వెల: రూ. 20/-





## శ్రమశక్తి సంఘాలకు పనులు

## శ్రామిక దినోత్సవానికి సార్థకత

చీదేడు గ్రామాన్ని సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ
కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా, ఐ.ఏ.ఎస్




గ్రామైక్య సంఘ సభ్యులతో చర్చ




శ్రమశక్తి సంఘ సభ్యులతో చర్చ

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 4

మే, 2011

చీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**

**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం .......... 2
జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో ప్రధాని సందేశం .......... 3
చీదేడును సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి కార్యదర్శి బి.కె. సిన్హా . 4
అపార్డులో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు .......... 6
రహదారి భద్రతపై సిబ్బంది శిక్షణావసరాల గుర్తింపు .......... 8
జీరో బడ్జెట్ ఫార్మింగ్‌తో రైతులకు ప్రయోజనాలు .......... 9
నోముల గ్రామాన్ని సందర్శించిన చీదేడు రైతులు .......... 10
పీసా చట్టంపై శిక్షణ .......... 12
పీసా చట్టం గురించి తెలుసుకుందాం .......... 13
వ్యవసాయ అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు .......... 22
అణుధార్మికత ప్రభావం .......... 24
యుక్త వయస్సు బాలికలకు భరోసా – సబల .......... 25
ఇది మన ఆట– మన కోసం .......... 29
దామోదరం సంజీవయ్య .......... 30
పురాతన కాలం నుంచే మన దేశంలో గ్రామసభ .......... 31
క్రికెట్ ప్రపంచ శిఖరాగ్రంపై భారత్ .......... 32
గ్లోబల్ వార్మింగ్ వల్ల రానున్న ప్రమాదాలు .......... 36
చైతన్య వారధులు–న్యాయ విజ్ఞాన సదస్సులు .......... 39
వరంలా మారిన బిఆర్‌జిఎఫ్ నిధులు .......... 42
సిరిమాను(కథ) .......... 46
బడిమానిన బాలికలకు వరం .......... 49
పంచాయితీల్లో పారిశుధ్య నిర్వహణకు గార్బేజి వాహనాలు .......... 51
బలే మంచి చౌక బేరం (కథ) .......... 53
Training on PESA Act .......... 55
Cheeded Farmers to adopt Zero Budget Based Natural Farming .......... 56
Bring decentralisation of self governance .......... 57
Union Rural Development Secretary B.K. Sinha Visits Cheeded .......... 58
Bharat Nirman Volunteers were trained at APARD .......... 60
Cheeded formers Visit NomulaVillage .......... 62
TNA Workshop on Road Safety .......... 64

సంపాదకీయం..

మే, 2011

# శ్రమశక్తి సంఘాలతో 'మేడే'కి సార్థకత

ఆర్థిక రంగంలో, సామాజిక రంగంలో కార్మికులు సాధించిన విజయాలకు గుర్తుగా ప్రతి ఏటా చేసుకునే ఉత్సవమే 'మేడే'. విశ్వప్రగతికీ, విశ్వకల్యాణానికి మూల స్తంభాలనదగిన శ్రామికజీవుల శ్రమకు సంకేతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ కార్మిక సంఘీభావ దినోత్సవమే 'మేడే'. 8 గంటల పనిదినం కోసం కార్మికులు కదంతొక్కి చేపట్టిన ఉద్యమం ఫలించిన ప్రతీకయే 'మేడే'.

మౌలికంగా ఎనిమిది గంటల పనిదినం కోసం అమెరికాలో సమ్మె రూపంలో కార్మికుల ఆందోళన మొదలయినప్పటికీ, అది కార్మిక లోకానికి వారి శక్తి సామర్థ్యాలేమిటో తెలియజేసి ఓ నవసమాజ నిర్మాణానికి అంకురార్పణ చేసింది. సామ్రాజ్యవాదం పీడ నుంచి సుమారు 100 దేశాలు విముక్తి చెందడానికి అవసరమైన చారిత్రక పాత్ర నిర్వహించింది 'మేడే'.

మన దేశంలో కార్మికోద్యమాల ఆవిర్భావం జరిగిన తరువాత 1923లో మద్రాసులో కీర్తిశేషులు సింగార వేలు చెట్టియార్ నాయకత్వాన మొట్టమొదటిసారిగా 'మే డే' జరిగింది. కార్మిక సంఘటిత ఉద్యమ ఫలితంగానే శ్రామికుల గృహ, విద్యా-వైద్యావసరాలు, ప్రమాదరక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వేతన చట్టాలను, భద్రతా చట్టాలను, సంక్షేమ చట్టాలను ప్రభుత్వం రూపొందించి అమలుపరుస్తోంది. కుటుంబ వ్యవస్థకు సాంఘిక న్యాయాన్ని జోడించడానికి బోనస్, గ్రాట్యుటీ చట్టాలు, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, బీమా పథకాలు అమల్లోకి వచ్చాయి.

గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగాన్ని రూపుమాపడానికి 100 రోజుల పాటు ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం ఇందుకుగాను ఒక చట్టం కూడా చేసి అనేక హక్కులను అందులో పొందుపరిచింది. గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ, 18 ఏళ్లు పైబడి వయస్సు ఉండి, నైపుణ్యం అవసరం లేని పని చేయడానికి సిద్ధపడిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు పొందే హక్కును ప్రభుత్వం కల్పించింది. అంతేకాక, 100 రోజులపాటు పనికోరే హక్కు, నిరుద్యోగ భృతి పొందే హక్కు, 5 కి.మీ. దాటి పని కల్పిస్తే ప్రయాణభత్యం కోరే హక్కు, సకాలంలో కూలీ డబ్బు పొందే హక్కు, స్త్రీ పురుషులకు సమాన వేతనం పొందే హక్కు, పని ప్రదేశంలో సౌకర్యాలు పొందే హక్కు, పని ప్రదేశంలో గాయపడితే ఉచితవైద్యం పొందే హక్కు, పని ప్రదేశంలో చనిపోతే వారసులు నష్టపరిహారం పొందే హక్కు మొదలైన అనేక హక్కులను ప్రభుత్వం కల్పించింది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కూలీలకు కల్పించిన ఈ హక్కులు, సౌకర్యాలను పూర్తి స్థాయిలో కూలీలు వినియోగించుకోవాలంటే కూలీలందరు సంఘటితమైతేనే అది సాధ్యమవుతుంది. అప్పుడే కూలీలు వారి హక్కులను సాధించుకోగలుగుతారనే సంకల్పంతో ప్రభుత్వంతో 'శ్రమశక్తి సంఘాల' పేరిట సంఘాలను ఏర్పాటు చేసింది. తద్వారా శ్రమశక్తి సంఘాలకు పనులు కేటాయించడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని మరింత కట్టుదిట్టంగా, పకడ్బందీగా నిర్వహించడానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ప్రభుత్వమే చొరవ తీసుకుని కూలీలను 'శ్రమ శక్తి సంఘాల' ద్వారా సంఘటిత పరచడానికి పూనుకోవటం ఏ దేశంలో ఎక్కడా జరిగి ఉండదని చెప్పవచ్చు.

కార్మికోద్యమ స్ఫూర్తితో, చైతన్యంతో ప్రభుత్వం చేసిన ఈ ఏర్పాటును కూలీలు సక్రమంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవటమే శ్రామిక పర్వదినం 'మేడే'కు వారిచ్చే సార్థకత. పంచాయితీరాజ్ సంస్థల ప్రతినిధులు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, అన్నా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో శ్రమశక్తి సంఘాల పటిష్టతకు పాటుపడి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట ఉద్దేశ్యాలను నెరవేర్చేందుకు మేడే సందర్భంగా పునరంకితులవుతారని ఆశిస్తూ....

( కె. చంద్రమౌళి )

# స్థానిక స్వపరిపాలనా సంస్థల బలోపేతానికి సంఘటితంగా కృషిచేయాలి

## జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో ప్రధాని మన్మోహన్ సింగ్

**అధికార వికేంద్రీకరణద్వారా గ్రామ స్థాయి పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేయటానికి సంఘటితంగా కృషిచేయాలని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగబద్ధత కల్పిస్తూ చేసిన చారిత్రాత్మకమైన 73వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చిన తేదీ ఏప్రిల్ 24ను జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.**



రెండవ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 24.4.2011న కొత్తఢిల్లీలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల పరిషత్తు అధ్యక్షులతో, జిల్లా పరిషత్తు అధ్యక్షులతో నిర్వహించిన జాతీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాని మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి ఇచ్చినప్పటికీ ఇంకా ఈ సంస్థలు సాధించాల్సింది చాలా ఉందని అన్నారు. దేశంలో నేడు పంచాయతీరాజ్ సంస్థలు బలపడి దేశంలోని 600 జిల్లాలు, 6000 బ్లాకులు, 230000 గ్రామపంచాయతీల నుండి ఈ రోజు 28లక్షల మంది ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్నారంటే, ఈ ఘనత అప్పటి భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీకే దక్కుతుందని అన్నారు.

స్థానిక అవసరాలకు అనుగుణంగా పథకాలు చేపట్టి అమలుచేయటంలో పంచాయతీల పాత్ర కీలకమైనదని ప్రధాని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో పంచాయితీల పాత్ర చాలా ప్రాధాన్యమైనదని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమంలో గ్రామస్థాయినుండి ప్రారంభమయ్యే వికేంద్రీకృత దీర్ఘదర్శి, వార్షిక ప్రణాళికల రూపకల్పన తప్పనిసరి అని ప్రధాని అన్నారు. పంచాయతీరాజ్ సంస్థల ద్వారా అందే సేవలలో నాణ్యత పెంచటానికి, మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందచేయటానికి, పంచాయతీ రాజ్ సంస్థల సామర్థ్యాలు పెంపొందించటానికి కేంద్రప్రభుత్వం యోచిస్తోందని అన్నారు.

ఇదే సమావేశంలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న యు.పి.ఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. గ్రామసభలను సక్రమంగా నిర్వహించటానికి, గ్రామసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచటానికి ప్రాధాన్యమివ్వాలని ఆమె అన్నారు. పంచాయతీ కార్యక్రలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించటానికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి కృషిచేస్తున్న కేరళ, కర్ణాటక, సిక్కిం, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలకు పంచాయత్ ఎంపవర్‌మెంట్ అండ్ అక్కౌంటబిలిటీ స్కీం క్రింద ప్రధాని మన్మోహన్ సింగ్, యు.పి.ఏ. ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ అవార్డులు ప్రదానం చేసారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి విలాస్‌రావుదేశముఖ్ మాట్లాడుతూ, గ్రామసభను బలోపేతం చేయటానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలు కంకణ బద్ధులై ఉన్నట్లు చెప్పారు. గ్రామసభ బలోపేతం కానట్లయితే ప్రజలు తమ హక్కులను పొందలేరని అన్నారు. గ్రామసభను బలోపేతం చేయటానికి, క్షేత్ర స్థాయిలో విశిష్టమయిన సేవచేస్తున్న గ్రామపంచాయతీలను ప్రోత్సహించటానికి రాష్ట్రీయ గౌరవ గ్రామ సభ సన్మాన పురస్కారాలను అందచేస్తున్నట్లు చెప్పారు. ఈ పురస్కారం క్రింద అందచేసే మొత్తాన్ని గ్రామపంచాయతీ తన విచక్షణ ప్రకారం ఖర్చు చేసి గ్రామాన్ని అభివృద్ధి పర్చుకోవాలని సూచించారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి ఎ.ఎన్.పి.సిన్హా మాట్లాడుతూ, పంచాయతీరాజ్ సంస్థలు స్వయంప్రభుత్వాలుగా పనిచేయాలంటే, ఈ సంస్థలకు విధులు, నిధులు, సిబ్బంది బదలాయింపు తప్పనిసరి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పంచాయితీరాజ్ సంస్థల పరిధిలోని కార్యకలాపాలకు కేంద్రప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలద్వారా, అదనపు కేంద్రప్రభుత్వ సహాయంక్రింద గణనీయమొత్తాలలో నిధులు కేటాయిస్తోందని అన్నారు. 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో అన్ని కేంద్రప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల ప్రణాళికల రూపకల్పన అమలులో పంచాయితీరాజ్ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ప్రధానిని కోరారు. 2011-16 మధ్య కాలంలో పంచాయితీ రాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి ఉద్దేశించిన రోడ్ మ్యాప్‌ను ఈ సందర్భంగా ప్రధాని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మన రాష్ట్రంనుండి రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రివర్యులు శ్రీ కె. జానారెడ్డి, పంచాయితీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, 60 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చీదేడును సందర్శించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి బి.కె. సిన్హా

**గ్రామ సమగ్రాభివృద్ధికి ప్రజా భాగస్వామ్యం తప్పని సరి అని తక్కువ కాల వ్యవధిలోనే చీదేడు గ్రామ ప్రజలలో వచ్చిన సామాజిక చైతన్యం యావత్ దేశానికీ ఆదర్శమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా అన్నారు.**

చీదేడు గ్రామంలో అవలంబిస్తున్న 'ల్యాబ్ టు ల్యాండ్' విధానాన్ని పరిశీలించటానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి బి.కె. సిన్హా, సంయుక్త కార్యదర్శి నితేన్ చంద్ర , రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, అపార్డ్ కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, తదితర ఉన్నతాధికారులు 14.4.2011న చీదేడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సెక్రటరీ బి.కె. సిన్హా మాట్లాడుతూ, చీదేడు గ్రామంలో ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అద్భుతంగా అమలు జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అపార్డ్ అందించిన ప్రేరణతో గ్రామస్తులలో సామాజిక స్పృహ, చైతన్యం వెల్లి విరిస్తున్నాయని, గ్రామ అభివృద్ధికి ఇది కీలకమని అన్నారు.

గ్రామంలో మద్యపాన నిషేధం అమలు అవుతున్న తీరుని గూర్చి తెలుసుకున్న ఆయన, మద్యపాన నిషేధం అన్నది చాలా ఆదర్శవంతమైన నిర్ణయం అని, మద్య పానం నిషేధించటం వ్యక్తి వికాసానికి దారి తీస్తుందని అన్నారు. ఇటువంటి మహత్తర నిర్ణయం తీసుకొన్న గ్రామ ప్రజలకు అభినందిస్తున్నానని ఆయన అన్నారు. సర్పంచ్ శ్రీమతి అనసూయను, వివిధ గ్రామ కమిటీలను అభినందించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమాన్ని రూపొందించిన జాయింట్ సెక్రటరీ నితేన్ చంద్రను సభ్యులకు పరిచయం చేసారు.

**వార్తల్లో 'అపార్డ్'**

చీదేడు గ్రామంలో ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం విజయవంతం అయిన తీరుని చూసి అబ్బురపడుతున్నాననీ, కార్యక్రమం రూపకల్పన జరిగే సమయంలో ఈ విధమైన ఫలితాలు ఊహించలేదని బి.కె. సిన్హా అన్నారు. అందుకే గ్రామంలో మార్పు పరిణామాన్ని పరిశీలించి, పాఠాలు నేర్చుకోవటానికి రాత్రి బస కూడా ఈ గ్రామంలోనే ఏర్పాటు చేసుకొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చీదేడు గ్రామ పంచాయితీలో ల్యాబ్ టు ల్యాండ్ స్ఫూర్తితో ఏర్పాటైన మద్యపాన నిషేధ కమిటీ, త్రాగునీరు పారిశుద్ధ్య కమిటీ, ఆరోగ్య పోషణ కమిటీ, వ్యవసాయక కమిటీ, పశు సంవర్ధక కమిటీ, అటవీ సంరక్షణ కమిటీ, ఉద్యోగస్తుల కమిటీ తదితర కమిటీలతో సంభాషించి




ఆయా కమిటీలు చేస్తున్న కార్యక్రమాల గూర్చి తెలుసుకున్నారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ చర్చించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారు. అభివృద్ధి అజెండాను అన్ని రాజకీయ పార్టీలు సమర్ధించటం ఒక మంచి పరిణామమని బి.కె. సిన్హా అన్నారు.

గ్రామంలో అవలంబిస్తున్న సుస్థిర వ్యవసాయ పద్ధతుల గూర్చి రైతులను ప్రశ్నించి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 25 గ్రామాల్లో ఎన్.పి.ఎం. కార్యకలాపాలు జరుగుతున్నాయని ఎన్.పి.ఎం. క్లస్టరు కార్యకర్త తెలియచేయగా, ఈ కార్యక్రమాల వివరాలను గూర్చి ఆయన క్షుణ్ణంగా తెలుసుకున్నారు. గ్రామంలో 45 మంది రైతులు ఈ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారని ఈ విధమైన సాగు చాలా లాభసాటిగా ఉందని రైతులు తెలియచేసారు. ఈ పద్ధతిలో తాము కొన్ని రాజీలేని సూత్రాలను పాటిస్తామని అందుకే ఎటువంటి పురుగు మందుల అవసరం లేదని రైతులు ఆయనకు వివరించి చెప్పారు.





అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ బి.కె. సిన్హా సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పోషకహార కేంద్రాన్ని సందర్శించి కేంద్రం పనితీరుని గూర్చి ఆరా తీసారు. గ్రామంలోని స్వయం సహాయక సంఘాలతో సమావేశమై, ఆర్థిక అభివృద్ధి కోసం మహిళా స్వయం సహాయక సంఘాలు చేపడుతున్న కార్యకలాపాల గూర్చి సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామైక్య సంఘం పనితీరుని గూర్చి కూడా అడిగి తెలుసుకున్నారు. గ్రామ సంఘాలు









చిన్న సంఘాలు ఏ విధంగా లావా దేవీలు నిర్వహిస్తాయో కూడా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 22 స్వయం సహాయక సంఘాలలో 19 బాగా పనిచేస్తుండగా, 3 సంఘాల పనితీరు కుంటుపడిందని ఆ సంఘాలను కూడా మళ్ళీ సక్రమంగా పనిచేసేలా ప్రయత్నిస్తున్నామని గ్రామ ఐక్య సంఘం ఈ సందర్భంగా తెలియచేసింది.

గ్రామంలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ పనులపై కూడా ఆయన ఆసక్తి చూపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రమశక్తి సంఘాలతో ఉపాధి హామీ పథకం అమలు తీరు తెన్నులపై ఆయన



చర్చించారు. పథకం అమలులో సమస్యలు గూర్చి శ్రామికులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, గ్రామంలో రాబోయే 3-4 సంవత్సరాలకు సరిపడా పనుల షెల్ఫ్‌ను ఇప్పటికే గుర్తించి, శ్రమశక్తి సంఘాల వారీగా పనుల కేటాయింపు జరిపినట్లు వివరించారు. చెల్లింపులు నిర్ణీత సమయానికి జరిగేలా ఇ-యం.యం.యస్. పద్ధతిలో శ్రామికుల హాజరుని నమోదు చేసి, ఇ- చెక్ మెజర్‌మెంట్ విధానం, ఇ-ఫండ్ ట్రాన్స్‌ఫర్ విధానాలు అవలంబించటం జరుగుతోందని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అమలు చేయటానికి అపార్డు చేసిన ప్రయత్నాన్ని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి వివరించారు. గ్రామస్తుల కృషి, దక్షత, ధృఢ సంకల్పం కారణంగా నేడు చీదేడు నలుగురి దృష్టిలో పడిందని ఆయన అన్నారు. అపార్డులోని ల్యాబ్ టు ల్యాండ్ కోర్ కమిటీ ప్రతీ శుక్రవారం చీదేడును సందర్శించి వారికి మార్గనిర్దేశనం చేయటం వల్ల నేడు ఈ ఫలితాలు వచ్చాయని వివరించారు. ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం వల్ల చీదేడు ప్రజలలో వచ్చిన మార్పు, చైతన్యంపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను శ్రీ హెచ్. కూర్మారావు వివరించారు.

అనంతరం శ్రీ బి.కె. సిన్హా, శ్రీనితేన్ చంద్ర, శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, శ్రీ కె. చంద్రమౌళి నలుగురూ గ్రామంలోనే రాత్రి బస చేసారు. నలుగురు ఉన్నత అధికారులు గ్రామాన్ని సందర్శించటమే గ్రామస్తుల ఊహకు అందని విషయమైతే, అటువంటి అధికారులు నలుగురు గ్రామంలోనే నిద్రించటంతో గ్రామస్తుల ఆనందానికి అవధులు లేవు. ఉదయం 5 గంటలకే నిద్రలేచిన అధికారులంతా, మంచాల మండలంలోని నోముల గ్రామంలో గండయ్య అనే రైతు పొలాన్ని సందర్శిం,చి, ఆయన అనుసరిస్తున్న సుస్థిర వ్యవసాయ పద్ధతుల గూర్చి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా డి.ఆర్.డి.ఏ, డి.డబ్ల్యు.ఎం.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎం.ఆర్.ఓ, ఎం.పి.డి.ఓ., వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, మెడికల్, ఇరిగేషను తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు ప్రొఫెసర్ సూర్యనారాయణ రెడ్డి, డా. శ్రీనివాస్, శాంతి కుమార్, శ్రీలక్ష్మి, శ్రీపతిరావు, సుభాష్ చంద్ర గౌడ్, తదితరులు ఈ కార్యక్రమాన్ని సమన్వయపర్చారు.



# అపార్డులో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

**ల్యాబ్ టు ల్యాండ్ - కీ క్యాప్ ప్రయోగం క్రింద ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి మంచాల మండలంలోని 18 పంచాయితీలకు చెందిన 216 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో అపార్డులో 3 రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమం జరిగింది. 3 రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలపై అవగాహన కలుగచేసారు.**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డు కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, జాతి నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, స్వాతంత్రోద్యమంలో కూడా ఆనాటి యువత తమ రక్తం చిందించి దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిందని ఉద్బోధించారు. గ్రామీణ సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను రూపుమాపటానికి యువత మరో ఉద్యమం చేపట్టాలని, గ్రామీణ ప్రజలను జాగృత పర్చటం చేపట్టాలని ఆయన అన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు శ్రీ రవీంద్ర భారత్ నిర్మాణ్ కార్యకర్తలుగా గ్రామ ప్రజలలో చైతన్యం తీసుకొని రావలసిన ఆవశ్యకతను గూర్చి వివరించారు. సమాజంలో ప్రజలు అవగాహనారాహిత్యం వల్ల దోపిడీకి గురవుతున్నారని, వారిని ఈ దోపిడీ నుండి రక్షించటానికి యువత నడుం బిగించాలని అన్నారు. యువత తల్చుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, స్వార్థ చింతన వీడి దేశ భక్తితో గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛంద సేవ చేయటానికి ముందుకు వచ్చిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లను అభినందించారు. సర్దార్ భగత్ సింగ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సుఖదేవ్ వంటి వారి జీవితాల నుండి, వారి ఆత్మ త్యాగాల నుండి ప్రతి యువతీ యువకుడు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అన్నారు. త్యాగం చేసిన వ్యక్తులు మాత్రమే చరిత్రలో ఉండిపోతారని, మిగిలిన వారు కేవలం సాధారణ వ్యక్తులుగా మిగిలిపోతారని అన్నారు. ఎక్కడో కుటుంబాలను వీడి దేశ సరిహద్దుల్లో దేశ సేవ చేస్తున్న సైనికులు, శత్రు సేనలను తుద ముట్టించటంలో అమరవీరులై వీరోచిత సేవలు అందచేస్తారని, వారి త్యాగాలతో పోల్చితే మనం మన గ్రామాల్లో చేసే సేవ చాలా అల్పమని, కానీ చిత్త శుద్ధితో ప్రజలకు సేవ చేస్తే తగు గుర్తింపు వస్తుందని ఆయన అన్నారు. అపరిచిత వ్యక్తుల కోసం చేసేది సేవ క్రిందకి వస్తుందని, మనకు తెల్సిన వారి కోసం పనిచేయటం బాధ్యత అని గ్రామ నిర్మాణం భారత్ నిర్మాణ వాలంటీర్ల బాధ్యతగా గుర్తించాలని అన్నారు.

లీడ్ ఇండియా ఫౌండేషన్ నుండి వచ్చిన రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ సుదర్శనాచార్య మాట్లాడుతూ, 2020 నాటికి దేశ జనాభాలో 75 శాతం



యువతే ఉండ బోతున్నారని, యువత సక్రమ నడవడికను అలవర్చుకొని జాతి నిర్మాణంలో భాగస్వామ్యులు కానట్లయితే దేశ ప్రగతి ఆశించిన రీతిలో ఉండదని అన్నారు. జాతిని పునర్‌నిర్మించే ప్రక్రియలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో ప్రజలకు వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్గించాలన్నారు. కార్యకర్తలు క్రమ శిక్షణతో, అంకిత భావంతో మెలిగి ప్రజా సేవకు పునరంకితం కావాలని ఉద్బోధించారు. వ్యక్తి అభివృద్ధికి విజ్ఞానం, నైపుణ్యం, ప్రవృత్తి / వైఖరి ముఖ్యమని, ఈ మూడింటిని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. 2020 నాటికి భారత దేశంలో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం ఇత్యాది సమస్యలన్నీ తీరాలంటే యువత నడుంబిగించక తప్పదని ఆయన అన్నారు. మీరు అభివృద్ధి చెంది, దేశాన్ని అభివృద్ధి చేయండి అని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాలు అభివృద్ధి అవ్వాలంటే యువత ప్రధానంగా బాధ్యత తీసుకోవాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో శిక్షకులుగా పాల్గొన్న వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు మాధవ, ఫ్రీలాన్స్ రిపోర్టర్ రమేష్ తదితరులు భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు వివిధ అంశాలపై శిక్షణ అందచేసారు. ఈ సందర్భంగా అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ప్రోత్సహించే నిమిత్తం వ్యక్తిత్వ వికాస శిక్షణ, భావ ప్రసార నైపుణ్యాలపై శిక్షణలు త్వరలో అందచేయనున్నట్లు తెలియచేసారు. ■






# రహదారి భద్రతపై రవాణా శాఖ సిబ్బంది శిక్షణావసరాల గుర్తింపు

**గ్రామీణ ప్రజల సాధికారత కోసం, సుస్థిర ప్రాతిపదికన సామర్థ్యాల పెంపుకోసం ఇప్పటికే కృషి చేస్తున్న అపార్డ్ రహదారి భద్రతపై గ్రామీణ ప్రజలలో అవగాహన పెంపొందించడానికి పలు కార్యక్రమాలు చేపట్టనున్నదని అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి , ఐఏ.ఎస్. అన్నారు. రహదారి భద్రతపై రవాణా శాఖ సిబ్బంది శిక్షణావసరాలు తెలుసుకోవటానికి అపార్డులో ఏప్రిల్ 13న ఒక రోజు వర్క్‌షాప్‌ను ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ నిర్వహించింది.**

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవాణాశాఖ కమీషనర్ శ్రీ ఎల్. ప్రేమ్ చంద్రారెడ్డి ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, ప్రజలలో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించే క్రమంలో ముందుగా రవాణాశాఖలో పనిచేసే సిబ్బంది సంబంధిత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవలసిన అవసరం ఉందని, సిబ్బంది సామర్థ్యాల పైనే శాఖ పనితీరు ఆధారపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రహదారి భద్రతలో గల వివిధ కోణాలపై చర్చించారు.

రవాణా శాఖలోని వివిధ స్థాయిలలోని అదికారులకు సామర్థ్యాల పెంపుదలకుగాను శిక్షణా అవసరాలు గుర్తించటానికి, శిక్షకులను గుర్తించటానికి శిక్షణా వ్యూహాన్ని తయారు చేయటానికి ఉద్దేశించి ఈ వర్కుషాపును నిర్వహిస్తున్నట్లు తెలియచేసారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న రహదారి భద్రతా రంగ నిపుణులు శ్రీ ఎ. నాగేశ్వరరావు, రహదారుల డిజైను, వాహనాల క్రమబద్దీకరణ, నిర్ణయీకరణ నైపుణ్యాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ వర్కుషాపులో పాల్గొన్న 20 మంది రహదారి భద్రతా నిపుణులు, రవాణా శాఖ అధికారులు 2 బృందాలుగా విడిపోయి, చర్చలు జరిపి శిక్షణావసరాలు, శిక్షణా విషయాలు గుర్తించారు. గుర్తించిన శిక్షణ అవసరాలలో ప్రధానంగా మోటారు వాహనాల చట్ట నిబంధనలు, సాంకేతిక నైపుణ్యాలు, పరిపాలనా నైపుణ్యాలు, టాక్సులు వేసే విధానం, కంప్యూటర్ నైపుణ్యాలు తదితరాలు ఉన్నాయి. ■



# జీరో బడ్జెట్ ఫార్మింగ్‌తో రైతులకు లాభాలు





విత్తనాలకు, పురుగు మందులకు, ఎరువులకు తదితరాలకు మూలధన పెట్టుబడి లేకుండా లాభాలు ఆర్జించి పెట్టేందుకు జీరో బడ్జెట్ సహజ వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తే రైతులు లాభ సాటిగా వ్యవసాయం చేయవచ్చని శ్రీ రవి శంకర్ అన్నారు. ఏప్రిల్ 15 న శ్రీ రవిశంకర్, తన బృందంతో చీదేడు గ్రామాన్ని సందర్శించారు.

చీదేడు గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో పాల్గొన్న శ్రీ రవిశంకర్ మాట్లాడుతూ జీరో బేస్డ్ సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించటం ద్వారా గ్రామంలో పండే సహజ పంటలైన వరి, జొన్న, కందులు, ఆముదం వంటి పంటలను పురుగు మందులు, ఎరువులు వినయోగించకుండా వండించవచ్చని తెలియచేసారు. ఈ సహజ వ్యవసాయ పద్ధతి పాటించటానికి పెద్దగా పెట్టుబడి అవసరం లేదని, మూలధనం కోసం బ్యాంకుల చుట్టూ తిరగనవసరం లేదని ఆయన రైతులకు వివరిస్తూ, కేవలం ఒక్క ఆవు ఉంటే సరిపోతుందని, ఈ ఆవు సాయంతో 30 ఎకరాల వరకూ ఈ పద్ధతిలో సాగుచేయవచ్చని చెప్పారు. జీరో బేస్డ్ సహజ వ్యవసాయ పద్ధతిలో బీజామృతం తయారు చేసే విధానం, జీవామృతం చేసే విధానం, ఘన జీవామృతం, మల్చింగ్, మిశ్రమ పంటల విధానం అవలంబించటం వంటి వాటిపై రైతులకు అవగాహన కలుగచేసారు. శ్రీ రవిశంకర్‌తో చర్చించిన చీదేడు గ్రామ రైతులు ఈ జీరో బేస్డ్ వ్యవసాయ పద్ధతులను అనుసరించి సేద్యం చేయటానికి ఆసక్తి కనబర్చారు. గ్రామంలోని 30 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలో నిరుపయోగంగా వదిలి వేసిన 50 ఎకరాల వ్యవసాయ భూమిలో జీరో బేస్డ్ సహజ వ్యవసాయ పద్ధతిలో సేద్యం చేయటానికి సుముఖత వ్యక్తం చేసారు. ఈ పద్ధతిలో మరింత లోతైన నైపుణ్యాల కోసం ప్రత్యేక శిక్షణ అందచేయటానికి శ్రీ రవిశంకర్ సంసిద్ధత వ్యక్తం చేసారు. అపార్డ్ కూడా ఇందుకు సన్నాహాలు చేస్తోంది. ■

# నోముల గ్రామంలో సుస్థిర వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసిన

# చీదేడు రైతులు



**సుమారు 30 మంది చీదేడు గ్రామ రైతులు ఏప్రిల్ 14 న నోముల గ్రామంలో పెట్టుబడి లేకుండా, తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమ శక్తితో, ఎరువులు, పురుగు మందులు వాడకుండా శ్రీ వరి సాగు చేస్తున్న రైతు గండయ్య, రైతు నరసమ్మల పొలాన్ని సందర్శించి వారు సాగు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు.**

ఈ సందర్భంగా గండయ్య ఈ వ్యవసాయ సాగు విధానాన్ని రైతులకు వివరించారు. భూమిని దున్ని జమ్ముకొట్టిన తర్వాత మార్కర్ త్రిప్పి వరుసగా సాళ్ళలో 20 సెం.మీకు ఒక విత్తనం నాటుతారు. ఈ విధానం వల్ల ఒక ఎకరానికి 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. సాంప్రదాయ విధానంలో ఎకరానికి 25 నుండి 30 కిలోల విత్తనాలు అవసరమౌతాయి. మొక్కలు పెరిగిన తర్వాత తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలుగా వీడర్‌ను తిప్పి కలుపు మొక్కలను పెకిలించివేస్తారు. ఈ కలుపు మొక్కలు మట్టిలో కలిపి కంపోస్ట్ ఎరువుగా తయారయి భూమికి ఎంతో బలాన్ని చేర్చుతాయి. కంపోస్ట్



ఎరువు తయారు చేసే క్రిములు భూమిని కూడా గుల్ల చేయడం వల్ల నేల మొత్తం గుల్లగా తయారై మొక్కలకు అవసరమైన గాలి తగులుతుంది. ఈ వీడర్‌ను 15 రోజుల కొకసారి మొత్తం పంటకాలంలో సుమారు మూడుసార్లు త్రిప్పవలసి ఉంటుంది. ఈ పొలంలో ద్రవామృతం అనగా పశువుల పేడను కుండలో తీసుకొని దానికి పశువుల మూత్రాన్ని కలిపి 4,5 రోజులు ఉంచాలి. ఈ కుండను నీటి ప్రవాహం దగ్గర ఉంచినట్టయితే నీటి ప్రవాహానికి ఎరువు పొలం మొత్తం వ్యాపించి మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ సాగుకు 4, 5 రోజుల కొకసారి నీటిని అందించవలసి ఉంటుంది. నీరు నిల్వ ఉండనవసరం లేదు. తద్వారా తక్కువ నీటిని మాత్రమే వాడుకోవచ్చు. ఈ విధానం వలన పెట్టుబడి లేకుండా, ప్రకృతి సిద్ధమైన ఎరువును వాడి, తక్కువ పరిమాణం నీటిని ఉపయోగించి ఎకరానికి 30 నుండి 40 బస్తాల దిగుబడిని పొందుతున్నట్లు గండయ్య తెలియచేసాడు. ఈ విధానం చీదేడు రైతులను ఎంతో ప్రభావితం చేసింది. తాము కూడా ఈ విధానం వల్ల శ్రీవరిసాగు చేయాలని నిశ్చయించుకున్నారు.



మహిళా రైతు నరసమ్మ కూడా సుస్థిర వ్యవసాయ పద్ధతులను గూర్చి వివరించారు. ఆమె తన పొలంలో సాగుచేస్తున్న 36 మోడల్ ఎన్.పి.యం. ( సుస్థిర వ్యవసాయం) పద్ధతి ద్వారా 36 చ. అడుగుల విస్తీర్ణంలో ఏక కాలంలో 7 రకాల పంటలు వీటిలో దుంప జాతికి చెందిన కూరగాయలు, తీగ జాతికి చెందిన కూరగాయలు, పండ్ల చెట్లు, బహువార్షిక పంటలైన కంది, వార్షిక పంటలైన గోరు చిక్కుడు, క్యాబేజీ, సోయాబీన్ మొదలైనవి పండిస్తోంది. ఈ విధానంలో తీగ జాతి మొక్కల ఆకులు, బహువార్షిక పంటల చెట్ల నీడకు భూమిలోని తేమ కాపాడబడి పంటలకు ఉపయోగపడుతున్నాయి. ఈ విధానం వల్ల చదరపు అడుగుకు 1000 రూపాయల వంతున సంవత్సరానికి 36000 రూపాయలు వరుసగా 3 సంవత్సరాల నుండి ఆదాయం పొందగల్గుతున్నారు. ఈ పద్ధతివల్ల కూడా తక్కువ ఖర్చుతో ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం గల పంట చేతికి రావడం కూడా చీదేడు రైతులను ఎంతో ప్రభావితుల్ని చేసింది.

ఈ పై విధానాలు రైతులను ఎంతో ఆకర్షించి తాము కూడా జీరో బడ్జెట్, తక్కువ మంది కూలీలతో, ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి సిద్ధమైన ఎరువులు ఉపయోగించి ఎక్కువ మొత్తంలో పంట ఉత్పత్తిని సాధిస్తామని చీదేడు గ్రామ రైతులు చెప్పారు.

**వి. లక్ష్మీ నారాయణ**

# పీసా చట్టంపై శిక్షణ






**షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరించిన పంచాయితీరాజ్ చట్టం 'పీసా' నిబంధనలపై శిక్షణ అందించటానికిగాను ప్రజాప్రతినిధులు, అధికారుల శిక్షణా అవసరాలు గుర్తించటానికి అపార్డు, ఎన్.ఐ.ఆర్.డి.లు రంపచోడవరంలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, రంపచోడవరంలో ఒకరోజు వర్క్‌షాపును నిర్వహించాయి. ఈ వర్కుషాపులో ఏజన్సీ ఏరియాలోని 7 మండలాలలోని 120 గ్రామపంచాయితీల ప్రతినిధులుగా 28 మంది సర్పంచ్‌లు, ముగ్గురూ మండలపరిషత్ అధ్యక్షులు, 12 మంది మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, 11 మంది అధికారులు పాల్గొన్నారు.**

ఈ కార్యక్రమాన్ని సమన్వయపర్చిన అపార్డు ఫాకల్టీ శ్రీ స్టీవెన్‌నీల్ దేశంలో పీసా చట్టం 1996 రూపొందించటానికి దారితీసిన పరిస్థితులు - పీసా చట్టాన్ని అమలు చేయటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తీసుకొన్న చర్యల గూర్చి క్లుప్తంగా వివరించి, వర్కుషాపు ఉద్దేశాలను వివరించారు.

వర్కుషాపును ప్రారంభించిన ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు అధికారి శ్రీ రోనాల్డ్ రాజ్ ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, పీసా చట్టం గిరిజన ప్రాంతాలలోని పంచాయితీరాజ్ సంస్థలను మరింత సాధికారం చేస్తుందని, గ్రామసభలకు ఇచ్చిన విశేషమయిన అధికారాల ద్వారా గిరిజనుల సంక్షేమానికి కృషి చేయటానికి పంచాయితీలకు ఒక చక్కని సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. పీసా చట్ట నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం నిబంధనలపై ఒక చక్కని అవగాహన ఏర్పర్చుకుంటే ప్రజాప్రతినిధులు చక్కగా రాణించవచ్చని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యుడు శ్రీ కె.వి.వి.ఎస్. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ఈ సదస్సుకి హాజరైన ప్రజాప్రతినిధులు తమకు ఏవిధమైన శిక్షణ అవసరమో అపార్డుకి, ఎన్.ఐ.ఆర్.డి. కి సూచించాలని తెల్పారు. ఇదే కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక పార్లమెంటు సభ్యులు శ్రీమతి టి. రత్నాబాయి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలలో సంస్కృతిని, సంప్రదాయాలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం పీసా చట్టం రూపొందించిందని, పీసా చట్టం షెడ్యూల్డు ఏరియాలకు ఒక వరమని తెలియచేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పీసా చట్ట నిబంధనలపై ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టానికి అనుగుణంగా నిబంధనలు జారీచేయటం ఒక శుభపరిణామమని అన్నారు. ఈ వర్కుషాపులో పాల్గొన్న న్యాయనిపుణులు శ్రీ త్రినాధరావు ఆంధ్ర పంచాయితీరాజ్ చట్టాన్ని అనుసరించి జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులు 66లోని ముఖ్య అంశాలు వివరించారు.

కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రా. అన్నామలై, స్టీవెన్‌నీల్‌లు సదస్సులో పాల్గొన్న సభ్యులను 3 బృందాలుగా విభజించి

1) పీసా చట్టం అమలుపై ఎటువంటి సామర్థ్యాలు అవసరం,
2) పీసా చట్టంపై ప్రజాప్రతినిధుల, అధికారులు ఎటువంటి బాధ్యతలు నిర్వర్తించాలి,
3) శిక్షణా కాలం ఎంత ఉండాలి, తదితర విషయాలపై చర్చను చేపట్టారు.

చర్చల అనంతరం శిక్షణలో అందచేయాల్సిన విజ్ఞానం, నైపుణ్యం, వైఖరులకి సంబంధించిన విషయాంశాలను గుర్తించారు. మొత్తం మీద రంపచోడవరంలో జరిగిన ఒకరోజు సదస్సులో పీసా చట్టనిబంధనలపై రూపొందించవలసిన శిక్షణా మాన్యువల్ రూపురేఖలు ఆవిష్కృతమయ్యాయి. ఈ కార్యక్రమంలో సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ శ్రీ ఎన్. మధుసూదన్, ఫాకల్టీ శ్రీ రవిశంకర్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ పి.వి.వి. సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ■

# ‘పీసా’ చట్టం గురించి తెలుసుకుందాం!

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

**సంక్షిప్తము**

**నిబంధనావళి - షెడ్యూల్డు ప్రాంతములకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీల విస్తరీకరణ (పీసా) నిబంధనావళి, 2011 - ఉత్తర్వులు - జారీ చేయడమైనది.**

---

**పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి (మండల-1) శాఖ**

**జి.ఓ.ఎం.ఎస్.నెం.66** **తేది: 24-03-2011**

**చట్టం సంఖ్య 7, 1998, 16-1-1998 ముద్రితము**

**ఉత్తరువు**

రాజ్యాంగపు IX భాగం అంశాలను భారత రాజ్యాంగ 73వ సవరణ ప్రకారము రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరిస్తు భారత ప్రభుత్వం పంచాయతీల (షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరీకరణ) చట్టం, 1996 (చట్టం సంఖ్య 40/1996) రూపొందించినది. దీనిననుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994 (చట్టం సంఖ్య 13/1994)ను సవరించి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (సవరణ) చట్టం 1998 (చట్టం సంఖ్య 7/1998)ను రూపొందించినది. ఈ చట్టం షెడ్యూల్డు ప్రాంతాలలోని స్థానిక ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, సామాజిక వనరులు, వారి ఆచారములను అనుసరించి వివాదములను పరిష్కరించుటకు మరియు చిన్నతరహా అటవి ఉత్పత్తుల యాజమాన్యము, మున్నగు విషయములలో గ్రామసభ మరియు గ్రామ పంచాయతీలకు విశేష అధికారములు కల్పించినది.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (సవరణ) చట్టం, 1998 అమలు షెడ్యూలు-V ప్రాంతాలలోని ప్రజలకు స్వయం పాలనాధికారాన్ని అందిస్తూ, గ్రామసభలకు కీలక పాత్రనిస్తూ తగరక్షణలు కల్పిస్తుంది.

తదనుగుణముగా ఈ క్రింది ప్రకటన 24-03-2011న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకమైన గెజిట్‌లో ప్రచురితమైనది.

**ప్రకటన**

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని VI -A విభాగమునందలి 268 సెక్షన్ యొక్క (1)వ ఉపసెక్షన్ మరియు సెక్షన్ 242-A నుండి 242-I ద్వారా సంక్రమించిన అధికారములతో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరీకరణ నిబంధనావళిని జారీ చేసినారు.

**1. సంగ్రహ నామము, పరిధి మరియు ఆరంభము:**

i. ఈ నిబంధనలను 2011, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అనునూచిత ప్రాంతాల విస్తరణ నియమావళిగా వ్యవహరించనగును.

ii. ఈ నియమావళి, 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం అమలులో ఉండే అన్ని అనుసూచిత ప్రాంతాలన్నిటికి విస్తరించి ఉంటుంది.

iii. ఈ నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయి.

**2. నిర్వచనములు :**

I. ఈ నియమావళిలో, సందర్భం ఇతర విధంగా అవసర మయినప్పుడు మినహా

i) ‘చట్టము’ అనగా 1998 (1998లో 7వ చట్టం) పంచాయతీ రాజ్ చట్టము ద్వారా సవరించిన 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం,

ii) ‘గ్రామసభ’ అనగా 4వ నియమం ద్వారా అమలులోనికి వచ్చే గ్రామసభ.

iii) ‘చిన్నతరహా నీటి వనరులు’ అంటే త్రాగు నీటికి, ఉపయోగించే చెక్ డ్యాములు నిర్మాణం, 40 హెక్టార్ల వరకు నీటిని కల్పించడం కోసం ఉపయోగించిన సహజ నీటి వనరులు అని అర్థం.

iv) ‘అనుసూచిత ప్రాంతము’ అనగా భారత రాజ్యాంగములోని 5వ అనునూచిలోని 6వ పేరా క్రింద ప్రకటించినట్టి అనుసూచిత ప్రాంతములు.

v) ఈ నియమావళి ఉద్దేశాల కోసం కమీషనరు అంటే గిరిజన సంక్షేమ శాఖ కమీషనరు అని అర్థం.

II ఈ నిబంధనలలో ఉపయోగించి నిర్వచించని పదజాలాలకు, నిర్వచించిన మాటలకు, గనులు ఖనిజాల (క్రమబద్దీకరణ అభివృద్ధి) చట్టము, 1957; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత

ప్రాంతాల భూ బదిలీ నిబంధనావళి, 1959; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల వడ్డీ వ్యాపారస్తుల నియంత్రణ నిబంధనావళి, 1960; ఆంధ్రప్రదేశ్ గిరిజన ఋణ విమోచన నిబంధనావళి, 1960; ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తుల, పశుగణం) చట్టం, 1966; ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, 1967; ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం, 1968; ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల చిన్న తరహా అటవీ ఉత్పత్తుల వర్తకం క్రమబద్ధీకరణ నిబంధనావళి, 1979; ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1998 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ దారులచే నిర్వహించే సాగునీటి వ్యవస్థల యాజమాన్య చట్టం, 1997, షెడ్యూల్డు తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 లేదా ఏదేని ఇతర అట్టి చట్టంలో వాటికి నిర్వచించిన అర్థమే కలిగి ఉంటుంది.

### 3. అనుసూచిత ప్రాంతాలలో గ్రామలను ప్రకటించడం:

పంచాయతీరాజ్ చట్టంలోని 3వ విభాగం నిమిత్తం.

i) శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాలలోని అనుసూచిత ప్రాంతాలలో గ్రామాల జాబితాను రూపొందించవలసిందిగా సంబంధిత జిల్లాల కలెక్టర్లను కమీషనరు కోరనగును.

ii) జనావాసం/శివారు గ్రామలు/లేదా గ్రూపులు తమ సంప్రదాయాలు, ఆచారాలను అనుసరించి తమ వ్యవహారాలను నిర్వహించే వర్గం లేదా వర్గాలు ఉన్న గ్రామం.

iii) అట్టి అభ్యర్థన అందిన మీదట, జిల్లా కలెక్టరు పి.ఓ., ఐ.టి.డి. ఏతో సంప్రదించి, జానావాసం/ శివారు గ్రామం లేదా వాటి గ్రూపులతో ఉన్న గ్రామలు కలిగిన ఒక ప్రతిపాదనను రూపొందించవచ్చును.

iv) ఆ విధంగా రూపొందించిన ప్రతిపాదన/ప్రతిపాదనలను కమీషనరుకు సమర్పించాలి. కమీషనరు ఆ ప్రతిపాదనను సమీక్షించిన మీదట, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ మరియు మహబూబ్‌నగర్, జిల్లాలలోని అనుసూచిత ప్రాంతాలలోని గ్రామాలను ప్రకటిస్తారు.

### 4. గ్రామసభ, దాని విధులు :

i) పై విధంగా ప్రకటించినట్టి ప్రతి గ్రామనికి గ్రామస్థాయిలో ఓటర్ల జాబితాలో ఎవరి పేర్లను చేర్చడం జరిగిందో అట్టి వయోజనులతో గ్రామసభ ఉండాలి.

ii) గ్రామ పంచాయతీ సర్పంచి గ్రామసభకు అధ్యక్షుడు. దిగువ నిర్దిష్ట పరచిన కార్య విధానం ప్రకారం గ్రామసభ ఒక ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని ఎన్నుకోవాలి.

iii) సంబంధిత ఐ.టి.డి.ఏ. పి.ఓ., ఈ నియమావళి క్రింద మొట్టమొదటి గ్రామసభను నిర్వహించడానికి డిప్యూటి తహసీల్దారు హోదాకు తక్కువ కానట్టి ఒక అధికారిని డిప్యూట్ చేయాలి. ఆ విధంగా నిర్వహించిన సమావేశానికి సంబంధిత పంచాయతీ సర్పంచు అధ్యక్షత వహించాలి. సర్పంచు గైర్హాజరీలో సాంప్రదాయ గ్రామ పెద్ద/జనావాస స్వయం సహాయక గ్రూపు గ్రామసభకు అధ్యక్షత వహించనగును.

iv) గ్రామసభ సమావేశానికి కోరం, గ్రామసభ సభ్యులలో కనీసం 50 శాతం ఎస్.టి సభ్యులలో 1/3వ వంతు కంటే తక్కువగా ఉండరాదు.

v) గ్రామసభ, ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని గ్రామ సభ్యులలో నుండి ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షుడు, కార్యదర్శి షెడ్యూల్డు తెగకు చెందిన వారై ఉండాలి. పదవీకాలం 5 సంవత్సరాలు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎంపిక విధానం చేతులు ఎత్తడం ద్వారా ఉంటుంది.

vi) గ్రామసభ శాసనపరమైన సమావేశాలను ఏడాదిలో కనీసం రెండుసార్లు నిర్వహించాలి. అయితే, శాసనపరమైన సమావేశాలకు అవసరమైనప్పుడు అదనంగా, గ్రామసభ నిర్ణయించినట్టి ప్రదేశం, సమయంలలో సమావేశం కావచ్చును.

vii) హాజరు పట్టీని నిర్వహించాలి. అందులో అధ్యక్షత వహించే సభ్యుడు సందర్భాన్ని బట్టి గ్రామసభకు హాజరైన సభ్యులందరి సంతకాలను లేదా వేలిముద్రలను తీసుకోవాలి.

viii) ప్రతి గ్రామసభ సమావేశం ముగిసిన పిమ్మట గ్రామసభ ప్రొసీడింగులను ప్రిసైడింగు అధికారి చదివి వినిపించి, సభ్యుల ఆమోదం పొందాలి. తీర్మానపు ప్రతి అంశాన్ని



ప్రత్యేకంగా రికార్డు చేయాలి. ఆమోదాన్ని లేదా ఇతరమైన వాటిని గ్రామసభ ఆమోదం పొందాలి. సభ్యులు తమ ఆమోదాన్ని చేతులు ఎత్తడం ద్వారా తెలియజేయాలి.

ix) గ్రామసభ సమావేశాలలో ఆమోదించిన తీర్మానాలను ఒక రిజిస్టరులో నమోదు చేసుకోవాలి. గ్రామసభ కార్యదర్శి/ ఉపాధ్యక్షుడు సందర్భాన్ని బట్టి సభ్యుల సంతకం/ వేలిముద్ర లను తీసుకోవాలి.

x) ఈ తీర్మానాలను నాలుగు వారాలలోపు గ్రామసభ కార్యదర్శి ప్రభుత్వ ఎజెన్సీ/ సంస్థలకు/ సంబంధిత శాఖలకు పంపాలి.

xi) గ్రామసభ సమక్షంలో పరిశీలనార్థం ఈ క్రింది విషయాలను సమర్పించాలి.

ఎ) గ్రామ వ్యవసాయ ఉత్పత్తి ప్రణాళికలు.

బి) గ్రామాలలో ఉన్న పంచాయతీకి చెందిన పోరంబోకు భూముల ప్రదేశాల జాబితా, ఇతర సంబంధిత వివరాలు.

సి) ఇళ్ళ యాజమాన్యాలు, ఇతర స్థిరాస్థుల బదిలి జాబితా.

డి) గ్రామ పంచాయతీ ఆమోదించిన బడ్జెట్ అంచనాల ఒక ప్రతిని.

ఇ) పంచాయతీ అకౌంట్లపై ఆడిట్ నివేదిక ప్రతినొకదానిని.

(ఎఫ్) గ్రామ పంచాయతీకి రావలసిన పన్నులు, రుసుముల బకాయిలు ఉన్న బకాయిదారుల జాబితా.

జి) చౌక ధర దుకాణం / డి.ఆర్.డిపో పనితీరు.

హెచ్) అంగన్‌వాడీ పనితీరు.

జె) పాఠశాలల పనితీరు.

కె) సంక్షేమ హాస్టళ్ళ పనితీరు.

ఎల్) త్రాగునీటి సౌకర్యం.

ఎమ్) విద్యుత్ సౌకర్యం.

ఎన్) ఏదేని ఇతర అభివృద్ధి కార్యక్రమాలు.

xii) గ్రామసభ ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక పరిస్థితులను రూపొందించి ఆమోదించాలి. ఇందులో గ్రామ, మానవ, ప్రకృతి సిద్ధమైన వనరులను చేర్చాలి. అక్షరాస్యతా స్థాయిలు, భూమి లేని కుటుంబాలు, మహిళలు యజమానులుగా ఉన్న కుటుంబాల, ఇంతవరకు అందించిన ప్రయోజనాలతో పాటు వాటి ప్రస్తుత పరిస్థితులు, గ్రామ సమస్యలు వాటి ప్రాధాన్యత మున్నగు వాటిని భాగస్వామ్య గ్రామీణ మదింపు పరికరాల ద్వారా రూపొందించాలి.

xiii) జనావాస ప్రాంతాలలో వ్యక్తిగత/సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి అమలు చేయాలి.

xiv) గ్రామ అభివృద్ధి ప్రణాళికలు, ప్రయోజనాల ప్రాధాన్యత, పథకాలను రూపొందించడంలో ప్రాజెక్టు అధికారి ఏర్పాటు ఏర్పాటు చేసిన బహుళ క్రమశిక్షణా బృందాలు, సంబంధిత గిరిజనాభివృద్ధి ఏజన్సీ లేదా ఏదేని ఇతర ప్రభుత్వ ఏజన్సీల సలహాలను/సహాయాన్ని మండల ప్రజా పరిషత్తు కోరవచ్చును.

xv) గ్రామసభకు విడుదల చేసిన నిధుల విషయంలో సంబంధిత ఏజన్సీ/ ప్రభుత్వ శాఖకు నిధుల వినియోగ ధృవ పత్రాన్ని సమర్పించాలి.

## 5. అనుసూచిత ప్రాంతాలలో భూసేకరణ:

1. ఏదేని చట్టం క్రింద భూసేకరణకు ప్రభుత్వం ప్రతిపాదించి నట్లయితే, ప్రతిపాదనలతో పాటు ఈ క్రింది తెలియజేసిన సమాచారాన్ని మండల ప్రజా పరిషత్తుకు ప్రభుత్వం లేదా సంబంధిత అధికార వర్గం సమర్పిస్తుంది.

   i) ప్రాజెక్టు సంభావ ప్రభావంతో పాటు ప్రతిపాదిత ప్రాజెక్టు పూర్తి వివరాలు.

   ii) ప్రతిపాదిత భూసేకరణ.

   iii) గ్రామంలో క్రొత్తగా స్థిరపడే ప్రజలు, ఆ ప్రాంతం, సమాజం లో సంభావిత ప్రభావం.

   iv) గ్రామ ప్రజలకు ప్రతిపాదిత భాగస్వామ్యం, నష్టపరిహార మొత్తం, ఉద్యోగాల అవకాశాలు.

2. పూర్తి సమాచారం అందిన పిదప, సంబంధిత మండల ప్రజా పరిషత్తు సంబంధిత అధికారుల ప్రతినిధులను, ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఈ ప్రతిపాదనలను పరిశీలించడంకోసం పిలవడానికి అధికారం కలిగి ఉంటుంది. ఆ విధంగా పిలవబడినట్టి వ్యక్తులందరూ అంశంవారీగా స్పష్టమైన, ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వవలసి ఉంటుంది.

3. మండల ప్రజా పరిషత్తు అన్ని వాస్తవాలను పరిశీలించిన పిదప ప్రతిపాదిత భూసేకరణ, భూములను కోల్పోయే వ్యక్తులకు పునరావాస ప్రణాళిక వంటి విషయాల గురించి సిఫారసు చేయాలి.

4. భూసేకరణాధికారి మండల ప్రజా పరిషత్తు సిఫారసును పరిశీలించాలి.

5. మండల ప్రజాపరిషత్తు సిఫారుసులతో భూసేకరణ అధికారి అంగీకరించని సందర్భంలో పరిశీలనకోసం ఆ కేసును తిరిగి మండల ప్రజాపరిషత్తుకు పంపుతారు.

6. రెండవసారి పరిశీలించిన పిదప కూడా భూసేకరణ అధికారి మండల ప్రజా పరిషత్తు సిఫారుసులకు వ్యతిరేకంగా ఒక ఉత్తర్వును జారీ చేసినట్లయితే, వ్రాత పూర్వకంగా అందుకు గల కారణాలను ఆయన రికార్డు చేయాలి.

7. పారిశ్రామిక ప్రాజెక్టులను నెలకొల్పే సందర్భంలో అట్టి ప్రాజెక్టులవల్ల ప్రభావితమయ్యే అన్ని మండల ప్రజాపరిషత్తులను సంప్రదించాలి.

8. భూసేకరణ ప్రకటన తేదీ నుండి ప్రతి మూడు నెలల తరువాత పునరావాస ప్రణాళిక ప్రగతిని మండల ప్రజాపరిషత్తు సమక్షంలో ఉంచాలి.

9. మండల ప్రజాపరిషత్తు దృష్టిలో సూచించిన చర్యలను తీసుకోవడంలేదని భావించినట్లయితే, మండల ప్రజా పరిషత్తు ఈ విషయమై వ్రాతపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరచాలి. రాష్ట్ర ప్రభుత్వం సముచిత చర్య తీసుకోవాల్సి ఉంటుంది.

10. ఆర్. ఆర్. ప్యాకేజిలో ఈ క్రింద తెలియజేసిన అంశాలు తప్పనిసరిగా ఉండాలి.

ఎ) ఎస్. టి. కేటగిరీకి చెందిన ప్రాజెక్టు బాధిత ప్రతి కుటుంబానికి, ఆయకట్టులో భూ కేటాయింపు విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి.

బి) సాంప్రదాయ హక్కులు/అటవీ ఉత్పత్తుల వినియోగం వంటి నష్టాలకు 500 రోజుల కనీస వ్యవసాయ వేతనాలకు సమానమైన అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రాజెక్టు బాధిత ప్రతి గిరిజన కుటుంబానికి అందించాలి.

సి) ప్రాజెక్టు బాధిత గిరిజన కుటుంబాలవారు కోరుకున్న సహజ, నైవాసిక ప్రాంతానికి సమీపంగా పునరావాసం కల్పించాలి. సాధ్యమైనంతవరకు ఒక సంఘటిత బ్లాకులో వారికి పునరావాసం కల్పించాలి. దీనివల్ల వారి నైతిక, భాషాపరమైన, సాంప్రదాయ గుర్తింపులను కొనసాగించడానికి వీలుంటుంది.

డి) నది/కుంట/డ్యామ్‌లో చేపలు పట్టే హక్కుగల ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు రిజర్వాయరు ప్రాంతంలో చేపలు పట్టే హక్కును కల్పించాలి.

ఇ) ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలోని గిరిజన కుటుంబాలను షెడ్యూల్డు ఏరియాలో పునరావాసం కల్పించాలి.

## 6. అనుసూచిత ప్రాంతాలలో చిన్న నీటి వనరుల యాజమాన్యం:

i) గ్రామ పరిధిలోకి వచ్చే నీటి వనరులు గ్రామ జనాభా ప్రయోజనాలకోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళిక యాజమాన్య బాధ్యత గ్రామసభపై ఉంటుంది.




ii) అట్టి నీటి వనరులు ఒకటి లేదా ఎక్కువ గ్రామల ప్రజల ప్రయోజనాలు వర్తిస్తున్నట్లయితే సంబంధిత గ్రామ పంచాయతీ ప్రజల ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళిక యాజమాన్య బాధ్యత గ్రామ పంచాయతీ పై ఉంటుంది.

iii) సంబంధిత గ్రామ పంచాయతీల ప్రజల ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళిక యాజమాన్య బాధ్యత మండల పరిషత్తుపై ఉంటుంది.

iv) అట్టి నీటి వనరుల పరిధి రెండు లేదా ఎక్కువ మండలాల పరిధిలో ఉన్నట్లయితే సంబంధిత మండల పరిషత్తులలో నివసించే ప్రజల ప్రయోజనం కోసం చిన్నతరహా నీటి వనరుల ప్రణాళికా యాజమాన్య బాధ్యత జిల్లా పరిషత్తుపై ఉంటుంది.

v) అట్టి నీటి వనరులు రెండు లేదా ఎక్కువ జిల్లా పరిషత్‌ల పరిధి క్రిందకు వచ్చినట్లయితే అట్టి నీటి వనరుల పరిధులలో నివసిస్తున్నట్టి ప్రజల ప్రయోజనం కోసం నీటి వనరుల ప్రణాళిక యాజమాన్య బాధ్యత సముచిత సంస్థ నిర్వహిస్తుంది.

vi) చిన్నతరహా నీటి వనరుల ప్రణాళికలో క్రొత్త నీటి వనరుల ప్రణాళిక, నిర్మాణం చేరి ఉంటుంది.

vii) చిన్నతరహా నీటి వనరుల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణకు సంబంధించిన అన్ని పనులు సీజన్ సీజన్‌కు ఆయికట్టు నిర్ణయం, నీటి రేటును విధించడం, వాటి వసూలు వినియోగంవంటివి చిన్నతరహా నీటి వనరుల యాజమాన్యంలో చేరి ఉంటాయి.

viii) సందర్భానుసారం గ్రామ పంచాయతి, మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రభుత్వం, సముచిత నీటి రేటును వసూలు చేయాలి. అందుకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపలను

చేపట్టడానికి వీలుగా సంబంధిత నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నట్లయితే వారి మధ్య కుదుర్చుకున్న దామాషా ప్రకారం పంచుకోవాలి.

ix) ప్రభుత్వం, చిన్నతరహా నీటి వనరుల నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం అవసరమైన మొత్తాన్ని సమకూర్చాలి. ఈ గ్రాంటు దామాషా ప్రకారం ఉండాలి. గ్రామ పంచాయతీ ఖాతాకు బదిలీ చేయాలి.

## 7. అనుసూచిత ప్రాంతాలలో చిన్నతరహా ఖనిజాలు :

చిన్నతరహా ఖనిజాల కోసం పారిశ్రామిక లైసెన్సు లేదా గనుల త్రవ్వకం కౌలు మంజూరు.

i) చిన్నతరహా ఖనిజాల కోసం పారిశ్రామిక లైసెన్సు, గనుల త్రవ్వకం కౌలు మంజూరుకు లేక వేలం ద్వారా గనుల త్రవ్వకాల కోసం రాయితి మంజూరుకు షెడ్యూల్డు తెగలకు చెందిన స్థానిక వ్యక్తులు లేదా కేవలం షెడ్యూల్డు తెగలకు చెందిన స్థానిక సభ్యుల సంఘాలు మాత్రమే అర్హత కలిగి ఉంటాయి.

ii) అనుసూచిత ప్రాంతాలలో చిన్నతరహా ఖనిజాల పారిశ్రామిక లైసెన్సు లేదా గనుల త్రవ్వకం కౌలు మంజూరుకోసం అందిన అన్ని దరఖాస్తులను గనుల శాఖ సంబందిత గ్రామ పంచాయతీకి పరిశీలన కోసం పంపాలి.

iii) గ్రామపంచాయతీ 4 వారాలలోపు సముచిత తీర్మానాన్ని వ్యక్తిగత లేదా గిరిజన సొసైటీలు, గిరిజన గనుల త్రవ్వకం సంస్థల విషయంలో తమ ఆమోదాన్ని లేదా నిరాకరణను తెలియజేయాలి.

iv) గ్రామపంచాయతీ నిర్ణయం అంతమమైనదై, కట్టుబడి ఉండాల్సిందై ఉండాలి.

## 8. గ్రామ పంచాయతీ, మండల పరిషత్తుల అధికారాలు, విధులు

### I. ఆబ్కారీ

(ఎ) సంబంధిత శాఖ ఒక గ్రామంలో మద్యం ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పాలనే ఉద్దేశ్యాన్ని సదరు గ్రామంలో మద్యం ఉత్పత్తి లేదా తయారీపై సంబంధిత గ్రామ పంచాయతీ అభిప్రాయం కోసం తెలియపరచాలి. గ్రామసభ 4 వారాలలోపు ఒక తీర్మానం రూపంలో తమ అభిప్రాయాన్ని తెలియజేయాలి. గ్రామసభ తీర్మానాన్ని ఆధారంగా చేసుకొని, గ్రామంలో మద్యం ఉత్పత్తి/తయారీ విషయంలో సంబంధిత శాఖ ఒక నిర్ణయం తీసుకొని సంబంధిత గ్రామసభకు తెలియజేయాలి.

(బి) గ్రామంలో మద్యం దుకాణాలను ప్రారంభించడానికి లైసెన్సులను మంజూరు చేయడానికి ముందు గ్రామసభను సంప్రదించాలి. గ్రామసభ నాలుగు వారాలలోపు తన అభిప్రాయాన్ని తీర్మానం ద్వారా తెలియజేయాలి. లైసెన్సు కేవలం స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలి.

(సి) సంబంధిత గ్రామసభకు తెలియపరుస్తూ గ్రామంలో ఒక మద్యం దుకాణం/బార్‌ను ప్రారంభించడానికి లైసెన్సును మంజూరు చేస్తున్నట్లు లేదా మంజూరు చేయడం లేదని సంబంధిత శాఖ ఒక మౌఖిక ఉత్తర్వును జారీ చేయాలి. గ్రామసభ తీర్మానానికి కట్టుబడి ఉండాలి, అంతిమమైనదిగా ఉండాలి.

(డి) గిరిజనుల వివాహాలు, ఇతర సామాజిక మతపరమైన వేడుకలు, వారి సాంస్కృతిక గుర్తింపు కోసం స్థానిక మద్యాన్ని వినియోగించడానికి వారి వారి సాంప్రదాయాలు, సంస్కృతులకు గౌరవ సూచకంగా వినియోగించడానికి. విక్రయానికి కాకుండా తమ వినియోగం కోసం ఒక గ్రామంలో నివసించే షెడ్యూల్డు తెగల వారు బట్టీ/ఉత్పత్తి చేయడానికి సాంప్రదాయ మద్యం పరిమాణాన్ని గ్రామసభ నిర్ణయించాలి.

### II. చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యం మరియు విక్రయం

(ఎ) చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్యం మరియు విక్రమ హక్కులు గ్రామసభ వ్యక్తిగత సభ్యులకు ఉన్నప్పటికీ ట్రేడ్ రెగ్యులేషన్ 1979, జి.వో.ఎమ్.ఎస్.నెం.20, యస్.డబ్ల్యు (ఎఫ్2) శాఖ, తేది 14-02-1983ను అనుసరించి వెదురు మరియు బీడీ ఆకులు మినహాయించి చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, యాజమాన్య విక్రమ గుత్తాధిపత్య హక్కులు జి.సి.సి.కి చెందుతాయి. అటవీ శాఖ విధి నిర్వహణ ప్రణాళికలను అనుసరించి, శాస్త్రీయ పద్ధతులలో అడవుల అభివృద్ధికి సంబంధిత డివిజన్‌లలో అటవీ శాఖ పాటుపడుతుంది. దీనికి అనుగుణంగా వెదురు మరియు బీడీ ఆకుల నిర్వాహణ, కోత, విక్రయము వంటివి అటవీ శాఖ చేపడుతుంది. వెదురు బీడీ ఆకుల ఆదాయాన్ని సంబంధిత గ్రామసభ ద్వారా సంబంధిత గ్రామసభ సభ్యులకు అందజేస్తుంది.

(బి) జనావాసాలలో చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సేకరించే ఎవరైన వ్యక్తి యాజమాన్యానికి సంబంధించి హద్దుల విషయంలో ఏదైనా వివాదం. తలెత్తినప్పుడు ఆయన/ఆమె సాంప్రదాయకంగా సేకరించిన అట్టి ఉత్పత్తి, వినియోగం మరియు విక్రయం కొరకు గ్రామసభకు తెలియపరచాలి.

(సి) వ్యక్తిగత సేకరణదారుని చిన్నతరహా అటవీ ఉత్పత్తి యాజమాన్య హక్కులపై క్లెయిముల పరిశీలన తరువాత, అట్టి వివాదాన్ని పరిష్కరిస్తూ గ్రామసభ ఒక తీర్మానాన్ని

చేయాలి.

(డి) గ్రామసభ తప్పనిసరిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తి సేకరణ చేసేవారి పేర్లతో ఒక రిజిష్టరును నిర్వహించాలి.

(ఇ) సంబంధిత సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఈ నిబంధనల అమలు తీరుతెన్నులను పర్యవేక్షిస్తాడు.

(ఎఫ్) సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి సంబంధిత పరిధిలోని వెదురు మరియు బీడి ఆకుల ఉత్పత్తుల నిర్వహణా నిమిత్తము ఏర్పరచు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించును.

## III. అనుసూచిత ప్రాంతాలలోని భూముల అన్యాక్రాంతము నిరోధించడం మరియు అన్యాక్రాంతమైన గిరిజనుల భూమిని తిరిగి స్వాధీనం చేయడం

**(1) గ్రామసభ నిర్వహించవలసినవి**

(ఎ) అనుభోక్తలతో సహా పట్టాదారుల పేర్లు, కలిగివున్న భూమి విస్తీర్ణం వివరాలతో ఉన్న భూకమతాదారుల జాబితాను తయారుచేయాలి.

(బి) పట్టాదారు వాస్తవమయిన గిరిజనుడేనా అనే దానికి సంబంధించి పట్టాదారులు అందరి సామాజిక హోదా యదార్థతను పరిశీలించాలి.

(సి) భూములను గిరిజన మహిళ పేరిట కొనుగోలు చేసి, గిరుజనేతరుడు అనుభవిస్తున్నాడా అనే విషయాన్ని పరిశీలించాలి.

(డి) వాంచనీయమయినట్లయితే ఫీల్డును సందర్శించి, కౌలు తనఖా మొదలైన వాటి మీద తీసుకున్న భూములను గిరిజనుడు లేదా గిరిజనేతరుడు సాగు చేస్తున్నారా అనే విషయాన్ని భౌతికంగా పరిశీలించాలి.

(ఇ) ప్రభుత్వ భూమి కేటాయింపు కోసం లబ్ధిదారుల జాబితాను ఆమోదించాలి.

(ఎఫ్) పైన (ఏ)-(ఇ) వరకు పేర్కొనిన అన్ని కేసులలో క్షుణ్ణమయిన దర్యాప్తు తరువాత గ్రామసభ ఆయా సందర్భాలలో సవరించబడిన భూ బదిలీ నిబంధనావళి 1959కి విరుద్ధంగా నిశ్చితమైన కేసులు ఉన్నాయని సంతృప్తి చెందినట్లయితే, గ్రామసభ ఉల్లంఘన వివరాలను పేర్కొంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించాలి. ఆయా సందర్భాలలో సవరించబడిన భూ బదిలీ నిబంధనావళి 1959 క్రింద సమర్థ అధికారి తదుపరి పర్యవసాన చర్యను ప్రారంభించాలి.

**(2)** భూముల స్వాధీనత విషయంలో విభేదాలతో కూడిన కేసులు ఉన్నట్లయితే, గ్రామసభ ఒక సమావేశాన్ని నిర్వహించి, సముచిత తీర్మానాలను జారీ చేయడానికి సంబంధిత వారి నుండి అట్టి క్లెయిమ్‌లకు ఋజువులను సమర్పించ వలసిందిగా కోరి, ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూ బదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్థ అధికారిని తదుపరి పర్యవసాన చర్యను ఆరంభించవలసిందిగా కోరాలి.

**(3)** గిరిజనేతరుడి పేరిట ఏదేని భూమి కేటాయింపుపై ఏదేని ఫిర్యాదు అందిన మీదట లేదా స్వయంగా ఒక సమావేశాన్ని నిర్వహించి, సముచిత తీర్మానాన్ని, ఆ భూమిని అనుసూచిత ప్రాంతంలోని భూమి బదిలీ చేసిన గిరిజనుడికి తిరగి అప్పగించడానికి అవసరమయిన చర్య తీసుకోవడానికి సమర్థ అధికారికి పంపాలి.

**(4)** గ్రామసభ తీర్మానం ద్వారా నష్టపోయిన ఎవరేని వ్యక్తి తీర్మానం తేదీ నుండి 60 రోజుల గడువు లోపల, ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్థ అధికారికి పిటీషనును దాఖలు చేయవచ్చును.

**(5)** ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్థ అధికారి పిటీషనును అనుమతించడం గాని లేదా తిరస్కరించడంగాని లేదా పునః పరిశీలన కోసం సంబంధిత గ్రామసభకు నిర్దేశించడంగాని చేయవచ్చును.

**(6)** అట్టి నిర్దేశం అందిన తరువాత, 30 రోజులలోపు గ్రామసభ సమావేశమై, పిటీషను వాదనలు విని, అట్టి నిర్దేశంపై తీర్మానాన్ని జారీ చేసి, దానిని ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్థ అధికారికి పంపాలి.

**(7)** ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ



నిబంధనావళి, 1959 క్రింద సమర్ధ అధికారి గ్రామసభ తీర్మానాన్ని పరిశీలించి, పిటీషనును ఆమోదిస్తూ గాని లేదా తిరస్కరిస్తూ గాని సముచిత ఉత్తర్వును జారీ చేయాలి.

**(8)** ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్ధ అధికారి తప్పనిసరిగా గిరిజన మరియు గిరిజనేతరునికి జరిగిన భూబదలాయింపు కేసులో సంబంధిత గ్రామసభ వారు పరిశీలించిన అభిప్రాయం కోసం దావా వేసేటట్లు చేయాలి. సంబంధిత గ్రామసభ దావా వేయాలి. గ్రామసభ అభిప్రాయాన్ని తగురీతిగా పరిశీలించాలి.

**(9)** ఆంధ్రప్రదేశ్ అనుసూచిత ప్రాంతాల భూబదిలీ నిబంధనావళి, 1959 క్రింద సమర్ధ అధికారి ప్రతి కేసులో తీర్పు ప్రతులను సంబంధిత గ్రామసభకు సమకూర్చాలి.

**(10)** గిరిజనునికి భూమి స్వాధీనాన్ని పునరుద్ధరిస్తూ, సమర్ధ అధికారి ఆమేరకు గ్రామసభ సభ్యుని నుండి సంతకాన్ని తీసుకోవాలి.

**IV. గ్రామసభ మార్కెట్‌లు/షాండీస్/సంతలు/అంగడులు లేదా ఏ పేరుతో పిలిచినప్పటికీ వాటి నిర్వహణ**

(1) అనుసూచిత ప్రాంతాలలో సంతలను (ఏ పేరుతో పిలిచినప్పటికీ) నిర్వహించడానికి సంబంధిత గ్రామ పంచాయతీ మార్కెట్ కమిటీగా ఉంటుంది.

(2) వారంవారీ మార్కెట్లు ఉన్న (ఏ పేరుతో పిలిచినప్పటికీ) అనుసూచిత ప్రాంతాలలో గ్రామాల పంచాయతీలు అనుసూచిత ప్రాంతాలలో మార్కెట్ కమిటీగా ఈ క్రింది విధులను నిర్వహించాలి.

(ఎ) స్థానిక గిరిజనులకు మాత్రమే లైసెన్సు మంజూరు చేయాలి.

(బి) మార్కెట్ యార్డుల నిర్వహణ, అమలు.

(సి) గ్రామ పంచాయతీలు మార్కెట్ యార్డులో క్రమబద్ధంగా తెరుచుట, మూసివేయు మరియు లావాదేవీలను తాత్కాలికంగా నిలుపుదల చేయు అంశాల క్రమబద్ధీకరణ.

(డి) మార్కెట్ నిర్వహణ అధికారులపై పర్యవేక్షణ

(ఇ) లైసెన్సు షరతుల అమలు.

(ఎఫ్) వ్యవసాయ ఉత్పత్తులు, ఎన్.టి.ఎఫ్. ఉత్పత్తి, పశు సంపదవాటి సంబంధిత ఉత్పత్తులు, అందుకు సంబంధించిన అన్ని మార్కెటింగ్ అంశాలు అమ్మకపు ఒప్పందాలు కుదుర్చుకోవడం, అమలు లేదా రద్దు, తూనికలు, కొలతలు, బట్వాడా చెల్లింపులు మరియు ఇతర విషయాలు క్రమబద్ధీకరణ.

జీవనోపాధి కోసం ఒక సముదాయము/లేక వ్యక్తులు వారు సేకరించిన అటవీ ఉత్పత్తుల విక్రయం కోసం/వినియోగం కోసం హెడ్‌లోడ్, సైకిల్, తోపుడుబండ్ల ద్వారా అటవీ ప్రాంతంలో స్థానిక స్థాయిలోప్రాసెసింగ్, వాల్యు ఎడిషన్, రవాణాతో సహా చిన్నతరహా అటవీ ఉత్పత్తిని విక్రయించడం.

(జి) మార్కెట్ ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తి, ఎన్.టి.ఎఫ్. ఉత్పత్తి మరియు పశు సంపద లేదా పశు సంపద ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన సదుపాయాలను సమకూర్చడం.

(హెచ్) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు, ఎన్.టి.ఎఫ్. ఉత్పత్తి, పశు సంపద లేదా పశు ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తులు వీటికి సంబంధించిన అన్ని విషయాలలో మార్కెటింగ్ సంబంధం గల ఏదేని లావాదేవీలలో కొనుగోలుదారుడు అమ్మకందారులకు ఇతరులకు మధ్యఉత్పన్నమయ్యే అన్ని వివాదాలకు పరిష్కారాలను చూపడం.

(ఐ) ఈ క్రింది విషయములపై సమాచారము స్వీకరించుట, భద్రపరచుట, వివరించుట

(i) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు మరియు పశు సంపదల యొక్క కదలికలు, పశు సంబంధిత ఉత్పత్తులు, ఏదేని ఇతర ఉత్పత్తి విక్రయ ధరలు, మరియు

(ii) ప్రకటిత సరుకుల ఉత్పత్తి, ప్రాసెసింగు, నిల్వ.

(జె) కల్తీని నివారించడానికి గ్రేడింగు ప్రామాణీకరణను పెంపొందించడానికి సాధ్యమయిన చర్యలు తీసుకోవడం.

(కె) పంచాయతీ వసూలు చేయదగిన ఫీజు, చందాలు ఇతర మొత్తాల విధింపు, వసూలు, నిర్వహణ.

(ఎల్) అనుసూచిత ప్రాంతాలలో పైన పేర్కొన్న నిబంధనలను సమర్ధవంతంగా అమలు చేయుటకు అవసరమైన అధికారులను మరియు పనివారలను నియుక్తులను చేయడం.

(ఎం) ప్రకటిత వ్యవసాయ ఉత్పత్తులు మరియు పశుగణ, వాటి సంబంధిత ఉత్పత్తులు మార్కెట్ నిబంధనలకు అనుకూలంగా నిబంధనల ప్రకారం వేలాన్ని నిర్వహించాలి.

(ఎన్) ప్రకటిత వస్తువుల తూకం సక్రమంగా ఉంటునట్లు చర్యలు తీసుకోవాలి.

(ఓ) మార్కెట్ యార్డులోనికి మనుష్యులు మరియు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం.

(పి) సంబంధిత శాఖ నియమాల ప్రకారం పై నిబంధనలు అతిక్రమించిన వారిని ప్రాసిక్యూట్ చేయడం.

(క్యు) ఏదేని దావా, చర్య, ప్రొసిడింగ్ అప్లికేషన్, మధ్యవర్తిత్వం కోసం చర్యను ఆరంభించడం లేదా ఎదుర్కొనడం, అట్టి దావా, చర్య, ప్రొసీండింగు అప్లికేషను లేదా మధ్యవర్తిత్వము విషయంలో రాజీ.

(ఆర్) ఉత్పత్తిదారుడు ప్రత్యక్షంగా తాను పండించిన దానిని అమ్ముకొనుటకు కావలసిన స్థలమును ఏర్పాటు చేయును. ఇన్‌వాయిస్ మరియు బిల్లులను ఉత్పత్తిదారుని తరపున తయారు చేయుటకు సహకరిస్తూ దళారీలను నివారించి, ఉత్పత్తిదారునికి కావలసిన అన్ని సౌకర్యములను సమకూర్చడం.

(ఎస్) మార్కెట్లు ఏర్పాటు, అభివృద్ధికి ప్రభుత్వం ఆయా సమయాలలో ఇచ్చే ఆదేశాలను అమలు పరచడం.

### V. గిరిజనులకు అప్పులు ఇవ్వడంపై నియంత్రణను కలిగి ఉండటం

షెడ్యూల్డు ప్రాంతాలలో ప్రభుత్వేతర వడ్డీ వ్యాపార సంస్థలకు లైసెన్సు మంజూరు చేయకూడదు.

### VI. అన్ని సామాజిక రంగాలలోని సంస్థలు అందులో పనిచేయు సిబ్బందిపై నియంత్రణ అధికారాలు

#### i. విద్య

(ఎ) మండల పరిషత్తు, తన పరిధిలో గల అన్ని విద్యా సంస్థల పరిపాలన నివేదికలను ఆయా గ్రామ పంచాయతీల ద్వారా కోరడానికి అథారిటీ కలిగి ఉంటుంది.

(బి) మండల పరిషత్తు, తన పరిధిలోగల అన్ని విద్యా సంస్థల బడ్జెట్‌ను 31 మే నాటికి అనగా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆమోదించాలి.

(సి) అన్ని విధాన సంస్థలలోని ఉపాధ్యాయుల విధులకు గైర్హాజరగు మరియు సక్రమంగా విధులు నిర్వహించని ఉపాధ్యాయులపై తగిన క్రమశిక్షణ చర్య తీసుకొమ్మని మండల పరిషత్తు సంబంధిత క్రమశిక్షణా అధికారికి సిఫారసు చేయాలి. క్రమశిక్షణా అధికారి ఆయా సందర్భాన్ని బట్టి మండల పరిషత్తుకు లేదా గ్రామ పంచాయతీకి తెలియపరుస్తూ చర్య తీసుకోవాలి.




#### ii. సంక్షేమ వసతి గృహాల నిర్వహణ

(ఎ) మండల పరిషత్తు తన పరిధిలోని వసతి గృహాలలో విద్యార్థులకు ఆహార సరఫరా విషయాలు, మరమ్మతులు మరియు ఇతర దైనందిన కార్యక్రమాలను పర్యవేక్షించాలి.

(బి) మండల పరిషత్తు తన పరిధిలోని అన్ని వసతి గృహ సంక్షేమ అధికారుల నుండి సంవత్సరంలో రెండు పర్యాయములు వసతి గృహాల పరిపాలన నివేదికను తీసుకోవాలి.

(సి) మండల పరిషత్తు వసతి గృహాలలో విద్యార్థులను చేర్చుకొను విషయములో సిఫారసు చేయు అధికారాన్ని కలిగి ఉంటుంది.

(డి) విధులకు గైర్హాజరగు మరియు సక్రమంగా విధులు నిర్వహించని వసతి గృహాల సంక్షేమ అధికారులు మరియు ఇతర సిబ్బందిపై తగిన క్రమశిక్షణ చర్య తీసుకొమ్మని మండల పరిషత్తు సంబంధజత క్రమశిక్షణ అధికారికి సిఫారసు చేయాలి. క్రమశిక్షణాధికారి ఆయా సందర్భాన్ని బట్టి మండల పరిషత్తుకు లేదా గ్రామ పంచాయతీకి తెలియపరుస్తూ చర్య తీసుకోవాలి.

#### iii. ఆరోగ్యము

పంచాయతీరాజ్ సంస్థలు తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలకు/సంస్థలకు మద్దతును, మార్గదర్శకత్వాన్ని ఇస్తూ, ఈ క్రింది అంశాలను ప్రత్యేక దృష్టితో పర్యవేక్షిస్తారు.

(ఎ) రూరల్ హెల్త్ మిషనులో భాగమైన జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం మరియు అన్ని ఇతర పథకాల సమీక్ష మరియు పర్యవేక్షణ.

(బి) మందుల సరఫరా మరియు వాటి వినియోగాన్ని సమీక్షించడం.

(సి) గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య విస్తరణ కార్యకలాపాల సమీక్ష మరియు పర్యవేక్షణ.

(డి) వ్యాధులు ప్రబలకుండా నిరోధించుటకు తీసుకున్న చర్యలపై సమీక్ష, పర్యవేక్షణ.

(ఇ) గ్రామీణ ప్రాంతాలలో వైద్య ఆరోగ్య సంస్థల ఏర్పాటు, వాటి నిర్వహణ మరియు ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మొదలయిన విషయాలపై సమీక్ష, పర్యవేక్షణ.

(ఎఫ్) గ్రామ పంచాయతీ నుండి జిల్లాస్థాయి వరకు పంచాయతీరాజ్ సంస్థలు అనగా గ్రామస్థాయిలో మరియు జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్తులు వాటి పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును స్వయంగా నిర్వహిస్తాయి.

(జి) పంచాయతీరాజ్ సంస్థలు గ్రామాలలో రక్షిత నీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్య అంశాలను నిర్వహిస్తాయి.

(హెచ్) పంచాయతీరాజ్ సంస్థలో ఆరోగ్య కేంద్రాల అధికారులకు పనితీరు మెరుగుదలకు ఏవేని సూచనలు చేసినప్పుడు, ఆయా అధికారులు ఆ విధమైన చర్యలు తీసుకొని ఆ సంస్థలకు వారు తీసుకున్న చర్యలు తెలియజేయడానికి బాధ్యత వహిస్తాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు మరియు జిల్లా పరిషత్తు వారు నిర్వహించే సర్వ సభ్య సమావేశానికి, ఏ.ఎన్.ఎం., ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి హాజరవుతారు.

(ఐ) ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగాని, ఏ.ఎన్.ఎం. కాని, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గాని ఆరోగ్యానికి సంబంధించిన లేదా పరిశుభ్రత, పారిశుధ్య మెరుగుదలకు మరియు రక్షిత నీటి సరఫరా విషయమై చేసిన సూచనలను పంచాయతీరాజ్ సంస్థల్లో పనిచేసే సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి, తీసుకున్న చర్య నివేదికను సంబంధిత ఆరోగ్య అధికారికి లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి పంపాలి.

(జె) మండల పరిషత్తు పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరియు ఉప కేంద్రాల బడ్జెట్‌ను ఆమోదించాలి.

(కె) మండల పరిషత్తు ఆర్థిక సంవత్సరం ఆరంభమైనప్పటి నుండి నెలలోపు తన పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరియు ఉపకేంద్రాల పరిపాలన నివేదికలను కోరాలి.

**iv. మహిళా, శిశు సంక్షేమం**

(ఎ) గ్రామసభ అంగన్‌వాడి కేంద్రాల బడ్జెట్‌ను ఆమోదించాలి.

(బి) మండల పరిషత్తు ఆర్థిక సంవత్సరం ఆరంభం అయినప్పటి నుండి నెలలోపు తన పరిధిలోని ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు అధికారి నుండి పరిపాలన నివేదికలను కోరాలి.

(సి) గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు అంటే హెల్పర్లు, వర్కర్లను నియమించుకొనడం మరియు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి గ్రామ పంచాయతీ నియమక, క్రమశిక్షణా అథారిటీగా ఉంటుంది.

**v. గిరిజన ఉప ప్రణాళిక సహా స్థానిక ప్రణాళికలు, అట్టి ప్రణాళజకల వనరుల పైన నియంత్రణ**

(ఎ) రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం ఆరంభమయినప్పటి నుండి నెలలోపున సంబంధిత జిల్లా కలెక్టర్లకు, జిల్లా పరిషత్తులకు గిరిజన ఉపప్రణాళిక భౌతిక, ఆర్థిక కేటాయింపులను తెలియపరుస్తుంది. సదరు జిల్లా కలెక్టరుగారు ఆ గిరిజన ఉపప్రణాళిక కేటాయింపులను (భౌతిక మరియు ఆర్థిక) మండల పరిషత్తులకు తెలియపరచాలి.

(బి) మండల పరిషత్తు అధికారి ఆ గిరిజన ఉప ప్రణాళిక భౌతిక, ఆర్థిక కేటాయింపులు రెండింటినీ గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంవత్సరం ఆరంభమయినప్పటి నుండి నెలలోపున తెలియపరచాలి.

(సి) మండల పరిషత్తు, గ్రామ పంచాయతీ వారి వారి పరిధిలో జరుగు గిరిజన ఉప ప్రణాళిక అభివృద్ధి అమలును నెలకు ఒకసారి సమీక్షించాలి.

(డి) మండల పరిషత్తు, గ్రామపంచాయతీ గిరిజన ఉప ప్రణాళిక అమలుపై పరిపాలన/నివేదికలను సంబంధిత జిల్లా కలెక్టరుగారి ద్వారా ప్రభుత్వానికి సమర్పించాలి.

## 9. సమీక్ష, సవరణ అంశాలలో అధికారం

i) గ్రామసభ తీర్మానం ద్వారా నష్టపోయిన ఎవరేని వ్యక్తి/సంస్థ గ్రామసభచే అట్టి తీర్మానం జారీ చేయబడిన తేదీ నుండి 60 రోజులలోపు కమీషనరు సమక్షంలో అప్పీలును దాఖలు చేయవచ్చును. అప్పుడు కమీషనరు సమక్షంలో అప్పీలును దాఖలు చేయవచ్చును. అప్పుడు కమీషనరు, నిర్ణయానికి సంబంధించి దాని వాస్తవికత లేదా చట్టబద్ధత గురించి పరిశీలన జరిపి, గిరిజనుల ప్రయోజనాల విషయంలో యోగ్యమని, సక్రమమని భావించిన విధంగా అట్టి ఉత్తర్వు/ ఆదేశాన్ని సంబంధితులకు జారీ చేయవచ్చును.

ii) కమీషనరు ఆదేశం/ఉత్తర్వుచే నష్టపోయిన ఎవరేని వ్యక్తి/ సంస్థ అట్టి ఉత్తర్వు/ ఆదేశం జారీ అయిన తేదీ నుండి 90 రోజులలోపు ప్రభుత్వ సమక్షంలో ఒక సవరణ పిటీషన్‌ను దాఖలు చేయవచ్చును.

iii) గిరిజనుల ప్రయోజనాల విషయంలో యోగ్యమని, సక్రమమని భావించిన విధంగా సంబంధితులకు తగిన ఆదేశాలను జారీ చేయడానికి ప్రభుత్వం సమర్ధ అథారిటీగా ఉంటుంది.

**(గవర్నర్‌గారి ఆదేశానుసారం)**

**డాక్టర్ రాజీవ్ శర్మ**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

# వ్యవసాయ అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు

**నిజమైన భారతదేశం గ్రామీణ ప్రాంతాలలోనే ఉందని జాతిపిత మహాత్మాగాంధీ వక్కాణించారు. గ్రామాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దాలు. మన దేశ జనాభాలో అధిక శాతం మంది గ్రామాలలోనే నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది వ్యవసాయదారులు. భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అనివార్యంగా వ్యవసాయ రంగాన్ని, గ్రామాలను అభివృద్ధి పరచాలి.**

బడ్జెట్‌లో ఈ రంగాలకు తగిన ప్రాముఖ్యాన్ని కల్పించాలి. 2011-12వ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి గ్రామీణాభివృద్ధికి రూ. 74,143 కోట్లు కేటాయించారు.

## వ్యవసాయ ఋణాలు పెంచారు

వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగినంతగా పెరగడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ ఋణాలు తగినంతగా పెరగలేదు. దేశంలోని ఋణాలలో 8 శాతం కూడా రైతులకు అందడం లేదు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రైతులకు ఇచ్చే ఋణాలను పెంచవలసిన అవసరం ఉంది. 2011-12 వ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో రుణ లక్ష్యాన్ని లక్ష కోట్లకు పెంచుతూ 4.75 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు.

మనదేశంలో ఎక్కువమంది చిన్నకారు, సన్నకారు రైతులు ఉన్నందున బ్యాంకులన్నీ ఇటువంటి రైతులకు ఋణాలివ్వడంపై దృష్టిని సారించాలని ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో బ్యాంకులను కోరారు. నాబార్డును మరింత బలోపేతం గావించడం కోసం స్వల్పకాలిక రుణనిధిగా ఆ సంస్థకూ రూ. 10 కోట్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మన దేశంలో అనేకమంది రైతులు తాము తీసుకున్న ఋణాలను అనేక వ్యయప్రయాసలకోర్చి సకాలంలో చెల్లిస్తున్నారు. ఇటువంటి రైతులను ప్రోత్సహించడం కోసం వారికి 4 శాతం వడ్డీకే ఋణాలను అందించాలని పేర్కొన్నారు. ఇది ప్రశంసనీయమైన నిర్ణయం.

## ఆహార ఉత్పత్తుల పెంపుదలకు చర్యలు

ఇటీవలి కాలంలో దాదాపు అన్ని రకాల ఆహార ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరిగాయి. ద్రవ్యోల్బణం పెరగడానికి ఇది ప్రధాన కారణం. ఈ పరిమాణాలను అధిగమించడం కోసం బడ్జెట్‌లో పలు రకాల ఆహారోత్పత్తుల ఉత్పాదకతను పెంచేందుకు రూ. 2,200 కోట్లు కేటాయించారు.

కూరగాయలు, కాయధాన్యాలు, నూనె విత్తనాలు, చిరుధాన్యాలు, పశుగ్రాసం వంటి ఆహార ఉత్పత్తులు ఉత్పాదకతను పెంచేందుకూ ఈ సంవత్సర బడ్జెట్‌లో రూ. 2,200 కోట్లను కేటాయించారు. ఈ సంవత్సరం ఊహాతీతంగా పండ్లు, కూరగాయలు, పాలు, మాంసం, చేపల ధరలు చుక్కలనంటడంతో టోకు ధరల సూచి 70 శాతం మేర పెరిగి సామాన్యుడి బ్రతుకు దుర్భరమయింది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఆర్థికమంత్రి వీటి ఉత్పాదక, పంపిణీ విభాగాలలో ఉన్న ఆటంకాలను అధిగమించడం కోసం అవసరమైన చర్యలు గైకొనడం జరుగుతుందని వివరించారు. వ్యవసాయ రంగానికి మూలాధారం సాగునీరు. సరైన సాగునీటి వసతులు లేని కారణంగా మనదేశంలో ఎక్కువమంది రైతులు వర్షాధార పంటలను పండిస్తారు. వర్షాధార వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం కోసం బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించారు.

## ఆయిల్ పామ్ పెంపకానికి ప్రోత్సాహం

వినియోగదారులకు అవసరమయిన వంటనూనెలలో సగమే మనం ఉత్పత్తి చేస్తున్నాం. మిగతా సగం వంట నూనెలను దిగుమతి చేసుకోవడం జరుగుతోంది. వంట నూనెల దిగుమతి నానాటికి ఖరీదైన వ్యవహారంగా మారింది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకుగాను ప్రభుత్వం ఆయిల్‌పామ్ పెంపకంపై ప్రత్యేక దృష్టిని సారించింది. 60 వేల హెక్టారులలో ఆయిల్‌పామ్ పెంపకాన్ని ప్రోత్సహించడానికి చర్యలు గైకొన్నట్లు ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ పండించే రైతులకు మార్కెట్ సదుపాయాలు కల్పించడం కోసం బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించారు. దీనివల్ల రాబోయే ఐదు సంవత్సరాలలో మూడు లక్షల టన్నుల పామాయిల్ లభిస్తుంది.

## కూరగాయలు, తృణధాన్యాల పెంపకానికి ప్రోత్సాహం

మనదేశంలో ఈ సంవత్సరం కూరగాయలు, తృణధాన్యాల ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి నాణ్యమైన కూరగాయలను సరసమయిన ధరలకు అందించేందుకు కూరగాయల క్లస్టర్ ఏర్పాటు గావించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించనున్నారు.

రాగులు, జొన్నలు, సజ్జలు వంటి తృణధాన్యాల ఉత్పత్తులను పెంచడం కోసం రూ. 300 కోట్లు మంజూరు చేస్తారు. మనదేశంలోని 25 వేల గ్రామాల్లోని వెయ్యి బ్లాకులలో వీటి పెంపకాన్ని చేపట్టాలని

ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మూలంగా పశువుల మేత కొరత తీరే అవకాశం ఉంది. 2011-12వ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో ఆర్థికమంత్రి ప్రణబ్‌ముఖర్జీ 'నేషనల్ మిషన్ ఫర్ ప్రొటీన్ సప్లిమెంట్స్' అనే నూతన పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించారు.

పాల ఉత్పత్తులను స్థిరంగా ఉండేందుకూ, 25 వేల గ్రామాలలో పశుగ్రాసం అభివృద్ధికి రూ. 300 కేటాయిస్తారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడడం వలన భూసారం క్రమంగా క్షీణిస్తోంది. ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటుందని ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో హరిత విప్లవాన్ని అమలు పరుస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకుగాను బడ్జెట్‌లో రూ. 400 కేటాయించారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రాలు పెట్టుబడులు పెట్టి 4 శాతం వృద్ధి చెందించేందుకూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు.

## గ్రామీణ ఉపాధిహామీ పథకం

గ్రామీణులకు సంవత్సరంలో 100 రోజుల ఉపాధిహామీని ఇచ్చే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 2006 ఫిబ్రవరి 2వ తేదీ నుండి అమలులోనికి తెచ్చారు. ఈ సంవత్సర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ. 40 వేల కోట్లు కేటాయిస్తారు. దేశంలో ఉపాధిహామీ నిధుల్ని ఎక్కువగా ఉపయోగించుకున్న రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. ఉపాధి హామీ నిధుల్ని ఎక్కువగా ఉపయోగించుకున్న రాష్ట్రంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాలు ముందు వరసలో ఉన్నాయి. ప్రతి ఆరు మాసాల కొకసారి తనిఖీలు నిర్వహించాలని ఉపాధి చట్టంలో స్పష్టం చేయడం జరిగింది.

సామాజిక తనిఖీలను నిర్దేశించిన సమయంలో పూర్తి గావించడం లేదు. గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల దుర్వినియోగం ఎక్కువగా ఉందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. ఇటువంటివి పునరావృతం కాకుండా సంబంధిత రాష్ట్రప్రభుత్వాలు అవసరమయిన చర్యలు గైకొనాలి.

## అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపు

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వేతనాలు పెంచాలని పలుమార్లు అందోళనలకు దిగారు. వీరి కోరికలకు గ్రహించిన భారతప్రభుత్వం ఈ సంవత్సర వార్షిక బడ్జెట్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల, సహాయకుల వేతనాలను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలను రూ. 1500 నుండి రూ. 3000లకు, సహాయకులకు రూ. 750 నుండి రూ. 1800లకు పెంచడం ముదావహం. ఈ నిర్ణయం ఈ సంవత్సరం ఏప్రిల్ మొదటి తేదీ నుండి అమలులోనికి వస్తుంది. అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు రెట్టింపు గావించినా అదే తరహా ఉద్యోగాలు చేసే ఇతరుల వేతనాలు కనీస వేతనం కంటే తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం వీరి జీతాలను కూడా పెంచాల్సి ఉంది.

## భారత్ నిర్మాణానికి నిధులు

భారత్ నిర్మాణ్ పరిధిలోని ఆరు పథకాల్లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, సత్వర సాగునీటి పథకం, రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుదీకరణ పథకం, ఇందిరా అవాస్‌యోజన, జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం, గ్రామీణ టెలిఫోన్లు ఉన్నాయి. 'భారత్ నిర్మాణ్' కార్యక్రమానికి బడ్జెట్ కేటాయింపులు 2010-11 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2011-12 ఆర్థిక సంవత్సరంలో రూ. 10 వేల కోట్లు పెంచారు.

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి

ప్రపంచంలో ఆఫ్రికా తరువాత భారతదేశంలోనే గిరిజనుల సంఖ్య అధికంగా ఉంది. వీరి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి జరిగి నప్పటికీ ఇంకా ఎంతో కృషి జరగవలసి ఉంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే అక్కడి ప్రజలు వారికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తారు.

వెనుకబడ్డ గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా గిరిజనులు ఆవాసమున్న ప్రాంతాల్లో నక్సల్స్ సమస్య ప్రభావం ఎక్కువగా ఉంది. ఆ ప్రాంతాలను అభివృద్ధి పరిస్తే నక్సల్ సమస్యను కొంతవరకూ పరిష్కరించవచ్చు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం 2011-12 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న 60 జిల్లాల అభివృద్ధికి రూ. 1800 కోట్లు కేటాయించారు.

సమగ్ర కార్యచరణ ప్రణాళిక ఐ.ఎ.పి. క్రింద ప్రతి జిల్లాకు ఈ సంవత్సరం రూ. 30 కోట్ల రూపాయలు ఇవ్వనున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. నిరుపేద గిరిజనుల అభివృద్ధి అవసరాలకు ఈ నిధులను ఖర్చు చేస్తారు. 2010-11లో ప్రారంభింపబడిన ఈ పథకం ప్రకారం ఇప్పటికే ఈ ప్రాంతాలలోని ఒక్కొక్క జిల్లాకు రూ. 25 కేటాయించడం జరిగింది. 60 జిల్లాలలో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒడిస్సా, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలున్నాయి.

ఎరువులు, ఎల్.పి.జీ, కిరోసిన్‌కు సబ్సిడీలను నగదు రూపంలో బదిలీ చేయాలన్న ప్రభుత్వ విధానం భవిష్యత్తులో మధ్యతరగతి ప్రజలను సబ్సిడీలకు దూరం చేస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి మాత్రమే సబ్సిడీలు నగదు రూపంలో అందజేసే అవకాశముంది. 2011-12వ సంవత్సర బడ్జెట్ వ్యవసాయం రంగంపై దృష్టి సారించారు. ఈ రంగంలో కార్పొరేట్ల భాగస్వామ్యం పెరిగే అవకాశం ఉంది.

సామాన్య ప్రజల మన్ననలను పొందేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో అనేక చర్యలు తీసుకొంది. ఇందులో ప్రధానమైనవి అంగన్‌వాడీ వర్కర్ల జీతం పెంపు, వృద్ధాప్య ఫించన్లు 200 రూపాయల నుండి 500 రూపాయలకు పెంచడం, గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలిరేట్లను ధరల సూచికి అనుసంధానం గావించడం, త్వరలో ఆహారభద్రతా బిల్లు పెట్టి తలసరి కేటాయింపు 35 కేజీలకు పెంచాలని నిర్ణయించడం.

వర్షాభావ ప్రాంతాల్లో పప్పుధాన్యాలు పండించే 60 వేల గ్రామాల్లోని రైతులకు ప్రోత్సాహకాలు అందించేందుకు రూ. 300 కోట్లు నిధులివ్వడం హర్షదాయకం.

*- డా॥ పి. మోహన్‌రావు*

# అణుధార్మికత ప్రభావం - జాగ్రత్తలు

**జపాన్‌లో సంభవించిన భూకంపం సునామి కారణంగా సంభవించిన రియాక్టర్ల విస్ఫోటన నేపథ్యంలో అనుధార్మికత అంటే ఏమిటి, దాని ప్రభావం ఎలా ఉంటుందన్న అవగాహన అవసరమైంది.**

**మనదేశంలో అణువిద్యుత్ కేంద్రాలు ప్రభుత్వ రంగంలోని భారత అణువిద్యుత్ సంస్థ నిర్వహణలోనున్నాయి.**

## అణురియాక్టర్లు పనిచేసే విధానం

కేంద్రక విచ్ఛిత్తి అనే దృగ్విషయం ఆధారంగా అణువిద్యుదుత్పత్తి పనిచేస్తుంది. అత్యధిక శాతం అణురియాక్టర్లలో యురేనియం- 235 భారమూలకాన్ని ఇంధనంగా ఉపయోగిస్తుంటారు. అయితే కేంద్రవిచ్ఛిత్తి అన్నది శృంకల చర్య. ఇది ఒకసారి మొదలైందంటే దానంతట అదే ఆగిపోయే ప్రశ్న ఉండదు. మన అవసరానికి తగ్గట్లు ఈ చర్యను నియంత్రించాల్సి ఉంటుంది. బోరాన్ వంటి రసాయనాలతో తయారైన నియంత్రణ కడ్డీలు కేంద్రక విచ్ఛిత్తి చర్య ఫలితంగా ఉత్పత్తి అయిన న్యూట్రాన్లను ఆకర్షిస్తాయి. అలా శృంఖల చర్యను నియంత్రిస్తారు.

అణువిద్యుత్ ప్లాంట్‌లను అన్ని రకాల ప్రకృతి విపత్తులను తట్టుకునే విధంగా నిర్మిస్తారు. ఇంధనం మండే కోర్ భాగాన్ని దాదాపు 6 అంగుళాల మందం ఉన్న ఉక్కు నిర్మాణం లోపలే ఉంచుతారు. దీని పైన దాదాపు అడుగున్నర మందమున్న కాంక్రీట్‌డోమ్ ఉంటుంది. ఏ కారణంగానైనా విద్యుదుత్పత్తి నిలిచిపోతే రియాక్టర్లు వాటంతట అవే ఆగిపోయేలా ఆ వెంటనే కోర్‌లోని విపరీతమైన వేడిని తగ్గించేందుకు శీతలీకరణ రసాయనాలు, నీరుసరఫరా అయ్యేలా ఏర్పాట్లు నాంటాయి.

అణుప్రాజెక్టుల నిర్మాణం చేసేటప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాజెక్టు విభాగాన్ని క్రింది విధంగా విభజించారు.

*1. ఎక్స్‌క్లూజివ్ జోన్ :* అణువిద్యుత్ ప్రాజెక్టుకు 1.5 కి.మీ పరిధిలో ఎవరూ నివశించటానికి వీలులేదు.

*2. స్టెరిలైజిడ్ జోన్ :* ఎక్స్‌క్లూజివ్ జోన్ పైన 5 కి.మీ వరకు నివసించటానికి అవకాశం ఉన్నా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరు.

*3. ఎమర్జెన్సీస ప్రొటెక్షన్ జోన్ :* ఆపైన 16 కి.మీ వరకు ఏ చిన్న ప్రమాదం సంభవించినా ఇక్కడి వారందరినీ తరలిస్తారు. కొవ్వాడ పట్టణం పూర్తిగా ఈ జోన్‌లోనే ఉంది.

## అణుధార్మికత ప్రభావం

అణుధార్మికత వల్ల భారీగా ప్రాణ నష్టంతో పాటు పుట్టబోయే బిడ్డలు శారీరక, మానసిక వికలాంగులు అవుతారు. పర్యావరణం దెబ్బతిని, పంటలుండవు, సునామీ, భూకంపాలు లేని సమయం లోనూ జపాన్, ఫ్రాన్స్‌లో పలుమార్లు అణువిద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

* చర్మం-జుట్టు మూలాలకు చేరుతుంది. చర్మ క్యాన్సర్‌కు కారణమవుతుంది.
*. కంటి శుక్లాలు వస్తాయి.
* అణుధార్మికత అయోడిన్ ప్రభావానికి గురి అవుతుంది. ఇది థైరాయిడ్ గ్రంధిని నాశనం చేస్తుంది.
* ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వస్తుంది.
* పేగు వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. రక్తపు వాంతులు, డయోరియాకు కారణమవుతుంది.
* మహిళల్లో అండాశయం, అండాలకు నష్టం, పురుషుల్లో ప్రోస్టేట్‌కు, వృషణాలకు నష్టం కలిగిస్తుంది.
* తెల్లరక్తకణాలకు తీవ్ర నష్టం ఇన్ఫెక్షన్‌కు ఎక్కువగా గురిచేసే ప్రమాదం ఉంది.
* లుకేమియా వచ్చే ప్రమాదం ఉంది.
* జ్వరం వచ్చే అవకాశం పెరుగుతుంది. జుట్టు రాలటం జరుగుతుంది.

## భారత అణురియాక్టర్ల పనితీరు - విశ్లేషణ

* భారత అణుకేంద్రాల్లో శీతీల వ్యవస్థ విద్యుత్ సరఫరాపై ఆధారపడదు. పరోక్ష పద్ధతిలోనే రియాక్టర్లను చల్లబరిచే వ్యవస్థ ఉంది.
* 1969 నెలకొల్పిన తారాపూర్ కేంద్రాన్ని మారిన ప్రమాణాల మేరకు స్థాయిని పెంచుతారు.
* మనదేశంలో సునామీ అటల ఎత్తు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్మించారు.
* 2001 నాటి భుజ్ భూకంపాన్ని కక్రపార్ అణువిద్యుత్ కేంద్రం సమర్ధంగా తట్టుకుంది. 2004 తమిళనాడులో సునామి వచ్చినప్పుడు మద్రాసు అణువిద్యుత్ కేంద్రం ఎలాంటి రేడియేషన్ దుష్పరిణామాలు లేకుండానే మూసుకుపోయింది. కొద్ది రోజుల్లోనే తిరిగి పనిచేసింది.
* తమిళనాడు కుడంకుళంలో నిర్మిస్తున్న అణువిద్యుత్ కేంద్రం సముద్ర మట్టానికి ఎత్తులో నిర్మిస్తుండటం వల్ల సునామి ముప్పు ఉండదు.
* దేశంలో 20 రియాక్టర్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అందులో 18 పీడన సహిత భారజల రియాక్టర్లు ఉన్నాయి. జపాన్‌లో సమస్య సృష్టించిన ఉష్ణజల రియాక్టర్లకు ఇవి పూర్తి భిన్నం.
* జపాన్ రియాక్టర్లలో శుద్ధిచేసిన యురేనియాన్ని వాడతారు. మన వద్ద సహజ సిద్ధ యురేనియాన్ని ఉపయోగిస్తారు. ఇది సురక్షితం.
* భారత రియాక్టర్లలో రెండు వరసల రక్షణ కవచాలు వాడతారు.
* జపాన్ రియాక్టర్లు ముప్పు ఎక్కువగా ఉండే 5వ జోన్‌లో నాన్నాయి. భారత్‌లో ఇవి ఎక్కువగా 2,3,4 జోన్ల (భూకంప తీవ్రత తక్కువగా ఉన్న ప్రదేశాల్లో) ఉన్నాయి.
* ఇతర దేశాల్లో నియంత్రణ వ్యవస్థల్లా కాకుండా, మనదేశంలో అణుకేంద్రాలకు 5 సంవత్సరాలకు ఒకసారి లైసెన్సు ఇచ్చి, ఆ తరువాత సురక్షిత అంచనా పరీక్ష చేయిస్తేనే లైసెన్సు మంజూరు చేస్తారు.
* 1993లో నరోరా అణువిద్యుత్ కేంద్రంలో టర్బైన్‌లో మంటలు చెలరేగినా, అణుధార్మికత జరగలేదు.

*- డా॥ నిర్మలాదేవి*
*ఫ్యాకల్టీ, సి.యమ్.ఇ.డి. విభాగం*

**భారతీయ మహిళ తన సుదీర్ఘ ప్రస్థానంలో అనేక మైలు రాళ్లను అధిగమిస్తూ ముందడుగు వేస్తోంది. దేశ ఆర్థిక నిర్మాణంలో, రాజకీయ ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటూ, తన సత్తాను నిరూపించు కుంటున్నది. అయినప్పటికీ, అనేక సమస్యలు, సవాళ్లతో మహిళ సతమతమయిపోతోంది.**

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో నిరక్షరాస్యత, అవిద్య, నైపుణ్యాల లేమి, అరాచకాలు, హింస, అనారోగ్యం, పోషకాహార లోపం, ఆర్థిక సామాజిక, రాజకీయ సాధికారత లేకపోవటం, నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోవటం, సరైన జీవన భద్రత, సామాజిక భద్రత అందించే ఉపాధి దొరకకపోవటం మొదలైనవి ఉన్నాయి.

మహిళలు తమ జీవితంలోని వివిధ దశల్లో వివిధ రకాల సమస్యల ను ఎదుర్కొంటుంటారు. ప్రతి దశ కీలకమైనదే. అయితే, వీటన్నింటిలో యుక్తవయస్సు దశ మరీ ముఖ్యమైనది.

రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఏప్రిల్ 15న ప్రారంభించిన 'సబల' పథకంలో యుక్తవయస్సు బాలికల కోసం పలు లక్ష్యాలను పొందుపరిచారు. అవి ఏమిటంటే-

- యుక్త వయస్సు బాలికల వ్యక్తిగతాభివృద్ధి, సాధికారత సాధన.
- వారిపోషణ, ఆరోగ్య స్థాయిని మెరుగుపరచటం.
- ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, కుటుంబం, పిల్లల సంరక్షణ తదితర విషయాల్లో అవగాహన కల్పించటం.
- బడి మానేసిన యుక్తవయస్సు బాలికలను ప్రోత్సహించి, మళ్లీ పాఠశాలల్లో కాని, అనియత విద్యా కేంద్రాలలో కాని చేర్పించటం.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు, పోలీసుస్టేషన్లు వంటి ప్రజాసంస్థలు అందించే సేవలపై అవగాహన కల్పించటం.

# యుక్తవయస్సు బాలికలకు భరోసా సబల

బాల్యం నుంచి యవ్వనంలోకి మారే క్రమంలో అనేక శారీరక, మానసిక మార్పులు చోటు చేసుకుంటాయి. తత్ఫలితంగా యుక్తవయస్సు బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటుంటారు. పలు ఒత్తిళ్లు వారిని ఆందోళనకు గురి చేస్తాయి. వీటికి తోడు మన సమాజంలో ఉన్న కట్టుబాట్లు, మూఢాచారాలు కూడా వీరిని మరింత గందరగోళంలో పడవేస్తాయి.

యుక్త వయస్సు బాలికల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిశోర బాలిక కార్యక్రమాల పేరిట అనేక కార్యక్రమాలు చేపట్టాయి. యుక్త వయస్సు బాలికల పోషణను, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, వారి వ్యక్తిగత, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా 2000 సంవత్సరంలో 'కిశోర శక్తి యోజన' (కె.ఎస్.వై) అనే పేరిట కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. తిరిగి 2002-03లో 'యుక్త వయస్సు బాలికల కోసం జాతీయ కార్యక్రమం' (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ అడాలసెంట్ గర్ల్స్ NPAG) పేరిట మరో కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది.

ఈ రెండు పథకాలు యుక్తవయస్సు బాలికల జీవన విధానంలో మార్పులు తీసుకుని రాగలిగాయి. అయినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఇవి సత్ఫలితాలు ఇవ్వకపోవటంతో ఈ రెండు పథకాలను అనుసంధానం చేసి, 'సబల' అనే పేరుతో ఒక నూతన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2010 నవంబర్ 19న ప్రారంభించింది. దీని పూర్తి పేరు 'రాజీవ్ గాంధీ స్కీమ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ అడాలసెంట్ గర్ల్స్'' (RGSEAG)

ఈ పథకం కింద 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న యుక్త వయస్సు బాలికలకు పలు కార్యక్రమాలు చేపడతారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 200 జిల్లాలలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టులలో ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు. మన రాష్ట్రంలో 7 జిల్లాలు 'సబల' పథకానికి ఎంపికయ్యాయి.

2010-11 సంవత్సరంలో 7 జిల్లాలలోని 117 ఐసిడిఎస్ ప్రాజెక్టులలో 'సబల' పథకాన్ని ప్రయోగాత్మకంగా చేపడతారు. ఈ పథకం కింద ఎంపికైన జిల్లాలు : ఆదిలాబాద్, అనంతపురం, చిత్తూరు, హైదరాబాద్, మహబూబ్‌నగర్, విశాఖపట్నం, పశ్చిమగోదావరి.

'సబల' పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను కొన్ని మార్గదర్శక సూత్రాల ప్రకారం చేపడతారు. ముఖ్యమైన మార్గదర్శక సూత్రాలేమిటంటే-

- సర్వే ద్వారా 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న యుక్త వయస్సు బాలికలను గుర్తిస్తారు.
- వేలిడేషన్ చెక్ ద్వారా అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేస్తారు.
- లబ్ధిదారుల వయస్సును బట్టి, 11-14 సంవత్సరాల మధ్య వయస్కుల ను ఒక గ్రూపుగా, 5-18 సంవత్సరాల మధ్య వయస్కులను మరొక గ్రూపుగా విభజిస్తారు.
- వారి వారి వయస్సులకు అనుగుణంగా ఆరోగ్యం, వ్యక్తిగత సంబంధిత అంశాలపై శిక్షణా ప్రణాళికను తయారు చేస్తారు.
- ఈ పథకాన్ని ముఖ్యంగా బడికి వెళ్లని లేదా మానివేసిన యుక్తవయస్సు (కిశోర) బాలికలకు వర్తింపచేస్తారు.
- ఈ బాలికలు ప్రణాళిక ప్రకారం, అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశమై జీవన, వృత్తి నైపుణ్య విద్యాంశాలను, పోషణ, ఆరోగ్య, సామాజిక, న్యాయపర అంశాలను నేర్చుకుని, శిక్షణ పొందుతారు.
- బడికి వెళ్లే పిల్లలు నెలకు కనీసం రెండుసార్లు, శెలవులలో రెండుసార్ల కంటే ఎక్కువగాను అంగన్‌వాడీ కేంద్రాలలో సమావేశమయ్యేలా చూస్తారు.
- బడికి వెళ్లే పిల్లలు, బడి బయట గల పిల్లలు కలసి సమావేశం అవటం వల్ల, బడి బయట పిల్లలు చదువుపై ఆసక్తి పెంచుకుని, తిరిగి బడిలో చేరే అవకాశం కలుగుతుంది.

సబల పథకం కింద, యుక్తవయస్సు బాలికలతో 'కిశోర సమూహాల' పేరిట ప్రతి అంగన్‌వాడీ కేంద్రం గ్రామ పరిధిలో 15 నుంచి 25 మందితో గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ప్రతి గూపునకు గ్రూపు నుండి ముగ్గురు బాలికలను లీడర్లుగా ఎంపికచేసి, ఒకరిని 'సఖి' అని, ఇద్దరిని 'సహేళి'

అని పిలుస్తారు. 'సఖి' బాలికకు 'సహేళి' బాలికలు సహకరిస్తారు.

'సబల' పథకం కింద యుక్త వయస్సు బాలికలకు అనుబంధ పోషకాహారం అందించటం; ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రం పంపిణీ; ఆరోగ్య సేవలు - రెఫరల్ సేవలు; పోషణ, ఆరోగ్యం, విద్యా సేవలు, కుటుంబ సంక్షేమం, జీవన నైపుణ్యాలు, పిల్లల సంరక్షణ పద్ధతులు మొదలైన వాటిపై కౌన్సెలింగ్ 16 సంవత్సరాలు పైబడిన వారికి వృత్తి విద్యా శిక్షణ మొదలైన సేవలను అందజేయటం జరుగుతుంది.

ఈ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, యువజన వ్యవహారాల శాఖ, ఉపాధి కల్పనశాఖ, పంచాయితీరాజ్ శాఖ మొదలైన వాటి మధ్య సమన్వయం ఏర్పాటు చేస్తారు. ఎన్‌జివోలకు కూడా పథకం అమలులో భాగస్వామ్యం కల్పిస్తారు.

'సబల' పథకం కింద పోషకేతర కార్యక్రమాలకు కేంద్రప్రభుత్వం 100 శాతం నిధులను సమకూరుస్తుంది. పోషక విభాగానికి సంబంధించిన ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 చొప్పున సమకూరుస్తాయి.

## విధి విధానాలు

***కిశోర సమూహాల ఏర్పాటు***

- ప్రతి అంగన్‌వాడీ కేంద్రం / గ్రామం పరిధిలోని 15 నుండి 25 మంది యుక్తవయస్సు బాలికలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాలి.
- ఈ విధంగా ఏర్పాటు చేసిన ప్రతి గ్రూపు నుండి ముగ్గురు లీడర్లను ఒక సంవత్సరకాలానికి ఎంపిక చేయాలి.
- లీడర్ల ఎంపికలో వయస్సు, పరిణితి, చదువు, జీవన నైపుణ్యాలలో శిక్షణను పరిగణలోకి తీసుకోవాలి. ఇంకా ఈ కార్యక్రమాల పట్ల ఆసక్తి, ఉత్సాహం కలిగి, వారి సమయాన్ని ఈ కార్యక్రమాలకు కేటాయించగలిగిన వారై వుండాలి.
- ఈ నాయకులలో ఒకరిని 'సఖి' అని, ఇద్దరిని 'సహేలి' అని పిలుస్తారు. 'సఖి' బాలికకు సహేలిలు సహకరిస్తారు.
- ఈ ముగ్గురు బాలికల్లో ఆ సంవత్సరంలో ఒక్కొక్కరు 4 నెలల పాటు సఖిగా వ్యవహరిస్తారు. అనగా లీడర్ (సఖి) ప్రతి 4 నెలలకు మారుతూవుంటారు.
- సఖి, సహేలీల పేర్లను అంగన్‌వాడీ కేంద్రం గోడల పైన, బడి గోడల పైన రాయాలి.
- సఖి సహేలీలుగా గుర్తింపు పొందిన బాలికలు ప్రాజెక్టు స్థాయిలో శిక్షణ పొంది సంబంధిత కిశోరి గ్రూపునకు శిక్షకులుగా, పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.
- సఖి, సహేళిలు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, గ్రోత్ మానిటరింగ్, గృహ సందర్శన లోను, అను బంధ పోషకా హారాన్ని అందించటంలోను అంగన్‌వాడీ కార్యకర్తకు సహాయపడతారు.

## ట్రైనింగ్ కిట్

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.1000 విలువ గల ట్రైనింగ్ కిట్ అందించటం జరుగుతుంది. ఇది యుక్తవయస్సు బాలికలు ఆరోగ్య, పోషణ, సామాజిక, న్యాయవాద సంబంధిత విషయాలను అర్థం చేసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

## కిశోర బాలికా ఆరోగ్య పోషణ దినోత్సవం

- ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించుకొనే ప్రత్యేక ఆరోగ్య దినోత్సవాన్ని "కిశోర బాలికా ఆరోగ్య పోషణ దినోత్సవం" అంటారు.



- ఈ రోజున అంగన్‌వాడీ వర్కర్ యుక్తవయస్సు బాలికలను, వారి కుటుంబ సభ్యులను, ముఖ్యంగా వారి తల్లిదండ్రులను అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశపరచాలి.
- గ్రామస్థాయిలో జరిగే పోషణ, ఆరోగ్య దినం రోజునే కిశోర బాలికా దినోత్సవం జరిగేలా జాగ్రత్తపడాలి.
- ఈ దినోత్సవాన్ని వైద్య సిబ్బంది, ఆరోగ్య పారిశుధ్య కమిటీ సభ్యుల సహకారంతో అంగన్‌వాడీ వర్కర్ నిర్వహించాలి.
- ఆ రోజున లబ్ధిదారులకు పోషణ, ఆరోగ్య సంరక్షణ పద్ధతులు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించాలి.

***కిశోర బాలికా దినోత్సవం రోజున అందించే సేవలు***

- సాధారణ ఆరోగ్య పరీక్షలు - బరువు, ఎత్తు, బాడీ మాస్ ఇండెక్స్, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహిస్తారు.
- యుక్తవయస్సు బాలిక చేత కిశోరి కార్డును నింపించాలి. ముఖ్యమైన మార్పులను కిశోరి కార్డులో నమోదు చేయాలి.
- అవసరమైతే ప్రత్యేక ఆరోగ్య సదుపాయాలున్న కేంద్రానికి పంపించాలి.
- ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.
- పోషణ, ఆరోగ్య విద్యను అందించాలి.
- పోషక ఆహారతయారీని నేర్పించాలి.
- యుక్త వయస్సు బాలికలు, వారి కుటుంబాల ప్రవర్తనలో సానుకూల మార్పును తీసుకురావడానికి కౌన్సెలింగా సదస్సులు ఏర్పాటు చేయాలి.

## కిశోరి కార్డు

యుక్త వయస్సు బాలిక ఆరోగ్యం, అందుకుంటున్న సేవలకు సంబంధించిన వివరాలను పొందుపరచటానికి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని ప్రతి కిశోర బాలికకు ఈ కార్డును అందచేయటం జరుగుతుంది. సఖి, సహేలీలు ఈ కార్డులోని వివరాలు నింపటానికి సహకరిస్తారు. అంగన్‌వాడీ కార్యకర్త ఈ కార్డుపై సంతకం చేయాలి.

## కాలనిర్ణయ ప్రణాళిక

అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు రోజుకు 2 లేదా 3 గంటల చొప్పున వారంలో 2 లేదా 3 రోజుల పాటు ఆరోగ్య, సామాజిక, వృత్తి నైపుణ్యానికి (పోషకాహారేతర) సంబంధించిన అంశాలకు కేటాయించాలి.

- అంగన్‌వాడీ కేంద్రంలో 11-14, 15-18 సం. మధ్య వయస్కులైన బాలికల కోసం విడివిడిగా బోధించే అంశాలకు అనుగుణంగా కార్యక్రమ ప్రణాళికను ప్రాజెక్టు స్థాయిలో తయారు చేసుకోవాలి.
- ఈ సమావేశాలకు రిసోర్స్‌పర్సన్‌గా వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, గ్రామ స్థాయి సంస్థలు, స్వయం, సహాయక సంఘాలు, శిక్షకులు, స్థానికులు మొదలగు వారిని ఆహ్వానించాలి.
- అంగన్‌వాడీ కార్యకర్త సమావేశాల ఏర్పాటుకు సఖి, సహేలీల సహాయం తీసుకోవాలి.
- బడికి వెళ్ళని / మానివేసిన పిల్లలను, బడికి వెళ్ళే పిల్లలతో కలిపి ఉమ్మడి సమావేశాలను కనీసం నెలలో 2 సెలవు దినాలలో జరిగే

విధంగా ఏర్పాటు చేయాలి. తద్వారా బడికి వెళ్ళని పిల్లలకు బడికి వెళ్ళేలా ఉత్సాహపరచాలి.

★ ఈ సమావేశాలకు స్కూల్ టీచర్లను పిలిచి పిల్లలను బడికి వెళ్ళేలా ఉత్తేజ పరచాలి.

### సేవలు అందించే ప్రాంతం

సబల పథకం ద్వారా అందించే అన్ని సేవలకు అంగన్‌వాడీ కేంద్రం కేంద్ర బిందువుగా వుండాలి. అంగన్‌వాడీ కేంద్రంలో సరైన సదుపాయాలు లేని ఎడల, ఊరిలోని పాఠశాల భవనం, పంచాయితీ భవనం, కమ్యూనిటీ హాల్ మొదలైన వాటిని వినియోగించుకోవచ్చు.

*సబల పథకం క్రింద అందించే సేవలు*

★ అనుబంధ పోషకాహారం. ★ ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రల పంపిణీ ★ ఆరోగ్య సేవలు, రెఫరల్ సేవలు ★ పోషణ, ఆరోగ్యం, విద్య ★ కుటుంబ సంక్షేమం, ఆరోగ్య, జీవన నైపుణ్యాలు, పిల్లల సంరక్షణ పద్ధతులు, మొదలైన వాటిపై కౌన్సెలింగ్. ★ 16 సంవత్సరాల పైబడిన వారికి వృత్తి విద్యా శిక్షణ

### అనుబంధ పోషకాహారం

బడి మానివేసిన 11-14 సం.ల కిశోర బాలికలకు, 15-18 సం.ల కిశోర బాలికలందరికి అనుబంధ పోషకాహారం ఇవ్వాలి. ప్రతి కిశోర బాలికకు కనీసం 600 కి.కాలరీలు, 18-20 గ్రాముల ప్రోటీన్‌లు అందించే ఆహారాన్ని సంవత్సరంలో 300 రోజులు ఇవ్వాలి. దీనికి గాను ఒక్కొక్క కిశోర బాలికకు రూ.5 చొప్పున కేటాయించడమైనది.

### ఐ.ఎఫ్.ఎ. మాత్రలు ఇవ్వడం

రక్తహీనతను గుర్తించిన కిశోరబాలికందరు వారానికి రెండు ఐ.ఎఫ్.ఎ. మాత్రలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి వేసుకునేలా చెయ్యాలి.

### ఆరోగ్య పరీక్షలు, రెఫరల్ సేవలు

ఈ సేవలు క్షేత్రస్థాయి వైద్యసిబ్బంది (ఎ.ఎన్.యం; ఆశా) సహకారంతో అందించాలి. కిశోరి కార్డులో ఆరోగ్య సంబంధమైన వివరాలన్నీ రాయాలి.

### పోషణ, ఆరోగ్య విద్య

అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే కిశోర బాలికలందరికీ పోషణ, ఆరోగ్యవిద్యను అందించాలి. ఈ విద్య కిశోర బాలిక తన ఆరోగ్యాన్ని, తన కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు, తరతరాలుగా సంక్రమిస్తున్న ప్రమాదకరమైన పోషణలేమిని నివారించేందుకు దోహదపడాలి.




కుటుంబ సంక్షేమం, పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, పిల్లల సంరక్షణ పద్ధతులు, గృహ నిర్వహణలపై కౌన్సిలింగ్.

ఈ సేవ ద్వారా పై అంశాలపై కిశోర బాలికలో, ఆమె కుటుంబంలో శాశ్వతంగా నిలిచిపోయే మార్పును తీసుకురావాలి. రాబోయే రోజులలో కాబోయే తల్లులుగా వారి పాత్రను సరిగా నిర్వర్తించేందుకు సంసిద్ధుల ను చేయాలి.

### జీవన నైపుణ్యవిద్య, ప్రజాసేవ సంస్థలతో సంధానం

జీవన నైపుణ్య విద్య అందించడం ద్వారా కిశోర బాలికలలో ఆత్మవిశ్వాసం, సరైన నిర్ణయాలు తనంతట తాను తీసుకోగలగడం, ఒత్తిడిని తట్టుకోవడం, హక్కులు, అర్హతలపై అవగాహన, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు మొదలైనవి పెంపొందించి వ్యక్తిగత స్వావలంబన పొందేలా చేయాలి.

ప్రజా సేవ సంస్థల (బ్యాంక్, పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆఫీసులు మొదలైనవి) పై అవగాహన కలిగించి, అవి అందించే సేవలను ఏ విధంగా పొందాలో తెలియచేయాలి.

### వృత్తివిద్యా శిక్షణా కార్యక్రమం

16 సం.ల పైబడిన కిశోర బాలికలకు వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలను గుర్తింపు పొందిన శిక్షణా సంస్థల ద్వారా ఇప్పించి, వారి ఆర్థిక సామర్థ్యాన్ని మెరుగుపరచాలి. జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి కోసం కృషిచేసి ఆర్థిక స్వావలంబన పొందేలా చేయాలి.

### వివిధ శాఖల మధ్య అనుసంధానం

★ ఆరోగ్యం, విద్య, యువజన వ్యవహారాలు, ఉపాధి, పంచాయితీరాజ్ వంటి వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఈ పథక లక్ష్యాలు సాధించాలి.

★ ఐ.ఎఫ్.ఎ. మాత్రల పంపిణీ, ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం, ఆరోగ్య విద్య, తదితరసేవలు అందించే విషయాలలో కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ సేవలను వినియోగించవచ్చు.

★ విద్యాశాఖ సమన్వయంతో సబల పథకాన్ని అమలు చేయటం ద్వారా బడికివెళ్ళని బాలికలను గుర్తించి, వారిని తిరిగి బడిలో చేర్చడానికి కృషి చేయాలి.

★ జీవన నైపుణ్య విద్యా శిక్షణలో, యువజన శాఖ సేవలను వినియోగించవచ్చు.

★ పంచాయితీరాజ్ శాఖ సమన్వయంతో ఈ పథకం సేవలు ఎక్కువ మంది వినియోగించుకునే విధంగా ప్రోత్సహించవచ్చు.

### శిక్షణ ప్రణాళిక

కేంద్రస్థాయిలో అధికారులకు ఓరియంటేషన్ ట్రెయినింగ్ కార్యక్రమాల ద్వారా సబల పథక నిర్వహణకు సంబంధించిన శిక్షణ అందిస్తారు.

★ వివిధ స్థాయి శిక్షణా కార్యక్రమాల కోసం మాడ్యూల్స్ రూపొందించటం జరిగింది.

★ ట్రైనింగ్ మాడ్యూల్స్‌ను అనుసరించి గుర్తించబడిన స్వచ్ఛంద సంస్థలవారు సఖి, సహేలీలకు శిక్షణ అందిస్తారు.

★ భారత ప్రభుత్వం రూపొందించిన శిక్షణా మెటీరియల్‌ను

## ప్రాజెక్టు స్థాయి

క్షేత్రస్థాయి ఎన్.జి.ఒ ల ద్వారా నిర్ణయించిన ప్రణాళిక ద్వారా సఖి, సహేలీకు శిక్షణ అందించడం జరుగుతుంది.

| క్రమ సంఖ్య | శిక్షణ స్థాయి | శిక్షణ పేరు | శిక్షణ ఇచ్చేవారు | శిక్షణ పొందేవారు |
|---|---|---|---|---|
| 1 | కేంద్రస్థాయి | ఓరియంటేషన్ ట్రెయినింగ్ | ఎన్ఐపిసిసిడి కేంద్రప్రభుత్వం | రాష్ట్ర రీజనల్ స్థాయి అధికారులు |
| 2 | రాష్ట్రస్థాయి | ఓరియంటేషన్ ట్రెయినింగ్ | ఎన్ఐపిసిసిడి కేంద్రప్రభుత్వం | ఎడబ్ల్యుటిసి/ ఎంఎల్‌టిసి/ ఎమ్ఎన్‌జిఓ సభ్యుల పి.డి సి.డి.పి.ఒలు |
| 3 | ప్రాజెక్టు స్థాయి | శిక్షణ తరగతులు | క్షేత్రస్థాయి ఎన్.జి.వో.లు | సఖి, సహేలీలు |

వివిధ రాష్ట్రాలు వారి మాతృభాషలోకి అనువాదం చేయటం గాని, లేదా వారి అవసరాలను తగిన విధంగా కొత్త మెటీరియల్ రూపొందించటం గాని చేయాలి.

## కేంద్ర స్థాయి

కేంద్రస్థాయిలో ఎన్ఐపిసిసిడి, పి.డి.పి.ఒ.లు, సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ వర్కర్లకు సంబంధించిన మాడ్యూల్స్ రూపకల్పన చేసి ఎడబ్ల్యుటిసి, ఎంఎల్‌టిసిలలో శిక్షణ ఇచ్చేవారికి తగిన తర్ఫీదునిస్తారు.

## రాష్ట్రస్థాయి

- ★ కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎన్ఐపిసిసిడిల భాగస్వామ్యంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాపులను నిర్వహిస్తారు.
- ★ ఎడబ్ల్యుటిసి/ ఎంఎల్‌టిసి/ డిఎంటిటి లలో శిక్షణ అందించేవారికి, మదర్ ఎన్‌జివోలకు వారు శిక్షణ ఇస్తారు.
- ★ ఎన్ఐపిసిసిడి ప్రాంతీయ కేంద్రాలలో ప్రాజెక్టు డైరెక్టర్లకు, సి.డి.పి.ఒ.లకు శిక్షణ ఇస్తారు.
- ★ క్షేత్రస్థాయి ఎన్.జి.ఒ.లకు శిక్షణ పొందిన ఎడబ్ల్యుటిసి/ ఎంఎల్‌టిసి/ ఎమ్ఎన్‌జివోల సభ్యుల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

## వివిధ స్థాయిలలో అధికారుల విధులు

*ప్రాజెక్టు డైరెక్టర్*

- ★ రాష్ట్ర స్థాయి, క్షేత్ర స్థాయిలకు మధ్యవర్తిగా వుంటూ, జిల్లా స్థాయి పర్యవేక్షణ చేపడతారు.
- ★ 'సబల' పథకం సేవలపై ప్రజలలో అవగాహన కల్పించడానికి కృషి చేస్తారు.
- ★ జిల్లాస్థాయి వివిధ శాఖల సమన్వయం కల్పించటం ద్వారా పథక లక్షణాలు సాధించడానికి కృషి చేస్తారు.
- ★ జిల్లా స్థాయిలో వివిధ ఎన్‌జివోలను కలెక్టర్ అంగీకారంతో గుర్తిస్తారు.
- ★ జిల్లాలో పథక నిర్వహణను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమచారాన్ని రాష్ట్ర స్థాయి అధికారులకు పంపిస్తారు.

*సిడిపివో*

- ★ సమాజంలో 'సబల' పథకంపై అవగాహన కల్పించటానికి ప్రణాళికను అమలు చేస్తుంది.
- ★ ప్రాజెక్టు స్థాయిలో వివిధ శాఖల మధ్య సమన్వయంలో పథకాన్ని, అమలు జరిగేటట్లు చూడాలి.
- ★ అందుబాటులో ఉన్న వివిధ వృత్తి విద్యా కోర్సులను గుర్తించాలి.
- ★ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోను ఐఎఫ్ఎ మాత్రలు సరఫరా జరిగేలా వర్కర్లకు ఇవ్వాలి.
- ★ ప్రాజెక్టు స్థాయిలో పథక అమలును పర్యవేక్షించాలి.

*సూపర్ వైజర్*

- ★ అంగన్‌వాడీ వర్కర్ సహాయంతో ఎ.జి.లను గుర్తించాలి.
- ★ బడిమాని వేసిన కిశోరి బాలికలను బడిలో చేర్చేందుకు విద్యాశాఖ సహకారంలో తోడ్పడాలి.
- ★ సఖి సహేలీల శిక్షణను పర్యవేక్షించాలి.
- ★ అంగన్‌వాడీ కేంద్ర సందర్శనలో కనీసం 10 శాతం కిశోర బాలికల ను పరిశీలించాలి.
- ★ కిశోరి బాలికా దినోత్సవాన్ని జరపడానికి ప్రణాళిక చేయాలి.

*అంగన్‌వాడీ కార్యకర్త*

- ★ కేంద్ర పరిధిలో వున్న కిశోర బాలికలని సర్వే ద్వారా గుర్తించాలి.
- ★ సఖి, సహేలి సహాయంతో కిశోరి దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలి.
- ★ ప్రతి కిశోర బాలిక సబల కార్డు, సబలకు సంబంధించిన రిజిష్టర్లను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.
- ★ సఖి, సహేలీల సహాయంతో కిశోర బాలికలకు పోషకాహారం అందే ఏర్పాటు చేయాలి.
- ★ గృహ సందర్శనలో భాగంగా కిశోర బాలికలకు సంబంధించిన విషయాలు నమోదు చేయాలి.
- ★ ప్రతి కిశోర బాలిక సబల సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలి.
- ★ సఖి, సహేలీల ఎంపికలో సహాయం చేయాలి.

*సఖి, సహేలీ*

- ★ సహేలీల సహాయంతో సఖి 4 నెలల పాటు లీడరుగా వ్యవహరిస్తారు.
- ★ శిక్షణ పొందిన అనంతరం వీరు కిశోరి సమూహానికి శిక్షకులుగా వ్యవరిస్తారు.
- ★ సఖి, సహేలీలు అంగన్ వాడీ కేంద్రంలో రోజు వారీ కార్యక్రమాలు నిర్వహించేలా కిశోరి దినోత్సవ ఏర్పాటులోను అంగన్‌వాడీ కార్యకర్తకి సహాయం చేయాలి.
- ★ టిహెచ్ఆర్ పంపిణీలోను సబల రిజిష్టర్ నిర్వహణలో కూడా వీరు అంగన్‌వాడీ కార్యకర్తకి సహాయపడతారు.

**ఓ కమర్షియల్ టీవీ ఛానల్ నిర్వహించే ఓ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తణికెళ్ళ భరణి సరసన అధిరోహించిన మరో ముఖ్య అతిధి శ్రీ రాజమౌళి. ఆ మాట వినగానే సాధారణంగా స్ఫురించే వ్యక్తి దర్శకుడు 'రాజమౌళి'.**

**అందరితో పాటూ నేను అలాగే ఆలోచించాను. కానీ నా అంచనాలను పటాపంచలు చేస్తూ వచ్చాడో సాదా సీదా వ్యక్తి. తెల్ల ఫ్యాంటు, షర్టు ధరించి, కళ్ళద్దాలతో చిరుదరహాసంతో హుందాగా వస్తున్న వ్యక్తిని చూస్తూనే నా శరీరం పులకరించింది. ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయినంత పనయింది అంటే నమ్మండి. టి.విలో రాజమౌళిగారి గురించిన పరిచయం ఇలా సాగుతూ ఉంది.**




# ఇది మన ఆట - మన కోసం

"శ్రీ రాజమౌళి గారు వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి గ్రామ సర్పంచ్. ఈయన గ్రామస్తులను ప్రేరేపించి గంగదేవి పల్లి గ్రామాన్ని బహిరంగ మల విసర్జనా రహిత గ్రామంగా తీర్చిదిద్ది రాష్ట్రపతి చేతుల మీదుగా నిర్మల గ్రామ పురస్కారం సాధించిన వ్యక్తి. ఆదర్శ గ్రామంగా గంగదేవి పల్లిని తీర్చిదిద్దటంలో సఫలీకృతుడైనాడు" అని ప్రకాష్ రాజ్ గారు వివరిస్తుంటే ఓ సాధారణ వ్యక్తి, ఓ గ్రామ సర్పంచ్ ఎంతగా ఎదిగాడు. ఓ కమర్షియల్ పోగ్రాంకు ముఖ్య అతిధిగా ఆహ్వానించబడటం అంటే మాటలా? అతను ఆ స్థాయికి ఎలా ఎదిగాడు? అని విశ్లేషించుకుంటే... అతని మాటల్లోనే..

***అతను చెప్పిన విషయాలు రెండే రెండు.***

ఒకటి, 30 సంవత్సరాల క్రితమే గంగదేవి పల్లి గ్రామంలో మద్యపాన నిషేధానికి గ్రామస్తులను అంగీకరింపచేసి బెల్ట్ షాపులను మూయించడంలో కృతకృత్యులయ్యారు. ఇప్పటికీ వారి గ్రామంలో మద్యం దొరకదు.

రెండు, వారి గ్రామాన్ని నిర్మల గ్రామంగా తీర్చిదిద్దడానికి బహిరంగ మల విసర్జనను రూపుమాపి మరుగుదొడ్ల వాడకం దిశగా ప్రజలను చైతన్య పరచడంలో విజయం సాధించారు. ఈ క్రమంలో మరో ఆశ్చర్యకర విషయం ఏమంటే మరుగుదొడ్ల నిర్మాణానికి కేవలం 3 నెలలు శ్రమిస్తే, వాటిని వాడేలా చేయడానికి 3 సంవత్సరాలు పట్టింది, ఆశ్చర్యంగా లేదు.

ఈ కార్యక్రమంలో మరో చర్చించిన అంశం సామాజిక మార్పు సాధించడం ఎలా? అనే ప్రశ్నకు తణికెళ్ళ భరణిగారు చట్టాలను కఠిన తరం చేసి మార్పు సాధించవచ్చు అని చెప్తుంటే, మన రాజమౌళిగారు అదే మందహాసంతో "సామాజిక మార్పుకు కావలసిందల్లా ప్రజలను చైతన్య పరచడమే. అదెలా అంటే, సమస్యలను, సమస్యల వలన ఉత్పన్నమయ్యే అనర్థాలను ప్రజలను అర్థమయ్యేలా తెలియజేసి, సామాజిక మార్పు సాధించవచ్చు. మేము అనుసరించిన మంత్రం ఇదే" అంటున్నపుడు అతని మాటల్లో ఆత్మ విశ్వాసం తొణికిస లాడింది.

అందువల్లనేనేమో, శ్రీ రాజమౌళి ఈ స్థాయికి ఎదిగారు. మనమూ రాజమౌళి గారి లాగానే కృషిచేస్తే మనమూ సగర్వంగా ఇలా చెప్పగలం.

*('ఇది మన ఆట మన కోసం' అంటూ (2011, ఏప్రిల్ 4,5 తేదీలలో 'మా' టివిలో రాత్రి 9 గం॥లకు ప్రసారమైన 'ఇట్స్ మై షో' స్ఫూర్తితో)*

***- పి. మాధురి, ఫ్యాకల్టీ, అపార్డు***

***ఎన్‌జివో***

సబల పథకం కింద గుర్తింపబడిన ఎన్‌జివోలు సఖి, సహేలీలకు శిక్షణ ఇవ్వటం లోను, పోషక ఆరోగ్య విద్యను, జీవన నైపుణ్యాలను అందించటంలోను సహాయపడతాయి.

**అధికారిక, విత్త విధానం**

- సబల పథకానికి సంబంధించిన పోషకేతర కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం 100% నిధులను సమకూరుస్తుంది.
- పోషక విభాగానికి సంబంధించిన ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 చొప్పున సమకూరుస్తాయి.

'సబల' పథకం లక్ష్యాలు, ఉద్దేశ్యాలు యుక్తవయస్సు బాలికలకు మేలు చేస్తాయనటంలో ఎటువంటి సందేహం లేదు. అయితే, పథకం అమలు తీరుతెన్నులపైనే పథకం సఫలత ఆధారపడి ఉంటుంది. ఇంతకుముందు యుక్తవయస్సు బాలికలకు చేపట్టిన పథకాలలో లబ్ధిదారుల సంఖ్య మరీ తక్కువగా ఉండటం ప్రధాన లోపం.

నిజానికి, ఈ పథకాలు మన దేశంలో లక్షలాది మంది యుక్తవయస్సు బాలికలకు అవసరం. ప్రభుత్వంలోని అమలు యంత్రాంగాన్ని సమాయత్తం చేసి మరింత పకడ్బందీగా అమలు చేస్తేనే, నూతన పథకానికి సఫలత, సార్థకత లభిస్తాయి.

***- జి. సుజాత***

# పంచాయితీ రాజ్యస్థాపనకు కృషిచేసిన చిరస్మరణీయుడు
# దామోదరం సంజీవయ్య

*"సరకారువోరు కరుకైనవోరూ*
*ఉప్పేరితేనూ తప్పేసినారూ*
*గాంధీ మహాత్మా, గాంధీ మహాత్మా*
*కాచి రచ్చించూ గాంధీ మహాత్మా*
*కాచి రచ్చించూ గాంధీ మహాత్మా"*

**అంటూ అనంతపురంలోని కేశవ విద్యానిలయం ప్రాంగణంలో తోటి విద్యార్థులతో పాటు శ్రావ్యంగా పాడుతూ విద్యార్థులను ఉత్తేజపరచేవాడు దామోదరం సంజీవయ్య.**

సంజీవయ్య కర్నూలు జిల్లాలోని పెదపాడు గ్రామంలో సుంకులమ్మ, మునెయ్య దంపతుల సంతానంగా 1921 ఫిబ్రవరి 14 బీద హరిజన కుటుంబంలో జన్మించాడు. మునెయ్య చేనేత వృత్తితో జీవిస్తూ పాటలు, పద్యాలు రాసేవాడు. సంజీవయ్య పుట్టిన మూడు రోజులకే తండ్రి మరణించాడు. సంజీవయ్య వ్యాలకుర్తిలో వీధిబడిలో ప్రాథమిక విద్య ముగించాడు.



బాల్యం నుండి పాటలు, పద్యాలు వీనులవిందుగా పాడేవాడు. కర్నూలులోనే అమెరికన్ బాప్టిస్టు మిషన్ హైస్కూల్‌లో చదివాడు. అంటరానివాడని సహ విద్యార్థులు ఎగతాళి చేసేవారు. విద్యార్థిగా రాజకీయ నాయకులను అనుకరిస్తూ అందరినీ నవ్వించేవాడు.

మద్రాసులో బి.ఏ., బి.ఎల్., చదువులు పూర్తి చేసిన కొంతకాలం చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. మహనీయుల జీవితచరిత్రలను ఆసక్తితో చదువుతూ వారిలాగే జీవితంలోఉన్నత శిఖరాలే అధిరోహించాలని ఆశించాడు. మద్రాసులో లా డిగ్రీ అందుకొని ప్రముఖ న్యాయవాది రావిశాస్త్రితో మైత్రిని పెంచుకొన్నాడు.

సంజీవయ్య మేధావి. 29 సంవత్సరాల వయసులోనే 1950లో రాజ్యాంగ పరిషత్ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు. ఈ ఎన్నికలలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఎంతగానో సహాయం చేశాడు.

పార్లమెంటు సభ్యుడుగా జాతీయ నాయకులు, పార్లమెంటు ప్రముఖ సభ్యుల ప్రసంగాలను ఎంతో శ్రద్ధగా వినేవాడు. త్వరలోనే ప్రధాని జవహర్‌లాల్ దృష్టిని ఆకర్షించాడు. కుల, మత, వర్గ ద్వేషాలకు, సంకుచిత ప్రాంతీయ ధోరణులకు అతీతంగా, దేశసేవకు కంకణం కట్టుకొన్నాడు. 1952లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గం నుండి, మద్రాసు ఉమ్మడి రాష్ట్ర శాసన సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు.

రాజాజీ మంత్రివర్గంలో సహకార శాఖ మంత్రిగా పనిచేశాడు. తన అభిప్రాయలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా వెల్లడించేవాడని ప్రశంసలందుకొన్నాడు. సదా చిరునవ్వుతో, స్వావలంబనతో క్రమంగా ఉన్నత పదవులందుకొన్నాడు. ఏనాడూ పదవుల కోసం ప్రాకులాడలేదు. పదవులే అతని వెంటపడినాయి. ప్రకాశం పంతులు గారి మంత్రివర్గంలో మద్యనిషేధ శాఖ మంత్రిగా గట్టి కృషి చేశాడు. 1954 నవంబరులో మద్యనిషేధం కారణంగా ప్రభుత్వం పడిపోయింది.

బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య శాఖ మంత్రిగా, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో స్థానిక స్వపరిపాలన, కార్మికశాఖ మంత్రిగా పనిచేశాడు.

'ప్రతి గ్రామానికి ఒక పంచాయితీ' అన్న నినాదాన్ని లేవదీసిన ప్రజాస్వామ్యవాది సంజీవయ్య. పంచాయితీ రాజ్యస్థాపనకు ఎనలేని కృషి చేసి, ప్రజల మన్ననలందుకొన్నాడు.

1960లో సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు. 1954 మే 7న కృష్ణవేణితో ఆయన వివాహం జరిగింది.

39 ఏళ్ళ వయస్సులోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టాడు. ప్రముఖులైన నలుగురు ముఖ్యమంత్రుల వద్ద ఎనిమిదేళ్ళు మంత్రిగా పనిచేసిన అనుభవంతో ముఖ్యమంత్రిగా దక్షతతో పాలన సాగించాడు. స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత మన రాష్ట్రానికే ముఖ్యమంత్రి ఆయన తొలి ఎస్.సి. సంజీవయ్య.

దామోదరం సంజీవయ్య వివిధ నూతన పరిశ్రమల స్థాపనకు కృషి చేశాడు. హైదరాబాదులో మొదటి బాలికల పాలిటెక్నిక్ సంస్థ ఏర్పాటు చేశాడు. పలు కార్పొరేషన్లు స్థాపించాడు.

పులిచింతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాడు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లను ఒకే మున్సిపాలిటీగా ఏర్పాటు చేశాడు. మురికివాడల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టాడు. అవినీతి నిరోధక శాఖను ప్రారంభించిన వాడాయన.

షెడ్యూల్డ్ కులాల, వెనుకబడిన జాతులు, ఎస్.సి.ల అభివృద్ధికి కృషి చేశారు. స్వయంగా సాహిత్యాభిమాని. ఏ పనిచేసినా వెనుకడుగు వేయక, ఎటువంటి ఒత్తిళ్ళకు లొంగక ఆ పనులను పూర్తి చేసేవాడు.

1962లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని అలంకరించాడు. 1964లో నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర కేబినేట్ హోదాలో కార్మికశాఖ మంత్రిగా సేవలందించాడు. లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కూడా మంత్రి పదవిలో కొనసాగాడు.

1986లో ఇందిరాగాంధీ మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశాడు. అపుడాయన రాజ్యసభ సభ్యుడుగా వుండేవాడు. మరల ఇందిరాగాంధీ మంత్రిమండలిలో కార్మికశాఖ మంత్రిగా పనిచేశాడు.

ఉన్నత పదవులలో వుండినా ఎంతో నిరాడంబరంగా వుండి అన్ని వర్గాల వారి మన్ననలందుకొన్నాడు. బహిరంగ సభలలో ఎంతో శ్రావ్యంగా పద్యాలు, పాటలు పాడేవారు. స్వయంగా పద్యాలు రచించాడు.

జీవితాంతం ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించిన దామోదరం సంజీవయ్య 1972 మే 7 న భారత రాజధానిలో తుదిశ్వాస వదిలాడు.

విద్యాధికుడుగా, సద్గుణ సంపన్నుడుగా ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ఎస్.సి. ముఖ్యమంత్రిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైన మొదటి ఎస్.సి. నాయకుడుగా, వివాదరహితుడుగా వెలిగిన దామోదరం సంజీవయ్య చిరస్మరణీయుడు.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

**200 సంవత్సరాలకు పైగా పరాయి పాలనలో అనేక బాధలకు గురయి, జ్వాలాగ్ని రగిలి, భారత దేశ స్వాతంత్య్రం కోసం మన ముందు తరాలవారు సుదీర్ఘ పోరాటం చేసి, అశేష త్యాగాలతో, అకుంఠిత దీక్షతో, దృఢ సంకల్పంతో, పరాయి పాలన నుంచి విముక్తి పొంది సాధించిన స్వాతంత్ర్య తీపి ఫలమైన ప్రజాస్వామ్యాన్ని మనం అనుభవిస్తున్నాం.**

ఫలితంగా 1947వ సంవత్సరం ఆగష్టు 15 మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది.

భారతీయులకు స్వతంత్రం ఇచ్చే ముందు చర్యగా, బ్రిటిషు పాలకులు, భారత రాజ్యాంగ నిపుణులతో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ పరిషత్ 1946వ సంవత్సరం డిసెంబరు 9 న ప్రప్రథమంగా సమావేశమై భారత రాజ్యాంగాన్ని రూపొందించడం కోసం, ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా పరిశీలించి, బ్రిటన్ పార్లమెంటరీ వ్యవస్థ మాత్రమే ఉపయుక్తమైందని భావించి, రూపొందించిన భారత రాజ్యాంగాన్ని 1949వ సంవత్సరం, నవంబరు 26 న భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది.

మార్పులు, చేర్పులతో, 2006వ సంవత్సరం, ఆగష్టు 15 నాటికి 12 షెడ్యూళ్ళతో 94 సవరణలు చోటు చేసుకున్నాయి.

80 శాతం పైగా భారతీయులు నివసించే గ్రామాల అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని, బి.పి.ఆర్. విఠల్ సిఫార్సుల మేరకు 73, 74 రాజ్యాంగ సవరణలు జరిగాయి. ఇందులోని ప్రత్యేకత ఏమిటంటే, 200 సంవత్సరాల పైబడిన చరిత్ర గలిగిన అమెరికన్ రాజ్యాంగంలో ఏర్పడిన సవరణలలో కేవలం 4700 పదాలు మాత్రమే వుండగా, భారత రాజ్యాంగంలోని ఒక్క 73, 74 రాజ్యాంగ సవరణలలో 7700 పదాలు చోటు చేసుకున్నాయి! అయినప్పటికీ 73, 74 సవరణల ప్రకారం అధికారాలు, బాధ్యతలు అస్పష్టంగానే వున్నాయి.

ఉత్కృష్టమైన భారత రాజ్యాంగంలో 'భారత దేశ ప్రజలమైన మేము, ఈ భారత రాజ్యాంగాన్ని మాకు మేమే రూపొందించుకుని, మాకు మేమే సమర్పించుకున్నాం' అని వుంది. ప్రజాస్వామ్యం ఆదర్శం, ప్రజలందరికీ ఉత్తమమైన జీవన ప్రమాణాలను అందించడమే!

మనదేశంలోని ప్రజాస్వామ్యం అనాది కాలం నాటిదే! ఇవాళ కొత్తగా కనిపెట్టిందేమీ లేదు!

# పురాతన కాలం నుంచే మనదేశంలో గ్రామసభ

ఈ నూతన రాజ్యాంగం 1950వ సంవత్సరం జనవరి నెల 26 నుండి అమలులోనికి వచ్చింది. దీనినే 'గణతంత్ర దినం' అని అంటారు.

ఈ నూతన రాజ్యాంగం, స్వతంత్ర భారతాన్ని 'సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం' ప్రకటించుకున్నందు వలన పాలనా వ్యవస్థలోని ప్రతిఒక్కరూ మినహాయింపు కాకుండా, రాజ్యాంగ లక్ష్యాలను, ఆదర్శాలను కాపాడుకోవడంలో బాధ్యత కలిగి వున్నారు.

భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో పాటు, రాజ్యాంగ నిర్ణయ సభ సలహాదారు బి.ఎన్. రావు, సచ్చింద్రనాద్ సిన్హా వంటి ప్రభృతులు పాలుపంచుకున్నారు. వీరు ప్రపంచంలోని పలుదేశాల రాజ్యాంగాలను పరిశీలించి భారత రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది.

అమెరికా రాజ్యాంగాన్ని అనేక దేశాలు అనుకరించినా, క్లుప్తీకరించ లేకపోయాయి.

స్వీడిష్ రాజ్యాంగాన్ని సామాన్యుడు కూడా అర్థం చేసుకోగల స్థాయిలో వుంది.

ఇంగ్లండ్ రాజ్యాంగం అలిఖితమైంది. ఆచారాలు, సాంప్రదాయాల పై ఆధారపడి వుంది.

బ్రిటన్ పార్లమెంటరీ వ్యవస్థను అనుకరించి రూపొందించబడిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దది కాగా, అతి చిన్నది అమెరికా రాజ్యాంగం!

కాలమాన, పరిస్థితులకనుగుణంగా ప్రజల సంక్షేమం దృష్ట్యా అనేక

ఋగ్వేదం, ఐత్తరీయ బ్రాహ్మణం, కౌటిల్యుని అర్థశాస్త్రం, బౌద్ధమత గ్రంథాలు మొదలైన వాటిల్లో గ్రామసభల గురించిన ప్రస్తావన వుంది. పురాతన భారతంలో గ్రామపంచాయితీలు పరిపాలనాధికారాలను కలిగి వున్నాయి.

మౌర్యుల కాలానికి ముందు వున్న 'లిచ్ఛవీ'' రాజ్యాలలో ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొని వుండేదని బ్రిటిష్ శాస్త్రవేత్త 'హవెల్', జర్మన్ శాస్త్రవేత్త 'కీత్'లు అభిప్రాయపడ్డారు.

క్రీస్తుకు పూర్వం, మూడవ శతాబ్దంలో, గుప్తుల పాలనలో 'పంచమండలి' అనే పేరుతో గ్రామసభ వుండేది. ఆనాటి పాలనలో 'పంచమండలి', 'పరిషత్', 'అధికరణం' అనే మూడు విధాలైన స్థానిక సంస్థలు మూడు అంచెల పరిపాలనలో వుండేవి. నేటి గ్రామ పంచాయితీ, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ అనే పదాలు పైవాటిలో పర్యాయ పదాలైన మూడు అంచెల పరిపాలన అని చెప్పవచ్చు. స్థానిక స్వపరిపాలన సజీవంగా వుంటేనే, భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా స్వయంపాలనా శక్తిని కలిగి వుంటుందని 1915లో పూజ్య బాపూజీ అభిప్రాయపడ్డారు.

భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధులు, భారత రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన మేరకు ప్రజాస్వామ్యపు తీపి ఫలాలు అట్టడుగు వర్గాల వారికి కూడా అందాలంటే స్థానిక ప్రభుత్వాలు బలోపేతం కావాలి. అందుకోసం రాజకీయవేత్తలు కులమతాలకు, రాగద్వేషాలకు అతీతంగా సేవలనందించాలి. అటువంటి స్వర్ణ భారత వీక్షణాన్ని ఆశిద్దాం.

*- ఎ.వి.రాజా*




# క్రికెట్ ప్రపంచ శిఖరాగ్రంపై

**ఇటీవల జరిగిన క్రికెట్ ప్రపంచకప్ పోటీల్లో టీమిండియా సాధించిన విజయాన్ని ఒక పావు శతాబ్దకాలంలో ఖచ్చితంగా అతి గొప్ప క్రీడా సంఘటనగా అభివర్ణించవచ్చు. కోట్లాదిమంది క్రికెట్ క్రీడాభిమానుల మనస్సులపై, సాధారణ ప్రజానీకంపై ఇది చూపిన ప్రభావం అపారం. టీమిండియా విజేతగా అవతరించాలని కోట్లాది మంది ఉద్వేగంగా, ఉద్విఘ్నంగా కోరుకున్న కలల ఫలించిన క్షణమిది.**

ప్రపంచకప్ సెమీఫైనల్ పోటీలో భారత్, పాకిస్థాన్ దేశాలు తలపడినప్పుడు దేశం యావత్తు ఆ పోటీపై దృష్టి నిలిపింది. పాకిస్థాన్‌పై నెగ్గి, టీమిండియా ఫైనల్ పోటీల్లో ప్రవేశించగానే దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు మరింత తీవ్రమై, ఫైనల్ కోసం క్షణక్షణం ఎదురుచూశారు.

ఈ రెండు మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు, దాదాపు 140 మిలియన్ల (14 కోట్లు) మంది ప్రజలు టెలివిజన్ సెట్లకు అతుక్కుని పోయారు! మిగిలిన వారు ఇంటర్నెట్‌ను ఆశ్రయించారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఒక సంఘటనను చూడటం అత్యంత ఆశ్చర్యం కలిగించే





అరుదైన సంఘటన.

భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌లకు ఇరుదేశాల ప్రధాన మంత్రులు, యుపిఎ ఛైర్‌పర్సన్ హాజరవటం సెమీఫైనల్‌కు మరింత ఊపు తెచ్చింది. భారత్ - శ్రీలంకల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇరుదేశాల ప్రెసిడెంట్లు పాల్గొనటం ఫైనల్ మ్యాచ్‌కు మరింత నిండుదనం ఇచ్చింది.

ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా సాధించిన విజయానికి దేశం యావత్తు మురిసిపోయింది. టపాకాయలు కాలుస్తూ, రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు, ఊరేగింపులు చేస్తూ దేశం యావత్తూ ఊగిపోయింది. జాతీయ పతాకాలను చేతుల్లో పట్టుకుని జనం పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చేశారు. స్వీట్లు పంచుకున్నారు. హైటెక్ యువతరం రైళ్లలో ప్రయాణిస్తూ తమ ల్యాప్‌టాప్‌లలో ప్రతి బంతి తెస్తున్న పరుగులను గమనించారు. చివరిలో టీమిండియా కేప్టెన్ మహేంద్రసింగ్ ధోని సిక్స్ కొట్టి భారత్‌ను గెలుపు తీరానికి చేర్చగానే, వారు పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేస్తూ, పండగ వాతావరణాన్ని తలపించారు. ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన భారత్‌కు ఈ విజయం మరింత మధుర జ్ఞాపకాలను అందించింది. ఇక ఫైనల్ పోటీలకు వేదికైన ముంబైలోని వాంఖడే స్టేడియంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించిన వేలాదిమంది ఉప్పొంగిపోయారు. గొప్ప ప్రతిభావంతుడైన క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు ముంబై స్వస్థలం కూడా కావటంతో అక్కడ ఆనందోత్సాహాలు మిన్నంటాయి.

1983లో భారత్ ప్రపంచకప్‌ను

# భారత్



గెలుచుకుంది. అప్పుడు భారత్ గెలుస్తుందని ఎవరూ ఊహించనుకూడా ఊహించలేదు. తరువాత రెండుసార్లు టీమిండియా ఫైనల్ చేరింది. మొన్నటి ప్రపంచకప్ విజయం అకస్మాత్తుగా ఊడిపడింది కాదు. స్థిరమైన శిక్షణ, సాధన, వ్యూహచతురతల కలయికతో వచ్చిన ఫలితం అది. కేప్టెన్ ధోని, టీమ్ సభ్యులు, దక్షిణాఫ్రికాకు చెందిన కోచ్ గారీ కిరస్టన్‌లు సంయుక్తంగా సాధించిన విజయమది.

క్రికెట్ ప్రపంచకప్ పోటీల్లో కార్పొరేట్ సంస్థలు, ప్రకటన కర్తలు ఆసక్తి చూపి, ఎడాపెడా దేశభక్తి పూరిత ప్రకటనలు ఇస్తుండటంతో, టోర్నమెంట్ క్లైమాక్స్‌కు చేరుకునే సరికి వాతావరణం వేడెక్కిపోయింది. కప్ మనకే రావాలని అందరూ ఆశపడటం ప్రారంభించారు. ఆటగాళ్లపై విపరీతంగా ఒత్తిడి పెరిగిపోయింది.

కపిల్‌దేవ్ బృందం ప్రపంచకప్‌ను గెలిచినప్పుడు 10 ఏళ్ల వయస్సు బాలుడైన సచిన్ టెండూల్కర్ ఇప్పుడు అత్యున్నత స్థాయి క్రికెటర్‌గా పెరిగిపోయాడు. ఇప్పటికి సచిన్ 5 సార్లు ప్రపంచకప్ టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. కానీ, గెలుపు బృందంలో ఎప్పుడు భాగం పొందలేదు. 21 సంవత్సరాల పాటు క్రికెట్ ఆడుతూ భారత్ క్రికెట్ చరిత్రలో చెరగని అధ్యాయంలా మారిన సచిన్‌కు ప్రపంచకప్ గెలుపును కానుకగా ఇవ్వాలని టీమిండియా తపించిపోయింది. భారత్ ప్రపంచకప్ గెల్చినందుకు అందరికంటే ఎక్కువగా సచిన్ టెండూల్కరే ఆనందించి ఉంటాడు. అందులోనూ తన స్వస్థలం ముంబైలోనే ఆ వేడుక చోటు చేసుకోవటం అతనికి మరింత ఆనందాన్నిచ్చి ఉంటుంది.





విజయపు ఆనందోత్సాహాలు సద్దుమణగగానే మన మదిలే మెదిలే ప్రశ్న ఒకటే. ఈ విజయం సులభంగా సిద్ధించిందా? అనేదే ఆ ప్రశ్న. కాదనేదే ఆ ప్రశ్నకు జవాబు. భారత్ ఆడిన ప్రతి మ్యాచ్‌జట్టుకి ఒక సవాలు విసిరింది. భారత్ ప్రతి మ్యాచ్‌లో పోరాడి గెలిచింది. దక్షిణాఫ్రికాపై గెలవాల్సిన మ్యాచ్‌లో టీమిండియా ఓడిపోయింది. గెలవాల్సిన మరో మ్యాచ్ 'టై' చేసుకోవటానికి ఇంగ్లాండ్‌కి అవకాశం ఇచ్చాం. అయితే, వెస్టిండీస్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, శ్రీలంకలను ఓడించిన ఆనందం టీమిండియా దక్కించుకుంది. ఈ టీములన్నీ ఇది వరకు ప్రపంచకప్ గెలుచుకున్నవే. ఈ టోర్నమెంట్‌లో ముఖ్యమైన విశేషం ఏమిటంటే, సెమీఫైనల్స్‌కు చేరిన నాలుగు టీముల్లో మూడు భారత ఉపఖండం దేశాలకు చెందినవి కావటమే. ఈ విధంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెస్టిండీల








ఆధిపత్యానికి భారత ఉపఖండం గండి కొట్టింది.

అన్ని మ్యాచ్‌లలో దేశ ప్రజలు అత్యంత ఆసక్తితో, ఆందోళనతో చూసిన మ్యాచ్ భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్. ఇరుగుపొరుగు దేశాలైన భారత్ - పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ అంటే భావోద్వేగాలు ఎప్పుడూ తారాస్థాయిలోనే ఉంటాయి.

భారత్‌లో మ్యాచ్ ఎట్లాగైనా గెలవాలనే పట్టుదలతో పాకిస్థాన్ జట్టు ఆడుతుందని, భారత్ జట్టు మానసిక ఒత్తిడితో సతమతమవుతూ, కీలకమైన సమయంలో మ్యాచ్ జారవిడుస్తుందని ప్రతీతి. అయితే, ఈ సారి అందుకు విరుద్ధంగా జరిగింది. నిజానికి, పాకిస్థాన్‌తో ఆడిన మ్యాచ్‌లో అంతకంటే ముందే మన జట్టు మ్యాచ్ ముగించి ఉండవచ్చు. శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కూడా తొందరగానే ముగించి ఉండవచ్చు.



# సచిన్ టెండూల్కర్




రెండు దశాబ్దాలుగా క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తున్న సచిన్ టెండూల్కర్‌ను 'క్రికెట్ దేవుడు'గా, 'క్రికెట్ శ్రీరామ్'గా, 'క్రికెట్ గాంధీ'గా అభివర్ణిస్తుంటారు. ఇందుకు అతని ప్రతిభా విశేషాలు కొంత కారణమైతే, హుందాతనం, వినయం మరికొంత కారణం.

మరో నాలుగేళ్లకు జరిగే క్రికెట్ ప్రపంచకప్ పోటీల్లో సచిన్ పాల్గొంటాడనేది సందేహాస్పదమే. అయితే, 37 సంవత్సరాల వయస్సులో కూడా సచిన్ టోర్నమెంట్‌లో తన సత్తా చూపాడు. తొమ్మిది మ్యాచ్‌లను అతను సాధించిన పరుగులు 482. సగటు 53.55. వీటిలో రెండు శతకాలు, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి. సచిన్ సాధించిన పరుగులు 2011 ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ద్వితీయ గరిష్టస్థాయిలో ఉన్నాయి.

అంతేకాక, ప్రపంచకప్ టోర్నీలలో 2000 స్థాయిని మొదటిగా చేరుకున్నది సచినే. ఇప్పటికి అతను ప్రపంచకప్ టోర్నీలలో సాధించిన మొత్తం పరుగులు 2278. సగటు 56.95. మొత్తం 45 మ్యాచ్‌లలో పాల్గొన్నాడు. 6 సెంచరీలు సాధిచాడు. 21 సార్లు అర్ధశతకాలపైన సాధించాడు.

క్రికెట్ క్రీడాభిమానులే కాక, అత్యున్నత స్థాయి క్రికెటర్లు కూడా సచిన్‌ను గౌరవభావంతో చూస్తారు. చరిత్రాత్మకమైన విజయానికి జట్టుని నడిపించిన కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనితో సహా, జట్టులోని మిగిలిన సభ్యులు కూడా సచిన్‌కు 'భారతరత్న' ఇవ్వాలని గట్టిగా కోరుతున్నారు.

ఈ టోర్నమెంట్‌లో యువరాజ్ సింగ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాలి. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు లభించిన యువరాజ్‌సింగ్ 9 మ్యాచ్‌లలో మొత్తం 362 పరుగులు చేసి, 15 వికెట్లు తీశాడు.

శ్రీలంకకు చెందిన ముత్తయ్య మురళీధరన్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. అంతర్జాతీయ క్రికెట్ నుంచి మురళీ ఈ టోర్నమెంట్‌తో రిటైరయ్యాడు. తొమ్మిది మ్యాచ్‌లలో అతను 15 వికెట్లు తీశాడు. టెస్ట్ మ్యాచ్‌లలో 800 వికెట్లు, వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో 534 వికెట్లు అతని రికార్డు ఈ రికార్డులు చూస్తే, ఎవరైనా, ఎప్పుడైనా వీటిని ఛేదిస్తారా అనే అనుమానం రాకపోదు.



క్రికెట్ ప్రపంచకప్‌లో భారత ప్రస్థానం పూలబాట ఏమీ కాదు. మీడియా సృష్టించిన హడావిడి వల్ల టీమిండియా సభ్యులను గౌరవించాలని, కానుకలతో ముంచెత్తాలని ప్రతివారూ పోటీలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పోరేట్






# ప్రపంచకప్ కథ

మొట్టమొదటి అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ 1844లో కెనడా, అమెరికాల మధ్య జరిగిందని తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. అయితే, ఎక్కువ మంది ఇంగ్లాండు, ఆస్ట్రేలియాల మధ్య మొట్టమొదటి అంతర్జాతీయ మ్యాచ్ జరిగిందని అనుకుంటారు. టెస్ట్ క్రికెట్ మ్యాచ్ మాత్రం మొదటిసారి 1877లో ఇంగ్లాండు, ఆస్ట్రేలియాల మధ్య జరిగింది. ఈ సిరీస్‌ని 'యాషెస్'గా వ్యవహరించటం పరిపాటి.

ఇటీవలి సంవత్సరాలకు వస్తే, మొదటి వన్డే ఇంటర్నేషనల్ అనుకోకుండా జరిగింది. 1971లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాల మధ్య టెస్ట్ మ్యాచ్ జరిగింది. అందులో ఆఖరి రోజు మ్యాచ్ జరగలేదు. దాంతో కోపాద్రిక్తులైన ప్రేక్షకులను సంతోషపరచడానికి 40 ఓవర్లతో మ్యాచ్ కొనసాగించాలని నిర్ణయించారు. ఓవర్‌కి 8 బంతుల చొప్పున ఈ మ్యాచ్ జరిపారు. పరిమిత ఓవర్లతో ఒక్కరోజు జరిగిన ఆ మ్యాచ్‌కి ప్రజాదరణ లభించింది. క్రికెట్ ఆడుతున్న దేశాలన్నిటిలో తదుపరి వన్డే క్రికెట్ మ్యాచ్‌లు బాగా పాపులర్ అయ్యాయి. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ప్రతి నాలుగేళ్లకొకసారి ప్రపంచకప్ టోర్నమెంట్‌లను నిర్వహించటం ప్రారంభించింది. ప్రపంచంలో జరిగే పెద్ద క్రీడా సంఘటనల్లో ఇదొకటిగా పేరు పొందింది.

1975లో మొదటి టోర్నమెంట్ జరిగింది. దీంతో సహా, 1979,1983లలో జరిగిన రెండవ, మూడవ టోర్నమెంట్లు ఇంగ్లాండులోని లార్డ్స్ మైదానంలోనే జరిగాయి. ఉద్దండులైన ఆటగాళ్లతో కూడిన వెస్టిండీస్ జట్టు క్లైవ్ లాయిడ్ నాయకత్వంలో ఆడి, ప్రత్యర్థులందర్నీ చిత్తు చేసి, మొదటి వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. అప్పుడు జూనియర్‌గా ఉన్న మాస్టర్ బ్లాస్టర్ విలియన్ రిచర్డ్స్ తన ప్రతిభావంతుమైన మెరుపులను అప్పుడే ప్రదర్శించాడు.

1979 ఫైనల్‌లో ఇంగ్లాండును ఓడించటం ద్వారా వెస్టిండీస్ ప్రపంచకప్ పోటీల్లో తన ఆధిక్యతను రెండవ టోర్నమెంట్‌లో కూడా నిలబెట్టుకుంది. లాయిడ్, రిచర్డ్స్, డెస్మాండ్ హేన్స్, గార్డన్ గ్రీనిడ్జ్, అల్విన్ కాళీచరణ్ బ్యాట్‌తో మెరవగా, ఆండీ రాబర్ట్స్, జోయల్ గార్నర్, మైఖేల్, కాలిన్ క్రాఫ్ట్‌లు బంతితో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌ను ఒక ఆటాడించారు.

టీమిండియా బంగారు క్షణాలు 1983లో వచ్చాయి. ఛాంపియన్లయిన వెస్టిండీస్‌తో భారత్ ఫైనల్‌కు వచ్చినప్పుడు కపిల్‌దేవ్ జట్టును ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. భారత్ నిర్దేశించిన 184 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ తేలికగా ఛేదిస్తుందని భావించారు. అయితే 140 పరుగులకే వెస్టిండీస్‌ను కట్టడి చేస్తూ భారత బౌలర్లు అద్భుత విన్యాసాన్ని ప్రదర్శించారు.

1987లో భారత్, పాకిస్తాన్‌లు సమిష్టిగా ప్రపంచకప్ పోటీలకు ఆతిథ్యమిచ్చాయి. సెమీఫైనల్స్‌లో రెండు దేశాలూ ఓడిపోగా, ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించటం ద్వారా ఆస్ట్రేలియా విజేతగా ఆవిర్భవించింది. 1992లో కప్ పాకిస్థాన్ వశమైంది. 1996లో గెలుపు శ్రీలంక వంతయింది. తదుపరి మూడు టోర్నమెంట్లలో (199,2003,2007) కప్ గెలుచుకోవటం ద్వారా ఆస్ట్రేలియా తిరుగులేని విజేతగా మారింది. 2011లో భారత్ సాధించిన విజయం మనదేశాన్ని అనేక సంవత్సరాల పాటు శిఖరాగ్రాన నిలుపుతుందని ఆశిద్దాం.

సంస్థలు, మొదలైనవన్నీ టీమిండియా సభ్యులను కోట్లాది రూపాయల నగదు బహుమతులతో, లగ్జరీ విల్లాలతో, ఫ్లాట్లతో, లగ్జరీ కార్లతో, విమాన సదుపాయాలతో ముంచెత్తాయి.

అయితే, ఇట్లా ఉచితంగా కట్టబెట్టటంపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఇట్లా పన్ను చెల్లింపుదారుల కష్టార్జితాన్ని ఆటగాళ్లకు ఇవ్వటం సముచితమేనా అని వారు ప్రశిస్తున్నారు. ఒక వైపు సామాన్యులు అధిక ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అంతటా వ్యాపించిన అవినీతి వంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే, వారు చెల్లించిన పన్నుల ద్వారా సమకూరిన ధనంతో ఉచిత పందారాలు చేయటమేమిటిని వారు విమర్శిస్తున్నారు.

ఇప్పటికే, ఆటగాళ్లు మ్యాచ్ ఫీజుల ద్వారా, అడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా, స్పాన్సర్‌షిప్‌ల ద్వారా వచ్చిన డబ్బుతో అత్యధిక ఆదాయం కలిగిన సంపన్న వంతులుగా మారారని, వీరికి ఇవన్నీ ఇవ్వటమెందుకని అంటున్నారు. క్రికెట్ కారణంగా ఇతర క్రీడలు నాశనమైపోయాయనే విమర్శకులకు మరింత ఆధారం దొరికినట్లయింది. అంతేకాక, దేశానికి గౌరవాన్ని, కీర్తి ప్రతిష్టలను తీసుకొచ్చిన హాకీ క్రీడాకారులు, ఇతర క్రీడాకారుల పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు వివక్షను, చిన్న చూపును ప్రదర్శిస్తున్నాయని వీరు వాదిస్తున్నారు. ఈ విమర్శల్లో నిజం లేకపోలేదు.

**-దాసుకేశవరావు**

**(అనువాదం : వై.సరోజ)**










# గ్లోబల్ వార్మింగ్ వల్ల రానున్న ప్రమాదాలు

## - నివారణ చర్యలు

**'గ్లోబల్ వార్మింగ్ (ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల) 21వ శతాబ్దిలో అతి ముఖ్యమైన వాతావరణ సమస్య కానున్నది' - ఆల్బర్ట్‌గోరె, అమెరికా సంయుక్త రాష్ట్రాల మాజీ ఉపాధ్యక్షుడు.**

**ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చించబడే సమస్య గ్లోబల్ వార్మింగ్, దాని దుష్పరిణామాలు. వాతావరణ వేడి పెరుగుదల వల్ల పంటలలో, వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి, సముద్ర మట్టంమీద, మంచు పర్వతాలపై ప్రభావాన్ని చూపుతాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల సంభవించే దుష్పరిణామాలను, దానిని తగ్గించేందుకు చేపట్ట వలసిన చర్యలను ఇక్కడ చర్చిద్దాం.**

### గ్రీన్ హౌస్ ప్రభావం

గ్లోబల్ వార్మింగ్‌నే 'గ్రీన్‌హౌస్ ప్రభావం' అంటారు. భూమిచుట్టూ వాతావరణం వివిధ రకములైన వాయువులతో నిండి ఉంటుంది. అట్టి వాయువుల వలయం గాజు లేక ప్లాస్టిక్ వలయం లాంటిది కాదు. గాలిలో నత్రజని 78%, ఆక్సిజన్ 21% ఉంటాయి. మిగిలిన వాయువులు అతిస్వల్ప ప్రమాణంలో ఉంటాయి. స్వల్ప ప్రమాణంలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్ (బొగ్గుపులుసు వాయువు), మిథేన్‌లను గ్రీన్‌హౌస్ వాయువులంటారు.

అత్యంత అధిక ఉష్ణోగ్రతలో జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ చర్యవల్ల సూర్య శక్తి ఎంతో అధికమై ఉంటుంది. భూమి మీద పడే సూర్య కాంతిలో 70 శాతాన్ని భూమి ఉపరితల, వాతా వారణంలోని గాలులు గ్రహిస్తాయి. మిగిలిన 30 శాతం భూమి ఉపరితలం నుండి వేర్వేరు దిశలో (అన్ని దిశలలో) పరావర్తనం చెందుతుంది. భూమి తాను గ్రహించిన వేడిలో చాలా భాగాన్ని తిరిగి శూన్యంలోకి (స్పేస్) వదులుతుంది. లేనిపక్షంలో కాలక్రమేణా భూమి వేడెక్కే ప్రమాదమంది.



వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువులు, మబ్బులు లేనట్లయితే, భూమి ఉపరితలం ఉష్ణోగ్రత ఇప్పుడున్న ఉష్ణోగ్రత కన్న 60 డిగ్రీల ఫారిన్‌హీట్ (33 డిగ్రీల సెల్షియస్) ఎక్కువగా ఉండి ఉండేది.

వాతావరణంలో గ్రీన్ హౌస్ వాయువుల ఉనికి భూమిమీద అవసరమైన ఉష్ణోగ్రత (వేడిమి) ఉండేటట్లు సహాయపడుతుంది. గ్రీన్ హౌస్ వాయువులు సూర్యశక్తి నుండి, భూమి మీద నుండి పరావర్తనం చెందే ఉష్ణం నుండి కొంత వేడిని గ్రహిస్తాయి. అందువలన ఆ వాయువులు వేడిగా ఉంటాయి. ఈ వేడిమి కొంత భాగం తిరిగి భూమివైపు ప్రసారమౌతుంది. ఈ విధంగా భూమి వైపుసాగే ఉష్ణ ప్రసరణం వల్ల వాయువులన్నీ భూమి ఉపరితలాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి. గ్రీన్ హౌస్ వాయువుల ఉష్ణోగ్రత నిరంతరం పెరుగుతూ ఉన్నట్లయితే కొన్ని సంవత్సరాలకు భూమి మీద ఉష్ణోగ్రత శాశ్వతంగా కొద్దిగా పెరిగే అవకాశముంది. దీనినే 'గ్రీన్ హౌస్ ప్రభావం' అంటారు. గ్రీన్ హౌస్ వేడిలో 50% కార్బన్‌డైఆక్సైడ్ వల్ల కలుగుతుంది. మిగిలిన వేడి నైట్రస్ ఆక్సైడ్, మిథేన్, ఉపరితల ఓజోన్‌ల వల్ల ఏర్పడుతుంది. పెట్రోలియం, బొగ్గు, సహజవాయువుల వాడకం వల్ల వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ శాతం పెరుగుతుంది. దాదాపు 50 కోట్ల సంవత్సరాలుగా భూమిలోపల ఏల ఏర్పడ్డ ఇంధనాలను మానవులు నిరంతరం వాడడం వల్ల అవి మలిన వాయువులు (కాలుష్యాలు) గా మారి గాలిలో కలిసిపోతున్నాయి.

1958 వ సంవత్సరం నుండి శాస్త్రజ్ఞులు వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ శాతాన్ని ప్రయోగాల ద్వారా కొలువనారంభించారు. కార్బన్ డై ఆక్సైడ్ శాతం (1958 నుండి 1990 వరకు) సంవత్సరానికి 0.4 శాతం పెరుగుతున్నట్లు కనుగొన్నారు. ఇంధనవాడకం వల్ల మానవుడు గాల్లోకి వదిలే కార్బన్ డై ఆక్సైడ్‌లో 50 శాతం చెట్లు గ్రహించగా, మిగిలిన 50 శాతం వాతావరణంలో కలుస్తున్నది. వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ శాతం పెరగడంవల్ల, గ్రీన్ హౌస్ వాయువుల శాతం కూడా పెరుగుతున్నది. అందువల్ల ప్రపంచ ఉష్ణో గ్రత పెరుగుతున్నది.

## భూమి ఎంత వేగంగా వేడెక్కుతోంది?

గడిచిన పదేళ్లలో గ్రీన్‌హౌస్ ప్రభావం వల్ల భూమిమీద వేడి ఎంత పెరుగుతుందో పలు చోట్ల చర్యలు, ప్రయోగాలు జరిగాయి. ప్రపంచంలో వివిధప్రాంతాలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను బట్టి, 1990 వ సంవత్సరం గడిచిన శతాబ్దిలో అత్యంత ఉష్ణోగ్రత కల్గిన సంవత్సరంగా నమోదైంది. అదేవిధంగా 1991 , 1983, 1987, 1988, 1989 అత్యంత వేడి సంవత్సరాలుగా గుర్తింప బడ్డాయి.

1900వ సంవత్సరం నుండి ప్రపంచ ఉష్ణోగ్రత 0.5 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఉదాహరణకు యూరపులోని ఆల్ప్స్ పర్వాత శ్రేణులలోని శీతల మొక్కలు ఇంకా ఎత్తయిన ప్రాంతాలలో పెరగడం ప్రారంభించాయి. ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుతున్నదని తెల్పడానికి ఇది ఉదాహరణ

## రానున్న ప్రమాదాలు

ప్రపంచ ఉష్ణోగ్రత పంటలపై వాతావరణం పై ప్రభావాన్ని చూపుతుంది. భూగోళంలో ఉత్తర భాగంలో ఎక్కువ భూభాగం, దక్షిణ భాగంలో తక్కువ భూ భాగం ఉంది. ఉష్ణోగ్రత పెరగడం వల్ల అమెరికాలో వ్యవసాయ ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉంది. అంతే కాక, పెద్దపెద్ద మంచు పర్వతాలు కరుగుతాయి. కొన్ని నివేదికల ప్రకారం, కొన్ని పెద్ద సరస్సులలో నీటిమట్టం 2 నుంచి 8 అడుగుల వరకు తగ్గే ప్రమాదం ఉంది. అమెరికా పశ్చిమ ప్రాంతంలో నదుల ప్రవాహంలో మార్పు వచ్చేందుకు అవకాశం ఉంది.

ఉష్ణోగ్రత పెరగడం వల్ల మంచు కరిగి నీటిద్వారా సముద్రంలో చేరుతుంది. వేడివల్ల సముద్రపు నీరు వ్యాకోచిస్తుంది. ఈ రెండు కారణాల వల్ల సముద్రపు నీటి మట్టం పెరిగేందుకు ఆస్కారముంది. ప్రస్తుతమున్న గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం వల్ల వచ్చే 50 సంవత్సరాలలో భూమి ఉత్తర, దక్షిణ ధృవాలలో ఉండే మంచు పూర్తిగా కరిగే పరిస్థితి ఏర్పడవచ్చు, సముద్రపు మట్టం పెరగటంవల్ల, పెద్దతుఫానులు వచ్చే ప్రమాదముంది. భవనాలు, రోడ్లు మునిగి పోయే ప్రమాదముంది.

గ్లోబల్ వార్మింగ్ వల్ల తుఫానుల తీవ్రత 50 శాతం పెరగవచ్చు. 1992లో ఏర్పడిన ఆండ్రూ తుఫాను అదివరకెన్నడూ కలుగని నాశనాన్ని కల్గించింది.

మియామిలోని నేషనల్ హరికేన్ (తుఫాను) కేంద్రంలో 1990వ సంవత్సరం అత్యంత ఎక్కువ తుఫానులు ఏర్పడిన సంవత్సరంగా నమోదైంది.

ఉషోగ్రత పెరుగుదల వల్ల సముద్రపు నీరు, తీర ప్రాంతాలలో భూమిలోనికి వ్యాపించే ప్రమాదముంది. దీనివల్ల సముద్రపుతీర ప్రాంత భూగర్భజలాలు ఉప్పునీరుగా మారే ప్రమాదముంది.

1992లో ఐక్యరాజ్యసమితి వెలువరించబడిన ఒక నివేదిక ప్రకారం, ఇప్పుడున్న కార్బన్‌డై ఆక్సైడ్ ఉత్పత్తి కొన సాగినట్లయితే 2100 నాటికి బంగ్లాదేశ్ లో నెదర్లాండ్స్‌లోని తీర ప్రాంతాలు మునిగిపోతాయి. మాల్దీవులు పూర్తిగా అదృశ్యమయ్యే ప్రమాదముంది.

## అడవులను నరికి వేయడం వల్ల ఉష్ణోగ్రత పెరుగుతుంది

ప్రపంచ వాతావరణంలోని కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహించి,దానిని నియంత్రించడంలో వృక్షాములు కీలక పాత్ర వహిస్తాయి. సముద్రాలు, సముద్రాలలోని వృక్ష సంపద కూడ కార్బన్‌డైఆక్సైడ్‌ను తగ్గిస్తాయి.

ఒక ఎకరాలోని అరణ్యం, ఒక ఎకరాలోని పంటపొలం కంటే పదిరెట్లు ఎక్కువగా కార్బన్‌డైఆక్సైడ్‌ని తొలగిస్తుంది. చెట్లను కాల్చినప్పుడు వాటిలో నిల్వ ఉన్న కార్బన్‌డై ఆక్సైడ్ వాతావరణంలోకి విడుదల చేయబడుతుంది. ప్రతిరోజూ ప్రపంచంలో 5500 ఎకరాలలోని అడవులు

దహనమవుతున్నాయి. ప్రతి సంవత్సరం 0.4 శాతం కార్బన్‌డై ఆక్సైడ్ పెరుగుతోంది. ఉన్న చెట్లను రక్షించడం ద్వారా, మొక్కలను నాటటం వల్ల వాతావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చు.

## జనాభా పెరుగుదల ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలకు దోహదకారి

ప్రపంచ జనాభా పెరుగుదలకు,భూ సంపద తరిగిపోవడానికి మధ్య సంబంధం ఉంది. పారిశ్రామికాభివృద్ధి కూడ జనాభా పెరుగుదలకు దోహదపడుతోంది. జనాభా పెరుగుదల వలన కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరుగుతుంది. అందువల్ల ఉష్ణోగ్రత పెరుగుతుంది. తద్వారా తీరని నష్టం నాటిల్లుతుంది.

## ఆర్థిక పరంగా చూస్తే...

ఉష్ణోగ్రత పెరుగుదల వలన కొన్ని పంటలు లాభపడతాయని కొందరి ఆర్థిక నేత్తల అభిప్రాయం . వేడి ఎక్కువటం వలన తుఫానులు సంభవించి తీరని నష్టం వాటిల్లుతుంది. అందువల్ల భీమా సంస్థలు ఎక్కువగా నష్టపోతాయి అని అనేకులు అభిప్రాయ పడుతున్నారు.

కార్బన్ డై ఆక్సైడ్ శాతాన్ని నియంత్రించేందుకు అయ్యే ఖర్చు ప్రపంచ అభివృద్ధి ప్రణాళిక (జి. డి. పి) లో 3వ శాతం ఉంటుందని అంచనా. కార్బన్‌డై ఆక్సైడ్ శాతాన్ని తగ్గించేందుకు అయ్యే ఖర్చును పారిశ్రామికాభివృద్ధి లేని దేశాలు భరించలేని స్థితిలో ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలే వ్యయాన్ని భరించాలని బడుగు దేశాల వాదన.

## ప్రపంచ వేడిమిపై భిన్నాభిప్రాయాలు

వాతావరణంలో వేడి పెరగడం వల్ల ఎటువంటి ముప్పు వాటిల్లదని కొందరి శాస్త్రజ్ఞులు అభిప్రాయం. గ్లోబల్ వార్మింగ్‌కు చెప్పబడే కారణాలు, కొలమానాలు అర్థరహితమని వీరి అభిప్రాయం. మార్పుల కనుగుణంగా భూమి తనను తాను రక్షించుకుంటుందని వీరి వాదన.

మరికొందరు శాస్త్రజ్ఞులు భూమికి చేరే సూర్యశక్తిలో హెచ్చుతగ్గుల వల్ల వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. 1450వ సంవత్సరం నుండి 1850 వరకు జరిగిన మార్పులను పరిశీలిస్తే, వాతావరణ మార్పులు కేవలం 2 డిగ్రీల ఫారన్‌హీట్ మాత్రమేనని వారి వాదన. అడవుల మండిపోతున్నప్పుడు ఏర్పడే పొగ వాతావరణాన్ని చల్లబరుస్తుందని, అందువల్ల వాతావరణానికి వచ్చే పెనుప్రమాదమేదీ లేదని వీరి అభిప్రాయం.

ఇంకను, భౌగోళిక పరిస్థితులననుసరించి సముద్రతీర ప్రాంతాల ఎత్తు పెరుగుతుందని, అందువల్ల తుఫానుల వల్ల అతిగా భయపడనవసరంలేదని అని వీరి ఆలోచన. వాతావరణంలో ఏర్పడే కొన్ని కర్బనపు ఉత్పతులు వేడి తగ్గేందుకు దోహదపడతాయి. కావున గ్లోబల్ వార్మింగ్ ఎక్కువయ్యే ప్రమాదం లేదని, అని వీరి అభిప్రాయం.

## గ్లోబల్ వార్మింగ్ (ప్రపంచ వేడిమి)ని తగ్గించేందుకు చర్యలు

ప్రపంచవేడిమిని తగ్గించేందుకు మన జీవన విధానంలో కొద్దిగా మార్పులు చేసుకోవడం అవసరం. విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా (అమెరికాలో)



వంటచెరకు (చెట్లను) కాల్చడం వల్ల ఏర్పడుతుంది. కావున మనం విద్యుత్ వాడకాన్ని తగ్గించుకోవాలి. అమెరికా 80 శాతం ఇంధనాన్ని (బొగ్గు + పెట్రోలియం) విద్యుత్ తరుపేణా సరఫరాచేస్తున్నది, కావున విద్యుత్ వినియోగం తగ్గించడం ద్వారా మన ఖర్చును తగ్గించుకోవచ్చు. మన ఇంటి వద్ద, కార్యాలయాలలో, కర్మాగారాలలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. అన్ని దేశాలకంటే అమెరికాలో విద్యుత్తు భారీగా వాడబడుతోంది. అంటే ఎక్కువ దుర్వినియోగం జరుగుతోంది.

విద్యుత్ వినియోగం తగ్గించడంవలన, చెట్లునాటడం వలన ప్రపంచవేడిమి ప్రమాదాన్ని అరికట్టవచ్చును.

రెండవ చర్యగా మనం మన కారు వినియోగాన్ని తగ్గించుకోవాలి. వ్యర్థ పదార్థాలను ఎక్కువగా గాలిలో వదిలే కార్ల వాడకం తగ్గించాలి. వాతావరణ కాలుష్యాన్ని ఎక్కువ చేసే కార్లను వాడ రాదు. వాడుతున్న కార్లకు ఎప్పటికప్పుడు రిపేర్లు చేయించాలి. తక్కువ దూరాలకు నడచి వెళ్లవచ్చు, లేదా మోటార్ సైకిల్‌ను వాడవచ్చు. అందువల్ల ఖర్చుకూడా తగ్గుతుంది.

కాలుష్యాన్ని తగ్గించాలంటే మనం 'తగ్గించు. . . . తిరిగిరాదు. . . . పద్ధతిని పాటించాలి. పేపరు వాడకాన్ని తగ్గించుకోవాలి. వాటి బదులు టవలు, ఇతర గుడ్డలను వాడాలి. రీచార్జబుల్ బ్యాటరీలను వాడాలి.

మనం వస్తువులు కొనేప్పుడు ఎక్కువ మన్నిక గలవాటిని, నాణ్యమైన వాటిని కొనాలి.

మన నైతిక విలువల గూర్చి పరిశీలించవలసిన అవసరముంది. ధనాన్ని ఎక్కువగా వ్యయపర్చడం ద్వారా సంతోషాన్ని పొందలేము. మానవులకు, చెట్లు, జంతువులు, గాలి, మరియు నీరు వంటి ప్రకృతి సహజ వనరులతో ఎక్కువ సంబంధాలున్నాయి. యాంత్రిక, రసాయనిక విద్యుత్ పరికరాలతో మితిమిరిన వాడకాన్ని అలవరుచుకోకూడదు.

వాతావరణ వేడిమినుంచి, కాలుష్యాన్నుండి మనం మన ప్రపంచాన్ని కాపాడుకుందాం. మనమందరం ఈ ప్రపంచం (సంఘం)లో భాగస్వాములమే. ఈ భూమికి ప్రమాదం సంభవిస్తే మనమెవ్వరం ఆ ప్రమాదం నుంచి తప్పించుకోలేం.

**ఎం.వి. శైలేష్**
సి. ఎం. ఇ. డి, ఎ. ఎం. ఆర్. అపార్డ్
(అనువాదం- రాధాకృష్ణ)




పంచాయితీ రాజ్ సంస్థల ప్రజా ప్రతినిధులకు, ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు చట్ట పరిజ్ఞానం అందించాలని తీర్మానించింది.

పరిపాలనలో పారదర్శకతకు అద్దం పట్టి, నిర్ణయాధికారంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, పరిపాలనా వికేంద్రీకరణకు పట్టం గట్టిన 73వ రాజ్యాంగ సవరణ, ఆ స్ఫూర్తికి అనుగుణంగా చర్యలు తీసుకోవటం, పంచాయితీ రాజ్ సంస్థల్ని బలోపేతం చేయటం, సాధికారత దిశగా అడుగులు వేయించటం, పరిపాలనా పరిజ్ఞానాన్ని, చట్టాలపై అవగాహనను పెంచి సామర్థ్యాల పెంపు చర్యల్ని చేపట్టాల్సిన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పింది.

# చైతన్య వారధులు - న్యాయ విజ్ఞాన సదస్సులు

**భారతదేశం ప్రజాస్వామ్య దేశం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు పాలిస్తున్న గణతంత్ర రాజ్యం. తాము నిర్మించుకున్న ప్రజాస్వామ్య దేశంలోని ప్రజలు తమ కోసం ఎటువంటి పాలనా సంబంధిత చట్టాలుండాలో, ఉన్నాయో తెలుసుకునే, చర్చించుకునే, పరిజ్ఞానం కలిగి ఉండాలి.**

రాజరిక వ్యవస్థలో అయితే రాజుల, ప్రభువుల ఇష్టా ఇష్టాలే చట్టాలు, శాసనాలుగా చెలామణి అయ్యాయి. కానీ ప్రజాస్వామ్యంలో వ్యక్తుల ఇష్టాలకు తావు లేదు. ప్రజల అవసరాల మేరకు, ఆలోచనల మేరకు, లక్ష్యాల మేరకు దూరదృష్టితో రూపొందించిన రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నో చట్టాలు రూపొందించినప్పటికీ, ప్రజల నిరక్షరాస్యత, అజ్ఞానం, పేదరికం, ప్రచార లోపం వల్ల అవగాహన లేక, చట్ట పరిధిలో ఎలా సమస్యల్ని పరిష్కరించుకోవాలో, అన్యాయం జరిగితే చట్ట బద్ధంగా ఎలా ఎదుర్కోవాలో అర్థం చేసుకోలేని, తెలియని స్థితిలో ఉన్నారు.

ఈ రకమైన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక బలహీనతల వల్ల ప్రజలు న్యాయాన్ని పొందలేకపోతే అందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమన్వయం అన్న రాజ్యాంగ లక్ష్యాలకు విఘాతం కలుగుతుంది. ఈ వెలితిని పూడ్చటానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 39ఎ ని అనుసరించి ఏర్పాటు చేయబడిందే న్యాయ సేవా అధికార చట్టం 1987.

ప్రజలకు చట్ట పరిజ్ఞానం ఇవ్వటం, ఉచిత న్యాయ సహాయం దీని లక్ష్యం. ఢిల్లీలో జరిగిన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సమావేశం ప్రజలకు సత్వర న్యాయం, సమగ్ర చట్టం సమాచారం చేరాలంటే

## పంచాయితీ ప్రతినిధులకు న్యాయశిక్షణ

### చట్ట పరిజ్ఞానం లేకపోతే నష్టం ఏమిటి?

400 సంవత్సరాల క్రిందట ఫ్రాన్సిస్ బేకన్ చెప్పినట్లు 'జ్ఞానమే శక్తి' అంటారు. అంటే జ్ఞానం లేని వ్యక్తి శక్తి హీనుడౌతాడు. గోటితో పోయే సమస్యకు గొడ్డలి కావాలనుకుంటాడు. భార్యా భర్తల తగాదాలు, కుటుంబ కలహాలు, గట్టు పంచాయితీలు, చిన్న చిన్న కేసుల్లో సైతం పోలీసులు చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి కాల హరణం, ధనవ్యయానికి పాల్పడుతుంటారు.

1989లో 11 రూపాయల దొంగతనం కేసులో అరెస్టయిన వ్యక్తి సంవత్సరం పాటు విచారణ సైతం లేకుండా జైల్లో మగ్గిపోయిన సంఘటన సంచలనం సృష్టించింది. భూమి పంపకం సజావుగా చేసుకున్న సోదరులు గట్టుమీది చెట్టు కోసం సుప్రీం కోర్టు దాకా వెళ్ళిన కేసులో ఆస్తులు కరిగిపోయిన సంఘటనలు హృదయ విదారకంగా చెప్పబడ్డాయి.

ఈ విధంగా చట్టాలపై, కోర్టులపై, అవగాహనాలేమితో మనలో మనమే పరిష్కరించుకోగలిగే కేసుల్లో సైతం కోర్టులనాశ్రయించటం వల్ల కోర్టులపై, పోలీసులపై పని వత్తిడి భారం పెరుగుతుంది. తద్వారా సత్వరమైన నాణ్యమైన న్యాయసేవలు ప్రజలకు అందకుండా పోతాయి.

దేశంలోని 1500 జైళ్ళలో 2.5 లక్షల ఖైదీలకు మాత్రమే సదుపాయం ఉండగా, 3.5 లక్షల ఖైదీలను ఉంచారు. వీరిలో 70 శాతం మంది





విచారణ పూర్తిగాని ఖైదీలు. ఇక కేసుల పెండింగు విషయానికొస్తే, సుప్రీంకోర్టులో 2010 జూన్ 30 నాటికి 57 వేలు, వివిధ హైకోర్టులలో 40 లక్షలు, వివిధ క్రింది కోర్టులలో 2 కోట్ల 70 లక్షల కేసుల పెండింగులో ఉండగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 10 లక్షల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి.

జాతీయ శిక్షణా విధాన ప్రకటన, పదకొండవ ఆర్థిక సంఘం మొదలైనవి పంచాయితీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపుకై శిక్షణా ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పాయి. పై లక్ష్యాల సాధనలో భాగంలో ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు 2 లక్షల 60 వేల మంది పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధులకు అపార్డు ద్వారా పరిపాలన అంశాలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుంది.

ఎన్నికలు జరిగి, ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేసి అధికార పదవులు అధిష్టించిన ఒకటి రెండు నెలల్లోపుగానే పరిపాలనలోని ప్రాథమికాంశాలు, పంచాయితీరాజ్ చట్టం ఆశయాలు, అమలు విధానాలు, ప్రజావసరాలను పరిపూర్తి చేయగల అవకాశాలు మొదలైన అంశాలతోపాటు నాయకత్వం, ప్రజా సమస్యల పరిష్కారాల సామర్థ్యం మొదలైన అంశాలను మొదటి దశలోనూ, మహిళా ప్రతినిధులు, దళితులు, గిరిజనులకై ప్రత్యేకాంశాలపై రెండో దశలోను శిక్షణ ఇవ్వటం జరిగింది.

ప్రజలలో చట్ట పరిజ్ఞానం పెంచటం ద్వారా వారి హక్కుల్ని బాధ్యతల్ని, పేదలకు ఉచిత న్యాయ సహాయ పథకం మొదలైన అంశాలతో పాటు కోర్టు వెలుపల వివాదాల పరిష్కారాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలిపే లక్ష్యాలతో పనిచేస్తున్న రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో కలిసి చట్టాల పై చైతన్యాన్ని పెంచి, ప్రజలకు నిజమైన నాయకులుగా, ప్రతినిధుల ుగా ఉన్న పంచాయితీ సర్పంచులు, ఎం.పి.టి.సి సభ్యులకు న్యాయ శిక్షణా సదస్సులు నిర్వహించాలని అపార్డు పరిధిలోని విస్తరణ శిక్షణా కేంద్రం, ఇ.టి.సి. రాజేంద్రనగర్ నిర్ణయించింది.

ఈ కేంద్రం పరిధిలోని మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించటానికి నిర్ణయించారు.

### శిక్షణా సదస్సులకు ఏర్పాట్లు



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారికి, ఇ.టి.సి. ప్రిన్సిపాల్, రాజేంద్రనగర్ గారి నుండి లేఖ నెం. 911/డి తేది : 25.6.2010 అందిన మరుక్షణమే ఆయా జిల్లాల్లో శిక్షణా సదస్సుల నిర్వహణకు తగిన సహకారం అందించాల్సిందిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను వ్యక్తిగతంగా సంప్రదించి కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ప్రతి జిల్లాలో డివిజన్ స్థాయిలోని పంచాయితీ ప్రజా ప్రతినిధులకు శిక్షణా సదస్సులు నిర్వహించటానికి నిర్ణయించారు. మెంబర్ కార్యదర్శి శ్రీ రవిబాబు, పరిపాలనాధికారి శ్రీ రవీంద్ర రెడ్డి వ్యక్తిగతంగా ఫోనులో మాట్లాడి సంబంధిత జిల్లా కార్యదర్శులకు సూచనలిచ్చారు. కార్యక్రమాల నిర్వహణను క్రింది విధంగా ఖరారు చేశారు.

ఆయా డివిజన్లలోని సర్పంచులు, యం.పి.టి.సి సభ్యులు, మండలాధ్యక్షులు, జిల్లా పరిషత్ సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమానికి తప్పక హాజరై చట్టపరమైన సందేహాలు తీర్చుకోవాల్సిందిగా సంబంధిత జిల్లా పరిషత్ సి.ఇ.ఓ.లు, జిల్లా పంచాయితీ అధికారులు, మండల పరిషత్ అధికారులు లేఖల ద్వారా, పత్రికా ప్రకటనల ద్వారా, వ్యక్తిగతంగానూ సమాచారం అందించటం జరిగింది. పత్రికా విలేకరులకు సమాచారం ఇవ్వటం జరిగింది.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ప్రతినిధులు, సభ్యులతో పాటు, వివిధ చట్టాలైన సివిల్, క్రిమినల్, కార్మిక, మహిళా, వికలాంగుల, పిల్లల సంరక్షణా చట్టాలపై సాధికారత కలిగిన న్యాయవాదులు, యస్.సి, యస్.టి. అత్యాచారాల నిరోధక చట్టంపై అవగాహన, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులు, గిరిజనుల హక్కులు, వెట్టి చాకిరీ, బాల కార్మికులు, ఇన్సూరెన్సు మొదలైన అంశాలపై అధారిటీ కలిగిన, పనిచేస్తున్న వ్యక్తుల్ని సదస్సులకు ఆహ్వానించటం జరిగింది.




### వివిధ అంశాల చట్టాలపై అందించిన పరిజ్ఞానం

1. సమాచార హక్కు చట్టం
2. న్యాయ సేవాధికార చట్టం 1987 లక్ష్యాలు
3. పోలీసు చట్టాలపై అవగాహన
4. అరెస్టు కాబడిన వ్యక్తి హక్కులు
5. స్త్రీ సాధికారతా చట్టాలు
6. గృహహింస నిరోధక చట్టం - 2005
7. పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధక చర్యలు
8. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల (నిరోధక) చట్టం -1989
9. వినియోగదారుల చట్టం -1986
10. భూ విక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషన్
11. పట్టా బదిలీ - మ్యుటేషన్
12. ప్రజా పంపిణీ వ్యవస్థ
13. రేషన్ కార్డు వల్ల లాభాలేమిటి?
14. రేషన్ కార్డు పొందటం ఎలా?

15. చౌక దుకాణాల అజమాయిషీ
16. నిత్యావసర వస్తువుల చట్టం
17. ప్రమాదాలు - నష్ట పరిహారాలు
18. నష్ట పరిహారం కోసం ఎలా ధరఖాస్తు చేసుకోవాలి?
19. థర్డ్ పార్టీ ఇన్సూరెన్సు అంటే ఏమిటి?
20. ఎంత నష్ట పరిహారం చెల్లించాలి?
21. విద్యా హక్కు చట్టం 2009

గ్రామ పంచాయితీలు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలను పంచాయితీరాజ్ చట్టం 1994లో సెక్షన్ 45-46లో చెప్పారు. ముఖ్యంగా 46 (19), (26)లో చెప్పిన గ్రామంలో రక్షణ, వివిధ కులాల మధ్య సామరస్య సాధనకు గానూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహకారాన్ని అందించే ఏర్పాట్ల గురించి వివరించారు.

## ఉచిత న్యాయాన్ని ఎలా పరిగణించాలి?

జాతీయ న్యాయసేవాధికార చట్టం సెక్షన్ 12లో పేర్కొన్న వారంతా ఉచిత న్యాయ సహాయానికి అర్హులు. దీనిని సహాయంగా కాకుండా, హక్కుగానే పరిగణించారు. 'ఉచిత న్యాయం', 'సత్వర విచారణ' అనేవి ఆర్టికల్ 21లోని జీవించే హక్కుగా పరిగణించాలని జస్టిస్ పి.ఎన్. భగవతి అభిప్రాయపడ్డారు. ఉచిత న్యాయ సహాయం అనే ఇంద్రధనస్సు రోగ నిరోధక శక్తి నిచ్చే మందులా వివిధ రూపాల్లో వ్యాధి నిరోధకంగాను, మానవ హక్కుల రక్షణ కవచంగానూ పనిచేస్తుందని జస్టిస్ కృష్ణ అయ్యర్ అభిప్రాయ పడ్డారు.

## ఈ న్యాయ విజ్ఞాన సదస్సులు ఎలాంటి ఫలితాలనిచ్చాయి

తక్షణ ఫలితం అంచనాకు మించిన హాజరు. ప్రతి డివిజన్ నుండి కేవలం 100 నుండి 150 మంది ప్రజా ప్రతినిధులను మాత్రమే అంచనా వేయగా, ప్రతి చోటా 250 నుండి 450 వరకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ సభ్యులు, మండలాధ్యక్షులు ఊహించని సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ అధికారులు కూడా గణనీయమైన సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సులకు శిక్షణా కార్యక్రమ కో-ఆర్డినేటర్ శ్రీ ఎ. గవర్రాజు అధ్యక్షత వహించగా, ఆయా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్థానిక జడ్జీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడరు వ్యక్తులుగా విచ్చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ పేటలో స్థానిక ఆర్‌డిఓ. శ్రీమతి హరిత, డియస్పీ పాపయ్య, రంగారెడ్డి జిల్లా వికారాబాద్ సభలో స్థానిక డి.యస్పీ, తహశీల్దారు, రంగారెడ్డి జిల్లా సీనియర్ న్యాయమూర్తి డా॥ నరసింహారావు పాల్గొన్నారు. వికారాబాద్, చేవెళ్ల, రంగారెడ్డి తూర్పు (3) డివిజన్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, గౌతమ్ ప్రసాద్ పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ సి.ఇ.ఓలు, ఆర్.డి.ఓ, డి.యస్పీ, స్థాయి అధికారులు కూడా హాజరు కావటం, జిల్లా సీనియర్ న్యాయమూర్తుల సమక్షంలో వీరంతా ప్రజా ప్రతినిధులతో ముఖాముఖి సంభాషించటం ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ శాఖలకు మధ్య అంతరం తగ్గిందనే భావన కలిగింది.






## తక్షణ ఫలితాలు

- ★ న్యాయ విజ్ఞానం పట్ల ప్రజా ప్రతినిధులతో నెలకొన్న సందేహాలు తీర్చుకునే అవకాశం కలిగింది.
- ★ అన్ని ప్రభుత్వ శాఖలు, న్యాయ శాఖతో సహా ప్రజల కోసం, సమాజంలో సహజీవనం నెలకొల్పటం కోసం, అభివృద్ధి కోసమే ఉన్నాయన్న భావన కల్పించే ప్రయత్నం జరిగింది.
- ★ ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకునిగా ఎదగాలన్నా, ఒదగాలన్నా చట్ట పరిజ్ఞానం ప్రాధాన్యతను వివరించి, గుర్తించారు.
- ★ పోలీసులూ, చట్టాలూ, కోర్టులూ, ప్రజాభిప్రాయానికీ, అభివృద్ధికీ పాటు పడే క్రమంలో ప్రజలకు వారి హక్కులు తెలియచెప్పే బాధ్యతను ప్రజా ప్రతినిధులు గుర్తించాలని చెప్పారు.
- ★ ఉచిత న్యాయ సహాయం పొందటానికి తాలూకా/మండల న్యాయ సేవాధికార సంస్థల్ని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల్ని లేదా రాష్ట్ర న్యాయ సేవాధికార సంఘాన్ని ఎలా సంప్రదించాలో వివరించారు.
- ★ చట్ట పరిజ్ఞానాన్ని పొందటానికి, ప్రభుత్వ శాఖలతో సంప్రదించటానికి, ప్రజా సమస్యల్ని పరిష్కరించటానికి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవటానికి అధికారంలో ఉన్నా, లేకపోయినా 'జ్ఞానం' అనేది అవసరమనీ, అది ఎప్పటికీ నిలుస్తుందనీ గుర్తించారు.

జిల్లా పరిషత్ శిక్షణా విభాగం రిసోర్సు పర్సన్స్ శ్రీ అనంతరెడ్డి, శ్రీ వెంకటయ్య (మహబూబ్‌నగర్) శ్రీ నిరంజన్, లింగారెడ్డి (నల్గొండ) శ్రీ జయరత్నం, శ్రీమతి పద్మావతి (రంగారెడ్డి) నిరంతర శ్రమ ఈ కార్యక్రమ విజయానికి దోహదపడింది.

*- **అలవాల గవర్రాజు,** కో -ఆర్డినేటర్,*
*లీగల్ సర్వీసెస్ అథారిటీ శిక్షణా కార్యక్రమం*
*విస్తరణ శిక్షణా కేంద్రం, రాజేంద్రనగర్*

**అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిధుల కోసం ఇంతకాలం ప్రభుత్వం వైపే ఎదురుచూపులు చూసే గ్రామపంచాయితీలు బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం నుండి నిధులు నేరుగా గ్రామపంచాయితీలకే రావటంతో ఆ నిధులను తమ సొంత ఆదాయ వనరులను పెంపొందించుకొనేందుకు వెచ్చిస్తున్నాయి.**

## సొంత ఆదాయ వనరులను పెంపొందించుకుంటున్న గార్లదిన్నె

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె గ్రామపంచాయితీ తన సొంత ఆదాయవనరులను పెంపొందించుకొనేందుకుగాను 2008-09, 2009-10 సంవత్సరాలలో గ్రామపంచాయితీకి అందిన బి.ఆర్.జి.ఎఫ్ నిధులతో 6 షాపులతో కూడిన షాపింగ్ కాంప్లెక్సును గ్రామకూడలిలో నిర్మించింది.

ఈ షాపులను గ్రామంలో ఔత్సాహికులైన యువతీ యువకులకు వ్యాపారం నిమిత్తం బాడుగకు ఇచ్చేందుకుగాను పారదర్శకంగా కేటాయించే నిమిత్తం వేలం పాటను కూడా నిర్వహించింది. దీనివల్ల, ఆ రోజు 6 షాపులకు నెలకు రూ. 32,150 లు అద్దెగా గ్రామపంచాయితీకి అదనపు ఆదాయం సమకూరుతోంది.

దోభీ ఘాట్ నిర్మాణం (బుక్కరాయ సముద్రం మండలం -కొర్రపాడు పంచాయితీ)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో పట్టణ ప్రాంతాలలో ప్రతి పనికీ యంత్రాల వినియోగం పెరిగినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ కుమ్మరి, కమ్మరి, రజక, క్షురకులు మొదలైన కులవృత్తుల ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. గ్రామాలలో రజక వృత్తికి ఉన్న ప్రాధాన్యత ఇంతా అంతా కాదు. గ్రామంలోని అన్ని కుటుంబాలు ఇంచుమించుగా తమ దుస్తులను శుభ్రపర్చుకొనేందుకు రజకుల సేవలు వినియోగించుకుంటారు.

సాధారణంగా రజకులు గ్రామస్థుల నుండి సేకరించిన దుస్తులను ఊరికి దూరంగా ఉన్న చిన్నచిన్న వాగులు, వంకలు, సెలయేళ్లలోనో లేదా గ్రామంలోనే వారికోసం ప్రత్యేకంగా కేటాయించిన చెఱువులోనో శుభ్రపరుస్తుంటారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రజకులకు దుస్తులను శుభ్రపర్చేందుకు సరిపడా నీరు లభ్యం కాకపోవటం, ఒకవేళ నీరు లభ్యమయినా నీరు దొరక్కపోవటం, ఉతికిన దుస్తులను ఆరవేసేందుకు తగిన శుభ్రమైన ప్రదేశం దొరక్కపోవటం సమస్యలుగా పరిణమిస్తున్నాయి.

కొర్రపాడు గ్రామపంచాయితీలో కూడా నీటి సమస్య ఉధృతమవ్వటంతో గ్రామంలోని రజకులు గ్రామ సమీపంలోని

# వరంలా మారిన బిఆర్‌జిఎఫ్ నిధులు

ఈ ఆరు షాపుల్లో 1) పండ్ల దుకాణం, 2) ఫాస్ట్ ఫుడ్ సెంటర్ 3) టీ-దుకాణం 4) మిఠాయిల దుకాణం 5) మొబైల్‌ఫోన్ దుకాణం 6) మందుల షాపు... నడుస్తూ గ్రామస్థులకు ఈ సేవలన్నీ ఒకే ప్రదేశంలో లభ్యమవుతున్నాయి.

గ్రామస్థులకు కూడా ఈ వసతి చాలా సౌకర్యవంతంగా ఉండటంతో గ్రామపంచాయితీని అభినందిస్తున్నారు. బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం క్రింద అంది వచ్చిన నిధులను వెచ్చించి ఏటా రూ. 3.50 లక్షలు వచ్చే విధంగా ఒక ఆదాయ వనరును గ్రామపంచాయితీ సమకూర్చుకోవటంతో భవిష్యత్తులో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టటానికి గ్రామపంచాయితీకి వీలు కల్గుతుందని సర్పంచ్, వార్డు సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎటువంటి నిబంధనలు లేకుండా నేరుగా పంచాయితీకి నిధులను విడుదల చేయటం వల్ల, బి.ఆర్.జి.ఎఫ్. నిధులను ఒక ప్రణాళిక ప్రకారం ఖర్చు చేసుకొన్నామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు ఇచ్చినా సద్వినియోగం చేసుకొనే సామర్థ్యాలు తమకు ఉన్నాయని ప్రజాప్రతినిధులు చెప్పటం వారిలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

### షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వల్ల చేకూరిన ఫలితాలు

* గ్రామ పంచాయితీకి అదనపు ఆదాయపు వనరు సమకూరటం
* గ్రామస్థులకు పలురకాల సేవలు ఒకేచోట లభ్యం కావటం
* రహదారిపై అస్తవ్యస్తంగా జరిగే వ్యాపార లావాదేవీలు నిర్ణీత ప్రదేశంలో జరగటం వల్ల రాకపోకలకు అంతరాయం లేకుండా ఒక చక్కని ఏర్పాటు జరిగింది.

రైతుల బోర్‌వెల్స్ వద్ద దుస్తులను శుభ్రపర్చుకోవాల్సి వచ్చేది. రైతుల బోర్‌వెల్సు నుండి నీటిని పొందటానికి అన్ని సమయాల్లో ఈ గ్రామంలోని రజకులను రైతులు అనుమతించకపోవటంతో ఈ సమస్య గ్రామంలో తీవ్రరూపం దాల్చింది. దీంతో రజకులు కూడా గత్యంతరం లేక వాగుల్లో, వంకల్లో నిల్వ ఉన్న నీటిలోనే దుస్తులను శుభ్రపర్చటం వల్ల గ్రామస్థులకు పలు చర్మ సంబంధిత సమస్యలు కూడా ఉత్పన్నమయ్యేవి.

వేసవి సమయంలో అయితే రజకులకు గ్రామంలో నీరు లభ్యం కాకపోవటం వల్ల, గ్రామంలో ఉపాధి దొరక్క దగ్గరలోని పట్టణ ప్రాంతాలకు వలసపోవటం జరిగేది కూడా. ఈ సమస్యను నివారించటానికి గ్రామపంచాయితీకి బి.ఆర్.జి.ఎఫ్. నిధులు జిల్లా పరిషత్తు 20% వాటా నుండి అందటంతో, చిన్నిరాయపల్లి వంక చెక్‌డ్యామ్ పరిసరాల్లో గ్రామపంచాయితీ రూ. 1.50 లక్షలతో ఒక దోభీఘాట్‌ను నిర్మించింది.

ఈ దోభీఘాట్ నందు దుస్తులు ఉతకటానికి అవసరమయిన మంచినీటి సదుపాయం కల్పించటంతో పాటు శుభ్రపర్చేందుకు అనువైన నిర్మాణాలు ఏర్పాటు చేయటం వల్ల గ్రామంలో నెలకొని ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

### దోభీ ఘాట్ నిర్మాణం వల్ల కల్గిన ఫలితాలు

* పరిశుభ్రమయిన వాతావరణంలో దుస్తులు శుభ్రపరుస్తుండటం వలన మెరుగైన గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితి.
* అన్నికాలాలలో నీటివసతి గ్రామంలోనే లభ్యమవటం వల్ల గ్రామం

నుండి పట్టణాలకు తగ్గిన రజకుల వలసలు.

* ఏడాది పొడుగునా రజక కుటుంబాలకు గ్రామంలోనే పనిదొరకటం వల్ల వారి ఆర్థిక పరిస్థితులలో మెరుగుదల.

## బస్ షెల్టరు - సంతేకొండాపురం

అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలోని సంతేకొండాపురం పరిధిలో 2008-09 గ్రామపంచాయితీ బి.ఆర్.జి.ఎఫ్ నిధులు రూ. 1.25 లక్షలతో నిర్మించిన బస్‌షెల్టరు గ్రామస్థుల మనసుల్లో ఆనందాన్ని నింపుతోంది.

సంతేకొండాపురం బ్రహ్మసముద్రం-యాటకల్లు-కళ్యాణదుర్గం ప్రధాన రహదారి నుండి 1.2 కి.మీ దూరంలో ఉంది. గ్రామానికి ఆర్.టి.సి. బస్ సౌకర్యం లేకపోవటంతో గ్రామస్థులంతా విద్య, వైద్య, మార్కెట్ తదితర అవసరాలకు గ్రామం నుండి ప్రయాణించటానికి 1.2 కి.మీ దూరంలో ఉన్న ప్రధాన రహదారి వరకూ నడిచివెళ్ళి బస్ ఎక్కటం చేస్తుండేవారు.

ప్రధాన రహదారిని చేరిన తర్వాత బస్ కోసం వీరు చాలా సమయం రహదారిపైనే వేచి ఉండాల్సి వచ్చేది. ప్రధాన రహదారిపై ప్రయాణికులు వేచి ఉండటానికి ఎటువంటి వసతి అందుబాటులో లేకపోవటం వల్ల ప్రయాణికులు ఎండకు, వానకు పలు ఇబ్బందులుపడేవారు.

విద్యార్థులు, వృద్ధులు, మహిళల బాధలు వర్ణనాతీతం. బస్సుకోసం వేచి ఉన్నప్పుడు పడే వర్షాల వల్ల వ్యవసాయ ఉత్పత్తులు తడిసిపోయి రైతులు నష్టపోయిన సంఘటనలు కూడా కోకొల్లలు. 2008-09 సంవత్సరంలో గ్రామపంచాయితీకి అందిన రూ. 1.25 లక్షలతో గ్రామసభ తీర్మానం మేర బస్‌షెల్టరు నిర్మించుకోవటంతో ఇప్పుడు గ్రామస్థులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థాయి సమస్యలను పరిష్కరించుకోవటానికి పంచాయితీ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయటంతో ప్రజలకు కూడా పంచాయితీపై నమ్మకం పెరిగిందన్నారు. ఈ రోజు విద్యార్థులు, వృద్ధులు, రైతులూ, మహిళలు అందరూ బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమానికి జేజేలు పలుకుతున్నారు. . .

### బస్‌షెల్టరు నిర్మాణం వల్ల కల్గిన ఫలితాలు

* అన్ని కాలాలలో బస్‌ల కోసం నిరీక్షించటానికి అనువైన ప్రదేశం ఏర్పడటం.
* హైవే మీద పోయే బస్సులు కూడా బస్‌షెల్టరు వద్ద తప్పనిసరిగా ఆగి ప్రయాణీకులను ఎక్కించుకొనే ఒరవడి ప్రారంభం.
* రైతులు అత్యవసర సందర్భంలో తమ వ్యవసాయ ఉత్పత్తులను తాత్కాలికంగా బస్‌షెల్టరులో దాచుకొనే వెసులుబాటు.

### ఉద్యాన వనరుల అభివృద్ధి కేంద్రం - కళ్యాణదుర్గ్

దేశంలోనే అత్యంత కరువు పీడిత ప్రాంతాలలో ఒకటైన అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు లేనప్పటికీ, ఈ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనేందుకు రైతులు ఉద్యానవన పంటల పెంపకం వైపు తమ దృష్టిని సారించి ఈ రంగంలో గణనీయమైన ఉత్పాదకతను సాధించారు.

అనంతపురం జిల్లాలో పండే ఉద్యానవన పంటలలో ప్రధానంగా కమలాకాయలు, బత్తాయి, సపోట, దానిమ్మ, మామిడి, అరటి, బొప్పాయి, జామ, నిమ్మ, కూరగాయలు మొదలైనవి ప్రధానమైన పంటలు. ఇవి సహజసిద్ధమైన సమశీతోష్ణ వాతావరణ పరిస్థితులలో పండించటం వల్ల ఇక్కడి పంటలకు మంచి నాణ్యమైన పంటలుగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి.

ప్రభుత్వం కూడా జాతీయ హార్టీకల్చర్ మిషన్ (NHM), రాష్ట్రీయ కృషి వికాస యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా రైతులను అన్ని విధాలా ఉద్యానవన పంటలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించటంతో, జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు ఉద్యానవన పంటలవైపు మొగ్గుచూపుతున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం - జాతీయ హార్టికల్చర్ మిషన్ - ఎ.పి.ఎం.ఐ.పి - కార్యక్రమాలను (కన్వర్జెని) ఏకముఖం చేసి జిల్లాలో అమలుపరుస్తూ 2010-11 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,602 ఎకరాలను అదనంగా ఉద్యానవన పంటల సాగు క్రిందకు తేవాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఇటువంటి బృహత్తర లక్ష్య సాధనకు రైతులను సన్నద్ధం చేయటానికి, వారితో నిరంతరం సంప్రదింపులు జరపటానికి, హార్టీకల్చర్ సిబ్బందికి మండలస్థాయిలో సరియైన వేదిక లేకపోవటంతో శాఖాపరమైన సమాచారాన్ని రైతులకు చేరవేయటంలో ఇబ్బంది ఎదుర్కొనేవారు. ప్రజలు కూడా హార్టికల్చర్ శాఖ సిబ్బందిని కలవటానికి తమ విలువైన సమయాన్ని వెచ్చించినా వారు అందుబాటులో ఉంటారో, లేదా తెలియక నానా ఇబ్బంది పడేవారు.

అంతేగాక రైతులకు మైక్రో ఇరిగేషన్ సమగ్ర సస్యరక్షణ విధానాలు, సేంద్రీయ వ్యవసాయం, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందచేయుటానికి ఒక వేదిక కూడా అవసరమైన నేపథ్యంలో కళ్యాణదుర్గ్, శింగనమల మండలాలతో బి.ఆర్.జి.ఎఫ్ నిధులతో ఉద్యానవనరుల అభివృద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టి, భవన నిర్మాణం పూర్తి చేశారు.

### ఉద్యాన వనరుల అభివృద్ధి కేంద్రం వల్ల కల్గిన లాభాలు

* ఇప్పటి వరకూ అద్దెభవనాలలో నిర్వహిస్తున్న ఉద్యానవన శాఖ కార్యాలయానికి స్వంత భవన సదుపాయం
* రైతులకు అందుబాటులోనే ఉద్యానవన శాఖ సిబ్బంది ఉండటంతో రైతుల సందేహాల సత్వరనివృత్తి
* సేవల నాణ్యతలో మెరుగుదల
* రైతులకు శిక్షణ అందచేసేందుకు శిక్షణావసతి ఏర్పడటం
* రైతులకు ప్రభుత్వం అందచేసే ఎరువులు, ఇతర సామాగ్రి సురక్షితంగా నిల్వ చేసుకొనేందుకు తగిన సదుపాయం

## అంగన్‌వాడీ కేంద్ర భవనం - తోపుదుర్తి

దేశంలో 6 సంవత్సరాల లోపు వయస్సు ఏ చిన్నారి కూడా పౌష్టికాహార లోపంతో బాధపడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించినందున ప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకాన్ని మరింత విస్తృతపరచటంతో, పలు గ్రామాలలో క్రొత్తగా అంగన్‌వాడీ

కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఈ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, ఇతర భౌతిక వసతులు లేకపోవటంతో, అద్దె భవనాలలో, అరకొర వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించక తప్పని పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

మనసుంటే మార్గముండక పోతుందా అన్నట్లు చేతికి అందివచ్చిన బి.ఆర్.జి.ఎఫ్ నిధులతో తోపుదుర్తి గ్రామంలో సొంతభవన సదుపాయం లేని అంగన్‌వాడీ కేంద్రానికి భవన సదుపాయం కల్పించాలని గ్రామపంచాయితీ తీర్మానించుకొన్న వెంటనే రెవెన్యూ శాఖను సంప్రదించి గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం కేటాయించటంలో గ్రామపంచాయితీ సఫలీకృతం అయ్యింది.

2007-08 సంవత్సరంలో జిల్లాకు అందిన బి.ఆర్.జి.ఎఫ్. నిధుల నుండి జిల్లా పరిషత్తు రూ. 45,000, మండల ప్రజాపరిషత్తు రూ. 1,09,000, గ్రామపంచాయితీ రూ. 66,000, గ్రామపంచాయితీ సొంత నిధులు రూ. 56,500 జతచేసి మొత్తం రూ. 3 లక్షల అంచనా వ్యయంతో గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామపంచాయితీ నిర్మించింది.

### అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం వల్ల కలిగిన లాభాలు

* భవన సదుపాయం లేని సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది పిల్లలే నమోదు కాగా, భవన నిర్మాణం తర్వాత మొత్తం 30 మంది పిల్లలు నమోదయ్యారు.
* గర్భిణీస్త్రీలు, బాలింతలతో గతంలో సమావేశాలు నిర్వహించినప్పుడు హాజరు పల్చగా ఉంటే, భవన నిర్మాణం తర్వాత 100 శాతం హాజరు క్రమం తప్పకుండా ఉంటోంది.
* భవన సదుపాయంతో పాటు చక్కని ఆటస్థలం అందుబాటులోకి రావటంతో పిల్లలందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడుకుంటున్నారు.
* అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారం వండిపెట్టటానికి, ఆహార పదార్థాల ను నిల్వ ఉంచుకోవటానికి చక్కని సదుపాయం కల్గింది.
* స్థానిక ప్రజలు కూడా తమ పిల్లలను ఇంటి దగ్గర ఉంచుకొనే బదులు అంగన్‌వాడీ కేంద్రానికి పంపటానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.
* మరుగుదొడ్డి సదుపాయం కూడా ఏర్పడటంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండి ఒక ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.

## అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం

### మాంకాపూర్ గ్రామపంచాయితీ- ఆదిలాబాద్ జిల్లా

అభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలు తగ్గేలా చూడటంతో పాటు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన బి.ఆర్.జి.ఎఫ్. పథకం క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను అందచేస్తోందనటానికి ఆదిలాబాద్ జిల్లాలోని ఎచ్చోడ మండలంలో మాంకాపూర్ గ్రామపంచాయితీలో నిర్మించిన అంగన్‌వాడీ భవనమే ఒక చక్కని ఉదాహరణ.

2007-08, 2008-09, 2009-10 సంవత్సరాలలో గ్రామపంచాయితీకి విడుదల అయిన బి.ఆర్.జి.ఎఫ్. నిధులతో గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గ్రామపంచాయితీ తీసుకొన్న నిర్ణయాన్ని అమలు చేయటానికి ఎచ్చోడ మండల పరిషత్తు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహకారాన్ని అందచేయటంతో మాంకాపూర్ గ్రామస్థుల చిరకాల వాంఛ నెరవేరింది.

మొత్తం రూ. 4.386 లక్షల వ్యయంతో (గ్రామపంచాయితీ 3.236 లక్షలు, మండల పరిషత్తు 1.150 లక్షలు) నిర్మించిన అంగన్‌వాడీ భవనం నేడు గ్రామంలోని మహిళలకు, పిల్లలకు సేవలందిస్తూ ప్రజల మన్ననల ను అందుకుంటోంది. బి.ఆర్.జి.ఎఫ్ నిధులు నేరుగా గ్రామపంచాయితీకే అందటం వల్ల గ్రామప్రజల అభీష్టం మేరకు గ్రామసభలో తీసుకొన్న నిర్ణయంతో నిర్మించబడిన అంగన్‌వాడీ కేంద్ర భవనం నేడు కేవలం అంగన్‌వాడీ సేవలకే పరిమితం కాకుండా, ఒక సామాజిక ఆస్థిగా పరిగణించబడుతూ గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరాల నిర్వహణకుగానీ, లేదా మరెన్నో ఇతర సామాజిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది.

### భవన నిర్మాణం వల్ల కల్గిన ఫలితాలు

* అంగన్‌వాడీ కార్యకర్తలు సౌకర్యవంతంగా సొంత భవనంలో ఉత్సాహంగా తమ విధులకు హాజరు అవ్వటం
* పిల్లలకు ఆహారాన్ని అందచేయటానికి ఒక పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడటం వల్ల పిల్లల హాజరు శాతంలో పెరుగుదల
* పిల్లలు ఆడుకోవటానికి తగినంత ఆటస్థలం ఉండటంతో పిల్లలలో సరైన శారీరక పెరుగుదలకు దోహదం కావడం
* ప్రత్యేక తరగతి గది ఉండటంతో వివిధరకాల పఠనా సామాగ్రిని ప్రదర్శించటానికి అవకాశం ఏర్పడటం.

మండల పరిషత్తు, గ్రామపంచాయితీ పాలకవర్గాలు ఒకే లక్ష్యంతో పనిచేస్తే అందివచ్చే ఫలితాలను ఈ రోజు మాంకాపూర్ గ్రామపంచాయితీ అంగన్‌వాడీ భవన రూపంలో అనుభవిస్తోంది. కేవలం భౌతిక వసతుల కల్పనతోనే సరిపెట్టుకోక, మానవ వనరుల అభివృద్ధిపై కూడా దృష్టి సారించిన మాంకాపూర్ గ్రామపంచాయితీ కృషి అభినందనీయం.

## రహదారుల అనుసంధానం ప్రగతికి సోపానం

### నేరడిగొండ పంచాయితీ - ఆదిలాబాద్ జిల్లా

గ్రామీణ రహదారుల అభివృద్ధి పైనే గ్రామ ఆర్థిక అభివృద్ధికి ఆధారపడి ఉంటుందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్యం సిద్ధించి 6 దశాబ్దాలు నిండినప్పటికీ, నేటికీ పలు గ్రామాల ను సమీప పట్టణాలకు అనుసంధానిస్తూగానీ, లేక గ్రామంలో అంతర్గత రహదారులను అన్ని కాలాలకు అనుగుణమైనవిగా తీర్చిదిద్దటానికి అటు ప్రభుత్వం, ఇటు పంచాయితీరాజ్ సంస్థలు కృషి చేస్తున్నప్పటికీ, పలుగ్రామాలు నేటికీ ప్రధాన స్రవంతిలోకి రావటానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

గ్రామపంచాయితీలు తమకు అందుబాటులో ఉన్న సొంత నిధుల ను రోజువారీ కార్యకలాపాలకే వెచ్చించాల్సి రావటంతో గ్రామంలో రహదార్ల నిర్మాణం, భవనాల నిర్మాణం వంటి అవస్థాపనా సౌకర్యాల కల్పనలో వెనుకబాటుతనం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. అయితే ఇటువంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు 'నేరడిగొండ' గ్రామపంచాయితీకి బి.ఆర్.జి.ఎఫ్ నిధులు ఒక కల్పతరువులాగా లభించాయి.

గ్రామపంచాయితీకి బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం క్రింద 2009-10 ఆర్థిక సంవత్సరంలో అందిన రూ. 1,76,000 నిధులతో నేరడిగొండ గ్రామంలోని సీడ్ గోడౌన్ వద్ద నుండి 7వ నంబరు జాతీయ రహదారి వరకు సిమెంటు కాంక్రీటు రహదారి నిర్మించాలని గ్రామసభ తీసుకొన్న నిర్ణయం. గ్రామస్థుల వెతలెన్నింటినో తీర్చింది.

### రహదారి నిర్మాణం వల్ల కల్గిన ఫలితాలు

* రహదారి నిర్మాణం కాక పూర్వం గతుకులతోను, పిచ్చిమొక్కలతో, విషసర్పాలతో విస్తరించి, నడవటానికి ఇబ్బందిగా పరిణమించిన రహదారి నేడు విశాలంగా పెద్ద వాహనాలు సైతం పోవటానికి సుగమమయ్యింది.
* గతంలో అత్యవసర పరిస్థితులలో 108 అంబులెన్సు వాహనం రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉన్న పరిస్థితులు నేడు తొలగి పోయి ఆరోగ్య అత్యవసర పరిస్థితులను కూడా గ్రామస్థులు నేడు ఎదుర్కోగల్గుతున్నారు. తమ జీవితాలకు భద్రత చేకూరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
* గ్రామస్థులు గ్రామంలో ఉత్పత్తి అయిన వివిధ వస్తు ఉత్పత్తులను ఎటువంటి శ్రమలేకుండా దగ్గరలోని పట్టణాలకు రవాణా చేయ గల్గుతున్నారు.

## జోగినీ కాలనీలో త్రాగునీటి సదుపాయం

### చెన్నూరు గ్రామం - ఆదిలాబాద్ జిల్లా

భారతదేశ గ్రామీణ సమాజంలోని సాంఘిక దురాచారాల్లో జోగినీ వ్యవస్థ విలక్షణమైనది. సమాజంలో చైతన్యం పెంచటం ద్వారా దాదాపుగా ఈ ఆచారాన్ని రూపుమాపినప్పటికీ, జోగినులుగా ముద్రపడిన కుటుంబాలు సమాజంలో ఎంతో కొంత వివక్షతను నేటికీ ఎదుర్కొంటూనే ఉన్నాయి.

ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూరు మండలంలో చెన్నూరులో ఆరునెలల క్రితం వరకు మారుమూలలకు విసిరివేయబడినట్లు ఉండే జోగిని వీధిలో త్రాగునీరు సదుపాయం లేక నానా అవస్థలు పడేవారు. కాలనీలో ఉండే 2 బోర్ వెల్స్‌లో ఒక బోర్‌వెల్‌లోని నీరు బాక్టీరియాతో కలుషితం కాగా, రెండవ బోర్‌వెల్ నీటిలభ్యత లేకపోవటం వల్ల నిరుపయోగంగా మారి జోగినీ కాలనీకి నీటి సమస్యను జటిలం చేశాయి.

సమస్యను అర్థం చేసుకొన్న మండల పరిషత్ 2009-10 బి.ఆర్.జి.ఎఫ్ నిధుల నుండి ఇందిరాకాలనీలో (జోగినీ కాలనీలో) క్రొత్త బోర్‌వెల్ నిర్మాణానికి, పంపింగ్ మెయిన్‌కు మోటార్ కనక్షన్ ఇచ్చి పబ్లిక్ కుళాయిలను ఏర్పాటు చేయటానికి రూ. 1.865 లక్షలు మంజూరు చేసింది.

బి.ఆర్.జి.ఎఫ్. నిధులు స్థానికంగానే మండలపరిషత్ వద్ద అందుబాటులో ఉండటం వల్ల జనరంజకమైన నిర్ణయాన్ని తీసుకొని అమలు పరచటం వల్ల నేడు జోగినీ కాలనీలోని ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. ప్రధాన గ్రామంతో సమానంగా తమ కాలనీకి కూడా నీటివసతి కలుగజేసినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు జోగినీ కాలనీ వాసులు. బి.ఆర్.జి.ఎఫ్ నిధులు అందుబాటులోకి రానట్లయితే ఈ సమస్యను ఇప్పటిలో పరిష్కరించలేకపోయేవారమని చెన్నూరు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి అంటున్నారు.

### ఫలితాలు

* జోగినీ కాలనీకి శాశ్వత సురక్షిత త్రాగునీటి సదుపాయం.
* ఇళ్ళకు దగ్గరగా పబ్లిక్ కుళాయిల వల్ల మహిళల విలువైన సమయం ఆదా.
* జోగినీ కుటుంబాలలో తొలగిన అభద్రతా భావం.

## పాఠశాలకు సురక్షిత త్రాగునీరు

### రంగంపేట గ్రామ పంచాయితీ - ఆదిలాబాద్ జిల్లా

సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన సార్వత్రిక విద్యాసాధన దిశగా ప్రభుత్వం లక్ష్యాలను ఏర్పరచుకొని, సర్వశిక్షా అభియాన్ పథకం ద్వారా ఈ లక్ష్యాలను చేరేందుకు కృషి చేస్తున్నప్పటికీ, కొన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సర్వశిక్షా అభియాన్ మార్గనిర్దేశకాలు సైతం అనుమతించవు.

పాఠశాల భవనాల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకం, విద్యాబోధనలో నాణ్యత వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ సర్వశిక్షా అభియాన్ పనిచేస్తున్నది. ఐతే పాఠశాల భవనాలు పూర్తయినప్పటికీ, దానికి అనుబంధంగా ఇతర మౌలిక సదుపాయాలు అంటే త్రాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం, ఆటస్థలాల ఏర్పాటు, వంటశాలల నిర్మాణం వంటి సదుపాయాలు చాలా పాఠశాలల్లో కల్పించాల్సి ఉన్నప్పటికీ, ఈ సౌకర్యాల కల్పనకు ప్రత్యేక నిధులు గ్రామపంచాయితీల వద్ద గానీ, మండల పరిషత్తుల వద్దగానీ అందుబాటులో లేకపోవటం వల్ల విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆదిలాబాద్ జిల్లా రంగంపేట గ్రామపంచాయితీలో పోచంపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో త్రాగునీటి సదుపాయం లేకపోవటం వల్ల విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మధ్యాహ్న భోజన పథకం అమలు కూడా ఇబ్బందిగా ఉండేది. విద్యార్థులే తమ తమ పుస్తకాల బరువుకి అదనంగా ఇళ్ళ నుండి త్రాగునీరు మోసుకొని తెచ్చుకోవాల్సి వచ్చేది.

2007-08 బి.ఆర్.జి.ఎఫ్. నిధులతో రంగంపేట పంచాయితీ రూ. 43,000 వెచ్చించి పాఠశాలకు నీటి సదుపాయం కోసం చిన్నసైజు ట్యాంక్ (సిస్టర్న్) నిర్మించింది. చిన్న మొత్తం వెచ్చించటం వల్ల కల్గిన ఫలాలను నేడు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆనందంగా అనుభవిస్తున్నారు. నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేట్ చేసుకొని సురక్షిత త్రాగునీటిని విద్యార్థులకు అందజేయగల్గుతున్నారు.

### ఫలితాలు

* విద్యార్థులు తమ పుస్తకాల బరువుకి అదనంగా త్రాగునీటిని కూడా మోసుకొని తెచ్చుకోవాల్సిన అవసరం తప్పింది.
* మధ్యాహ్న భోజన సదుపాయానికి తగినంత నీటివసతి సమకూరింది.
* సురక్షితమైన త్రాగునీరు పాఠశాలలో అందుబాటులో ఉండటం వల్ల, విద్యార్థుల ఆరోగ్యస్థాయి మెరుగుపడి హాజరు శాతం పెరిగింది. ■

# సిరిమాను

దూసి శ్రీరామమూర్తి

**ఆ ఊరు పేరు ఏమిటయ్యా అని కొత్తవాళ్ళు ఎవరైనా అడిగితే ఎవరిదగ్గరనుంచైనా వచ్చే సమాధానం 'అగ్రహారం, అరవై నాలుగిళ్ళ అగ్రహారం. ఇంకేమి కావాలయ్యా' అని.**

**సూర్యోదయంకి ముందుగానే ఊరు చివరి చెరువులో స్నానపానాదులు, జపతపాదులు, సూర్యనమస్కారాలు చేసే పురుష పుంగవులు.**

ఆడవాళ్ళయితే తడిబట్టలతో మడిగా, బిందెలతో నీళ్ళు నెత్తిమీద ఒకటి, చంకన మరొకటి ఎక్కడ అపవిత్రమవుతామేమోనని సగం బిందెడు నీళ్ళు దారంతా జల్లుకుంటూ వెళ్ళే వారు కనబడతారు. ఆ సమయంలో పాలికాపులు, పాచిపనులు చేసేవాళ్ళు వారి వారి పనులకై ఊరులోకి రావాలంటే తిట్లు, దీవెనలు తినాల్సిందే.

ప్రతి ఇంటికి ఓ అరుగు. అరుగుమీద కర్ర కుర్చీ - ఇంటి యజమాని కూర్చోడానికి అన్నమాట. కుర్చీకి పక్కగా ఓ ఇత్తడి పొందాని. తమల పాకులు, వక్కలు, సున్నం, మసాలా డబ్బాలు ఉండే పోపులు డబ్బాలాంటి పెట్టే, కాస్త దూరంగా ఓ తుంగ చాప. ఇతరలు వస్తే కూర్చోడానికి సలహా సంపత్తులు పొందడానికి.

మునసబుగారు, కరణంగారు అగ్రహారికులే. పౌరోహిత్యం, వ్యవసాయం, ఉపాధ్యాయ వృత్తులవారే మిగతావారిలో అధికులు.

అదంతా కొన్నాళ్ళ క్రితం వరకు. ప్రస్తుతం అగ్రహారం సర్వ కుల సమ్మేళనం.

పంటలు చేతికి రాక కొందరు, పిల్లల చదువుకని కొందరు, ఎంత భూమి ఉన్నా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లని తలదన్నే ఆదాయం, దర్పం ఉన్నా పల్లెటూరి అబ్బాయిలని ఆడపిల్లల్ని ఇవ్వరని కొందరు పిల్లలు ఉద్యోగాన్వేషణలో పట్టణానికి వలసపోయారు.

చాదస్తాలు, మడితడి, అషుంట ఉండరా అన్న మాటలు ఇప్పుడు అగ్రహారంలో కానరావు.

ఎన్ని అవాంతరాలు వచ్చినా విశ్వనాథంగారి ఇల్లు మట్టుకు ధీమాగా తరతరాల మర్యాదలను నేటికీ అందుకుంటానే ఉంది.

విశ్వనాథంగారు లేరు - నూరేళ్ళ పండు ఏనాడో రాలిపోయింది. తదుపరి తరం సోమయాజి. పెద్ద వయసువారు కాకపోయినా కాలం చెందారు. తదుపరి తరం ప్రస్తుత ఆ యింటి యజమాని చిన్న విశ్వనాథం, తాతగారిపేరు పెట్టుకోవడంవల్లో ఏమో జ్యోతిష్యం, ముహూర్తాంశం, దైవకార్యాచరణ చిన్నప్పుడే పూర్తిగా అవపోసన పట్టాడు.

తన ఇంటి ఆడపడుచు రెండు గ్రామాలకు నమ్మకమైన దైవం. అమ్మవారు అసిరమ్మను విస్మరించక యథావిధిగా సంబరాలు జరిపించడం తన ప్రత్యేకత.

ఆ ఊరి పాఠశాలలోనే మొదలైన చిన విశ్వనాథుని చదువు ఇంజనీరింగులో పట్టభద్రుడ్ని చేసింది. మల్టీనేషనల్ కంపెనీలో మంచి ఉద్యోగం - తన కృషి తనని అమెరికాకి కొన్నాళ్ళు వెళ్ళమంటే తప్పక న్యూజెర్సీలో ఉంటున్నాడు చిన విశ్వనాథం.

ఎన్ఆర్ఐగా ముద్ర పడడం తనకి ఎంత మాత్రం ఇష్టంలేదు. ఊరి పెద్ద పంతులుగారు "ఒరేయ్ చిన్నా, ఊరికి నీ అవసరం ఎంతైనా ఉందిరా.... నీ చదువుకు తగ్గ వేతనం అక్కడ దొరుకుతుందిగా... కొంత ఊరు గురించి వెచ్చించి. జన్మభూమి రుణం తీర్చుకో, నీ ఇల్లు పొలాలు



ప్రథమ బహుమతి పొందిన గ్రామీణ కథ

చూడడానికి మేం ఉన్నాంగా'' అన్న పెద్ద మాటలు ఇంత దూరంలో ఉన్నా సొంత ఊరుని - తాతల కాలం నుంచి నీడనిచ్చిన ఇంటినీ నాన్నగారివరకూ తమ సేద్యంలో ఉన్న పంటపొలాల్ని మర్చిపోలేదు.

ఏడాదికి ఒక సారి అయినా వచ్చి అన్నీ సరిచేసుకునే మనస్తత్వం ఏర్పరుచుకున్నాడు చినవిశ్వనాథం. తన ఆలోచనలకు విలువివ్వడమే కాక, కార్యరూపం దాల్చడంలో తనకు తోచిన సలహా ఇచ్చే భార్య విశాలాక్షి తనకు తోడుగా ఉండడం అసిరమ్మ ఆశీర్వాదంగా భావించాడు.

ఊరులో అన్ని కులాలవారి దగ్గరా తలలో నాలుకై, వచ్చినప్పుడల్లా సలహా సంపత్తులు అందిస్తూ మానవతా వాదం-శుచి, శుభ్రత ఆరోగ్యానికి, ఆనందానికి, ఆధ్యాత్మికతకు మూలమని విశ్వసించేలా చేయడంలో విశ్వనాథుడు తన బుర్రను ఉపయోగించాడు.

అందుకేనేమో ఆ యింటికి తాళం వేసి ఉన్నా వాకిట్లో ముగ్గులు ప్రతి ఉదయం అలరిస్తూ ఉంటాయి. ఆ యింటి ప్రక్కనుంచి వెళ్ళే ముదుసలే అయినా, నాగరిక కుర్రకారే అయినా తల వంచి నమస్కరించనిదే ఆ ఇల్లు దాటరు.

అంతటి ప్రాచుర్యం పొందిన అలనాటి విశ్వనాథంగారి ఇల్లు వారం రోజులుగా ముస్తాబై అమెరికా నుండి వచ్చే చిన్న విశ్వనాథం రాకకై ఎదురుచూస్తూ ఉంది.

కారణం ఊరు పెద్ద పంతులు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అసిరమ్మ అమ్మవారి పండగకు పెట్టిన ముహూర్తం -ఊరు బారికి వీరయ్య గ్రామ పండుగ చాటింపుగా దండోరా వేయడం.

ముందుగా నిశ్చయించుకున్న ప్రకారం రెండు విమానాలు మారి, కొంత దూరం ట్యాక్సీలో ప్రయాణించి, పుట్టిన ఊరు చేరుకోవడం అందునా తన భార్య విశాలాక్షి, ఇప్పుడిప్పుడే జ్ఞాపకశక్తి అల వర్చుకుంటున్న తన వంశోద్ధారకుడు సోమయాజి తాతగారు పెద సోమయాజి ఇంట అడుగుపెట్టడం తనకి ఎంతో సంతోషం. మించి ఆనందించే గ్రామస్తుల మంచి మనసు తను ధనికంగా ఇబ్బందిని అనుకోలేదెప్పుడూ. పండగ చాటింపు వేసిన నాటికి ఇంటికి వచ్చి ఉన్న బంధువులు ఊరి పొలిమేర దాటరు. వారి వారి శక్త్యానుసారం పిలుచుకున్న బంధువులు-సన్నిహితులు పండగ అన్ని రోజులూ ఉండి అమ్మవారిని స్వస్థానానికి పంపే వరకు ఊర్లో ఉండడమే గ్రామాచారం.

అసిరమ్మ అమ్మవారు చిన విశ్వనాథంకి ఇంటి ఆడపడుచు అయినా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పెద్ద రైతు, దమ్ముల కుల స్తుడు పూజారి, దివిటీ వెలిగించే చాకలి, ఘటాలకు ఉపయోగించే కుండలు చేసే కమ్మరి, సిరిమాను రథం తయారుచేసే షరాబు, మేళం కట్టే మంగళి, అమ్మవారు హుందాగా సరదాగా అడుగులు వేయాలంటే డప్పులు వాయిస్తూ తదనుగుణంగా అడుగులు వేసే బారిక కులస్తుల ప్రాధాన్యం ఎంతో అవసరం.

వీటికి తోడు రోజువారి సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు భామా కలాపం, తోలు బొమ్మలాట, బుర్రకథ, హరికథ, విచిత్రవేషధారణలు అమ్మవారిని సంబర పరచడానికి అంతే అవసరం.

అన్ని ఏర్పాట్లూ అనాదిగా వస్తున్న గ్రామ కట్టుబాట్లకూ ఏ మాత్రం అపవిత్రత చేకూరరాదని తాతగారు విశ్వనాథంగారు రాసి ఉంచిన తాటాకు పత్రాలు ఆధారంగా జరిపించేవారు.

తొలుతగా వారి ఇంట ఉంచిన అమ్మవారి పాదుకలను పూజించి ఊరు చివర ఉన్న అమ్మవారు చెట్టువద్ద ఉంచి దమ్ముల పూజారితో పూజ చేయించి అసిరమ్మ అమ్మవారును ఆహ్వానించి తీసుకువచ్చి తగు ఆడపడుచు లాంఛనాలు జరిపి, పెద్ద రైతు ఇంటి దగ్గరకు పండగ సంబరాలకై తీసుకు వెళతారు.

ప్రతి రోజూ సాయం సంధ్యవేళ ఘటాలుగా ఇద్దరు ముగ్గురు పునిస్త్రీల శిరస్సున ఉంచి, అమ్మవారి ఘటాన్ని దమ్ముల పూజారి సిరస్సున ఉంచి గ్రామ వీధుల్లో తీరువీధి చేస్తారు.

ప్రతి ఇంటి ముందూ ఘటాలు రాగానే ఘటాలు మోసేవారిని అమ్మవారుగా భావించి వారి పాదాలు పసుపు కలిపిన నీళ్ళ బిందెలతో ప్రక్షాళన చేస్తుంటే దివిటీల వెలుగులో డప్పు వాయిద్యాలతో అమ్మవారు తన్మయించి గ్రామ ప్రజలను ఆశీర్వదిస్తూ తిరువీధిగా పెద్దరైతు ఇంటికి ఘటాలు చేరతాయి.

ఘటాలు మోసేవారితో గ్రామ చాకలి నెత్తిన పసుపురాసిన బుట్ట ఉంటుంది. అందులో ప్రతి ఇంట వేసిన అన్నం పోగుగా ఘటాలు ముందు పెద్ద రైతు వాకిట్లో పోగుపోసి అలసద్ధిగా పిలుస్తారు. అమ్మ వారికి నైవేద్యం పెట్టి తిరువీధిలో పాల్గొన్న దివిటి, డప్పులు, మేళం వారు భుజిస్తారు.

సాయంకాలం అయితే చాలు ఎవరికి తోచిన వేషాలు వారి వారికి తోచిన ఆహార్యం వేసుకుని వీధుల్లో తిరుగుతారు.

బ్రాహ్మణ కులస్థులు డప్పులు వాయిస్తూ- రైతు కులస్థులు వారికి వచ్చే పద్యాలు, మంత్రాలు చదువుతూ, చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి వేషం, సత్యహరిచంద్ర కాటికాపరి వేషం, ఆ పద్యాలు వినవల్సిందే.

అర్ధరాత్రి దాటగానే మైదానంలో స్టేజ్‌మీద బామా కలాపం, బుర్రకథ, హరికథ తెల్లవార్లు కాలక్షేపం. కూర్చోడానికి చాప, కుర్చీ, దుప్పటి ఎవరివి వారివే.

ఆఖరిరోజున సిరిమానోత్సవం గొప్ప వేడుక, ఆరోగ్యం, ఆనందంతో పాటు గ్రామానికి, గ్రామస్థులకు, తిలకించేవారికి సిరులను చేకూర్చుతుందని నేటికీ నమ్మకం.

సిరిమానుగా ఉపయోగించే వేపచెట్టును పెద్దరైతుకి గానీ -విశ్వనాథని కుటుంబం వారికి గానీ - పూజారికి గానీ, ఏ తోట నుండి తేవాలో , ఏ చెట్టును ఉపయోగించాలో అన్నది అమ్మవారు స్వయంగా కలలో సూచించడం ఈనాటికి విశ్వనీయమే.

అలా సూచించిన వేపమానుని పూజించి, నరికి మేళతాళాలతో తీసుకుని అమ్మవారి దగ్గరకు తీసుకువస్తారు. ఊరి వడ్రంగి దానిని సాపుచేసి బండిమీద నిలబడి ఇటుఅటు తిరగడానికి వీలుగా క్రిందని ఇరుసులా, మీదన కూర్చోడానికి వీలుగా నాగలి తిరగేస్తే ఎలా ఉంటుందో అలా చేసి క్రిందకు మీదకు లేచే విధంగా మీటలు, బల మైన తాడుతో అలచంద్ర బండిమీద నిలబెడతారు.

సిరిమానుమీద కూర్చొనే అర్హత విశ్వనాథుని కుటుంబం వారికి గానీ, పెద్ద రైతుకుగానీ, పూజారికి గానీ ఉంటుంది. సంబరాల్లో ఏమైనా

లోపాలున్న అసిరమ్మకి ఆగ్రహం వచ్చి సిరిమాను రథం సరిగా నడవదని గ్రామస్తుల విశ్వాసం.

అన్నీ అయి అమ్మవారిని తన స్థానానికి సాగనంపి విశ్వనాథుని ఇంటికి పాదుకలు పూజ్యభావంతో తీసుకొచ్చి యధావిధిగా పూజలు చేసి మంగళ హారతులు, సాంబ్రాణి దూపం ఇచ్చి యథాస్థానానికి వచ్చేంతవరకూ... తదుపరి గ్రామ అన్న సంతర్పణ జరిగేవరకూ చిన్న విశ్వనాథం పెద్ద ప్రాజెక్టులా భావించేవాడు.

సంబరాల్లో తన వంశోద్ధారకుడు సోమయాజితో బండి వేషాలు, బాలగోపాలంగా లవకుశ వేషాలు, పంచా కండువాతో వామనుని వేషం వేయించి వీడియోలో బంధించాడు.

అక్కడ ఉన్న మరో వారం రోజులు బంధువులను సాగనంపడం సోమయాజిని తీసుకుని పక్కనున్న ఊర్లన్నీ తిప్పడం గూడుబండి ప్రయాణమే.

గేదె పశువుల కొట్టం, కుడితి గోలెం, పశువులకు కట్టే కన్నె, బండికి కట్టే మోకు, దుక్కుదున్నే నాగలి, మేడి, నక్కు ఇలా పేరుపేరుగా సోమయాజికి అర్థమయ్యేలా చెప్పాడు. ఫొటోలు తీశాడు. ఇలా చేస్తే సిస్టంలోనో, టేబుల్ టాప్‌లోనో చూసి మమకారం పెంచుకుంటాడని తన భావన.

కోతికొమ్మచ్చి ఆట, కర్రా బిల్లా, తాడు బొంగరం ఇలా ఎన్నెన్నో ఆటలలో సోమయాజులను ఇన్‌వాల్వ్ చేసి వాటిని డిజిటల్ కెమెరాలో బంధించాడు.

పంట పొలాలకు తీసుకువెళ్ళి పంట భూమి ఏమిటో, ఆకుమడి ఏమిటో, వరి, మినప, నువ్వులు, శనగ ఎప్పుడు పండుతాయో వివరించాడు. తనకి అర్థమైనా లేకపోయినా అదొక కొత్త వాతావరణం. వింత ప్రకృతిని చూస్తూ నవ్వుతూ అలుపెరుగక డాడీతో తిరిగాడు సోమయాజులు.

మరో రోజు తను హైస్కూలు చదువులప్పుడు వేసవి సెలవులు వస్తే రైతు కొడుకుతో వెళ్ళి తెచ్చే మోదుగ ఆకులు, అడ్డాకుల చెట్ల నుండి అడ్డాకులు కోసి తేవడం, తెచ్చినవి నులక తాడుకు కట్టి వేలాడగట్టి ఆరబెట్టడం, ఆయా ప్రదేశాలను చూపిస్తూ మెట్టలు, గట్లు అలుపెరుగక తిరిగారు తండ్రీ కొడుకులు. పక్క పల్లెటూర్లో కుండలు చేసే కుమ్మరిని, బండి చక్రాలు, నక్కు, నాగలి చేసే షరాబుల ఇళ్లకి తిప్పాడు. సోమయాజికి కనిపించిందల్లా ఒక్కటే తను తాతగారు సోమయాజిలా ఉంటానని.

"ఈ చిన్న బుర్రకి ఇవన్నీ తిప్పి చెప్తే ఏం అర్థమౌతుందిరా? పిల్లాడు నలిగిపోతాడు. ఊరిని మరిచిపోకుండా వస్తూ ఉంటే కాలమే వాళ్ళకి చెబుతుంది" అని పెద్ద పంతులు సుబ్రహ్మణ్యంశాస్త్రి మాటలకి కొంచెం ఆగాడు విశ్వనాథం.

వారు ముగ్గురూ ఉద్యోగ రీత్యా అమెరికా ప్రయాణం దగ్గరవుతుందంటే ఎంతగానే మదనపడ్డారు. తన గ్రామ పంచాయితీకి చిన్న సంపాదన అవడం వల్ల విశ్వనాథం తనొచ్చినప్పుడల్లా ఆరోగ్యం, విద్య, ముసలివారికి అవసరమని తనకి అసిరమ్మ ఆశీర్వాదంతో వస్తున్న నెలవారి జీతంలో కొంత మునసబుకు, పంచాయితీ పెద్దలకు




ముట్టచెప్పడం, తాతగారు తాటాకు పత్రాలలో, కంఠం వణుకులో కానరాని అంతర్భావం. అలా అని వారి ఇంటిపేరు, సేవకులకు దేవాలయ పూజారికి, ఊరి చాకలికి, మంగలికి తనతో తెచ్చిన అపురూప వస్తువులు వారి వారికి ఉపయోగపడేలా బహుమతులుగా ఇచ్చి వారి ఆశీస్సులను పొందడం తన భార్య విశాలాక్షికి సరదా.

తన అత్తగారు ఇంటికి వచ్చిన పాలికాపుకు, పని మనిషికి మోదుగాకుల్లో ఆవకాయ పచ్చడి, బియ్యం జల్లించగా విశ్వనాథుడు ఇందుకు ఏనాడు వెనుకంజ వేయలేదు. ఆ కార్యక్రమమూ ముగిసింది. 'హమ్మయ్య' అనుకుని ఎప్పటికో మళ్లీ ఇంటికి అని ఇల్లంతా కలయజూసి ఎక్కడివక్కడ సర్ది రైతుకు చెప్పవలసినవి, పాలికాపుకి చెప్పవలసినవి చెప్పి తన ట్రాలీ బ్యాగులకు తాళాలు పడేసి, ఎన్నారై డ్రెస్‌లో తను, చుడీదార్ పైజామాలో విశాలాక్షి, తనకిష్టమైన గచ్చపిక్క రంగు సూటు, బూటుతో సోమయాజిల ప్రయాణం మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకి.

గ్రామస్థుల కేరింతల మధ్య ఆనంద బాష్పాలు ఆలు చిప్పల మీద పడ్డ స్వాతి బిందువులుగా పడుతుంటే ట్యాక్సీ రైయ్యమనే వేళ డప్పుల వీరయ్య డప్పుమోతకి కారు విండోగ్లాసు దించారు. సోమయాజి చేత కొంత పైకం ఇప్పించాడు విశ్వనాథం.

దండోరా వీరయ్య 'దండాలయ్యా' అన్న చల్లని పల్లె పదం న్యూజెర్సీకి వెళ్ళినా విశ్వనాథునికి, విశాలాక్షికి చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

"మీ సంపాదన అమ్మవారి చెట్టంత ఎదగాలి బాబయ్య. అసిరమ్మ ఈ సంబరాన్ని మరిచిపోలేదయ్యా. ఘనంగా చేయించినావు. అసిరమ్మ సంబరాల సిరిమాను అంత ఎత్తులో నీ కుటమం ఉండాలి. అసిరమ్మ తల్లి మిమ్మల్ని మరిచిపోదయ్యా. మళ్లీ సంబరాలకు దండోరా వేస్తానో, రాలిపోతానో చెప్పలేను. అంతా అసిరమ్మ దయ బాబయ్యా" అన్న దండోరా వీరయ్య ముసలి మాటలు.

వీరయ్య లాంటివారు ఉండబట్టే ఇంకా గ్రామాలు, సంబరాలు, సిరిమాను ఉత్సవాలు బతికి ఉన్నాయి. వారిని అసిరమ్మ, ఆ అమ్మ చెల్లెలు చల్లగా చూడాలి అని తన దైనందిన ప్రార్థనలో ప్రార్థించడం అలవాటు చేసుకున్నారు చిన్న విశ్వనాథం కుటుంబం. ■

# బడి మానిన బాలికలకు వరం

**భారతదేశ చరిత్రలో తరతరాలుగా చదువుకు దూరం చేయబడిన సామాజిక వర్గాలలో స్త్రీలు ఒకరు. స్త్రీలకు కూడా చదువుకునే హక్కు ఉండాలని ఆధునిక భారతదేశంలో ఉద్యమానికి నాయకత్వం వహించిన వారు సావిత్రీబా పూలే. ఈమె భారతదేశాన్ని బ్రిటీష్ వలసపాలకుల పాలనలో క్రింది కులాల (Lower castes) ఉద్యమాన్ని కొనసాగించిన జ్యోతిబా పూలేకు ఆమె భార్య. ఇద్దరివీ కూడా సంఘుసంస్కరణ, సామాజిక మార్పుకొరకు పనిచేసే ఆలోచనా విధానం అవ్వడం వల్ల సావిత్రీబా పూలేకు 19 వ శతాబ్ధంలోనే మహారాష్ట్రలో స్త్రీల హక్కుల కొరకు ఉద్యమాలకు నాయకత్వం వహించడం చాలా సులభమైంది. ఫలితంగా జ్యోతిబా పూలే అంబేద్కర్‌కు ఆదర్శవంతమైతే, సావిత్రిబా పూలే ఆధునిక భారతదేశంలో స్త్రీల హక్కులకు ఆదర్శమైంది.**



బాలికల విద్యను గురించి మాట్లాడిన ప్రతిసారీ సావిత్రిబా పూలేను స్మరించుకోవలసి వుంటుంది. ఎందుకంటే బాలికల కొరకు ఈ దేశ చరిత్రలో తొలిసారిగా పాఠశాలను మొట్టమొదటి సారిగా మహారాష్ట్రలోని దళిత వాడల్లో ప్రారంభించింది. ఈ చారిత్రాత్మకమైన సంఘటన భవిష్యత్ భారతదేశంలో స్త్రీల విద్యకు, సామాజిక విప్లవానికి దారి తీసింది. సావిత్రిబా పూలే ఆలోచనా విధానంతో స్ఫూర్తితో కొనసాగిన ఉద్యమాలకు స్పందిస్తూ ప్రజాస్వామిక భారతదేశం స్త్రీలు, బాలికల విద్యను మొత్తం అభివృద్ధి విధానంలో కీలకమైన అంశంగా పరిగణిస్తూ అనేక విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. ఈ రకంగా బాలికల విద్య కోసం జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం రూపొందించిన పథకమే 'కస్తూర్భగాంధీ బాలికా విద్యాలయ'.

కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయ పథకం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్‌లో అంతర్భాగం. ఈ పథకాన్ని ప్రధానంగా బాలికల అక్షరాస్యత తక్కువగా వున్న మండలాలలో చేయడం ప్రారంభించి క్రమంగా ఇతర మండలాలకు కూడా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం కస్తూర్భాగాంధీ పాఠశాలలు దేశ వ్యాప్తంగా 2,578 ఉండగా, మన రాష్ట్రంలో 395 వున్నాయి. క్రొత్తగా ప్రారంభించే వాటితోపాటు, ప్రస్తుతం మన రాష్ట్రంలో 743 కస్తూర్భా బాలిక విద్యాలయాలు వున్నాయి.

## కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయ నిర్వహణ - అనుభవాలు

వీటిని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారు. కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాలను గురుకుల పాఠశాలల పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు. అయితే కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం చదువు మధ్యలో ఆపివేస్తున్న బాలికలకు మాత్రమే. చదువు మధ్యలో ఆపివేస్తున్న బాలికల తల్లితండ్రుల సామాజిక, ఆర్థిక అంశాలను పరిశీలించినట్లయితే, వీరు ప్రధానంగా సమాజంలోని అట్టడుగు కులాలు, వర్గాలకు చెందినటువంటి దళిత, ఆదివాసీ, వెనుకబడిన తరగతులు, ముస్లింలు. ఇటువంటి వారిని ఒక చోటకు చేరదీసి 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు చదువు చెప్పించేందుకు ఏర్పాటు చేయబడినవే కస్తూర్భాగాంధీ విద్యాలయాలు.

ఇటువంటి విద్యాలయాలలో ఉచితంగా వసతి, ప్రతిరోజు ఒక్కొక్క విద్యార్థికి రూ. 17చొప్పున భోజన వసతికి, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, నెలకు రూ. 50 చొప్పున కాస్మోటిక్ చార్జెస్, రెండు జతల దుస్తులు, పడుకొనేందుకు అవసరమైన మూడు దుప్పట్లు, అన్నం తినేందుకు ప్లేటు, గ్లాసు, కప్పు, ఆటలు ఆడుకొనేందుకు ఆట వస్తువులు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన సామాగ్రి, బోధన, లైబ్రరీ ఉపకరణాలు, వృత్తులకు సంబంధించిన శిక్షణ, కరాటే వంటి వాటిని ప్రభుత్వం సమకూర్చడంతోపాటు, ఆరోగ్య, విద్య, విద్యాలయ నిర్వహణలో భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రుల కమిటీ, బాలికా సాధికారతా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. బోధనా, బోధనేతర సిబ్బందిని కూడా ఈ పథకంలో భాగంగా ప్రభుత్వమే సమకూరుస్తుంది.

మధ్యలో చదువు ఆపివేసిన బాలికలు, స్త్రీలు అక్షరాస్యత తక్కువగా వున్న మండలాన్ని గుర్తించిన తర్వాత కస్తూర్భా పాఠశాలను సర్వశిక్ష అభియాన్ మంజూరు చేస్తుంది. ప్రాథమికంగా ప్రైవేటు భవనాలలో ఏర్పాటు చేయవలసి వుంటుంది. ప్రభుత్వ భవనమైతే ఆయా శాఖకు సంబంధించిన అధికారులతో, ఉదాహరణకు- మండల ప్రజా పరిషత్‌కు సంబంధించిన భవనాలైతే మండల అభివృద్ధి అధికారి ద్వారా, ఇతర ప్రభుత్వ భవనాలైతే ఆయా శాఖాధిపతి అనుమతితో ప్రారంభించవచ్చు.

చదువు మధ్యలో ఆపివేసిన బాలికలను గుర్తించి విద్యాలయానికి తీసుకురావడంలో అనేక మంది సహాయ, సహకారాలను తీసుకోవాలి. ఉదాహరణకు మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, మండల రిసోర్స్ పర్సన్లు వంటి వారి నుండి జాబితాను సేకరించి కమ్యూనిటీ మొబైలైజింగ్ ఆఫీసర్, గ్రామ కార్యదర్శి, గ్రామ సర్పంచు, మండల అధ్యక్షులు, మండల పరిషత్ సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు, స్వచ్ఛంధ సేవాసంస్థల సహకారంతో విద్యాలయ ప్రత్యేక అధికారి శ్రద్ధ తీసుకొని పిల్లలను ప్రోగు చేయవలసి వుంటుంది. చదువు మధ్యలో ఆపివేసిన పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి

విద్యాలయానికి తీసుకురావడం చాలా కష్టతరమైన పని. వీరు ప్రధానంగా ప్రతిరోజూ రెక్కాడితేగాని డొక్కాడని శ్రమ జీవులు. ఇటువంటివారు వారి శ్రమపైనే ఆధారపడి బ్రతుకుతుండగా, పిల్లలతో కూడా ఇళ్ళల్లో పని మనుషులుగా, వ్యవసాయ బాలకార్మికులుగా, ఇతర పనుల ద్వారా తాత్కాలిక ఆదాయాన్ని సమకూర్చుకోవాలని చూస్తుంటారు. ఇటువంటి తాత్కాలికమైన ఆదాయంతో పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నామనే పరిజ్ఞానం లేక చదువుకు దూరం చేస్తారు. ఇటువంటి పిల్లలను తిరిగి పాఠశాలకు తీసుకురావాలంటే ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో తీసుకు రావలసి వుంటుంది.

మధ్యలో చదువు ఆగిపోయి, చాలా కాలంపాటు కాయ కష్టం చేసిన పిల్లలను తిరిగి చదువుకునేందుకు తయారు చేయడం ఆ విద్యాలయ స్పెషల్ ఆఫీసర్‌కు, ఉపాధ్యాయులకు ఒక పెద్ద సవాల్. అందుకనే వారిని ముందుగా విద్యాలయంలో వుండే విధంగా ఆటపాటలతో అలవాటు చేయాలే గానీ, చదువంటేనే అదొక భారం అనే ఆలోచనను రానివ్వకూడదు. క్రమంగా వారి ఆసక్తి, చదువులోని పరిజ్ఞానాన్ని బట్టి ఆయా తరగతులలో తీసుకొని చదువుకు దగ్గర చేయాలి.

ఆయా తరగతుల వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలను మండల విద్యాధికారి నుండి ఉచితంగా సేకరించి పంపిణీ చేయాలి. నోట్ పుస్తకాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్రేడింగ్ కార్పోరేషన్ నుండి కొనుగోలు చేసి, విద్యార్థులకు అందజేయాలి. ఇదే క్రమంలో బోధనా సిబ్బందిని విద్యాలయ నిర్వహణ సంస్థనుండి, సర్వశిక్షా అభియాన్ నుండి సమకూర్చుకోవాలి. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంను ఆప్కో నుండి కొనుగోలు చేసి స్థానికంగా అందుబాటులో వున్న టైలర్లతో కుట్టించి ఇవ్వాలి.

కస్తూర్బాగాంధీ పాఠశాలలను ముందుగా ప్రభుత్వ లేక ప్రైవేటు భవనాలలో ఏర్పాటు చేసినప్పటికీ, క్రమంగా కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో విద్యాలయ భవనాలను, ఆటస్థలాలు, మరుగుదొడ్లు, స్నానపుగదులు, కాంపౌండువాల్ వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు, ఆధునిక వంట సామాగ్రిలో భాగమైన గ్యాస్ సిలిండర్లు ఒక్కోసారి 20 సిలిండర్లను నిలువచేసుకొగల సామర్థ్యంతో కట్టిస్తున్నారు.

చదువును మధ్యలో ఆపివేసిన బాలికలను కేవలం గదుల్లో మాత్రమే పాఠశాలకు పరిమితం చేయకుండా, ఆటపాటలతో పరిజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శనలకు కూడా తీసుకెళ్ళి బయట ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను, మార్పులను, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని కూడా అందించటం జరుగుతుంది. ఫలితంగా వ్యక్తిగత పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాకుండా తమ నిత్య జీవితానికి అన్వయించుకునే విధంగా బాలికల ఆలోచనా విధానాన్ని రూపుదిద్దుతారు. ఈ విధమైన మార్పు రావడం వల్ల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్యవివాహాలు నిర్మూలించడం వంటివి జరుగుతున్నాయి. ఈ విద్యాలయాలలోని బాలికల వ్యక్తిగత, ఆరోగ్య సంరక్షణకై ఆరోగ్యకార్యకర్త పని చేస్తుంది. ఆరోగ్యానికి సంబంధించి కొంత బడ్జెట్ వుండటమే కాకుండా, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల నుండి కూడా ఉచితంగా మందులు అందిస్తున్నారు.

ఈ విద్యాలయాలలోని బాలికలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం పాలు, ఆ తర్వాత అల్పాహారంగా ఇడ్లీ, చపాతీ, ఉప్మా, పులిహోర, కిచిడి, మధ్యాహ్న భోజనంలో అన్నం, కర్రీ, పప్పు, మజ్జిగ, రాత్రి భోజనంలో వీటితో పాటు రసం ఉంటుంది. వారంలో మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు పండ్లు, ఒక రోజు తీపిపదార్థం, ప్రతినెలలో ఒకసారి ప్రత్యేక భోజనం ఉంటుంది. ప్రతి జాతీయ పండుగకు, మతాచారాల ప్రకారం జరుపుకొనే పండుగలకు ప్రత్యేకమైన అల్పాహార, భోజన ఏర్పాట్లు వుంటాయి.

రోజూ ప్రతి విద్యార్థికి ఇచ్చే రూ. 17 తో పౌష్టికాహార పదార్థాలను కొనడంతోపాటు, వాటిని సక్రమంగా తయారు చేయించడం చాలా ముఖ్యం. అందుకని ఓపిక, అనుభవం వున్న వంటి మనుషులను నియమించుకొని తర్ఫీదు ఇచ్చి వంట చేయించాలి. వంట మనుషులు చేసిన వంటను పర్యవేక్షించి ప్రతి విద్యార్థికి చేరే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కూడిన ఫుడ్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ ద్వారా తరచూ హాస్టల్‌లో తలెత్తే సమస్యలను విద్యార్థులే పరిష్కరించుకునే విధంగా తయారుచేయాలి.

విద్యాలయం పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేసేందుకు గాను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో చదివే పిల్లల తల్లిదండ్రులు కమిటీ అధ్యక్షులుగా, సభ్యులుగా వుంటారు. విద్యాలయం ప్రత్యేక అధికారి సభ్య కార్యదర్శిగా వుంటూ ప్రతినెలా కమిటీ సూచనలు, సలహాలను అమలు చేస్తారు.

ఈ కమిటీ ప్రధానంగా పిల్లలకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు సక్రమంగా చేరే విధంగా చూస్తుంది. ముఖ్యంగా ఆహారం, పరిశుభ్రత, పుస్తకాలు, ఉపాధ్యాయులు బోధించే విధానం, పిల్లల చదువు నాణ్యత వంటి అంశాలపైన కమిటీ పని చేస్తుంది.

విద్యాబోధనకు సంబంధించి క్రొత్తగా ప్రారంభించబడిన, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మొదటి నాలుగు నెలల పాటు 'వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం' అనే పద్ధతిలో కొనసాగుతుంది. ఈ క్రమంలో కొన్ని ప్రాథమికమైన అంశాలను విద్యార్థులు నేర్చుకుంటారు. ఆ తర్వాత వారిని క్రమంగా పాఠ్య పుస్తకాల్లోని అంశాలను బోధిస్తూ అసైన్‌మెంట్లు, యూనిట్ టెస్టులు, పరీక్షలకు అలవాటు చేస్తారు. ఈ రకంగా బోధించడం వల్ల అనేక కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో ఆధారాలు వున్నాయి. ఇడుపులపాయ వంటి ఐ.ఐ.టి లలో సీట్లు కూడా సంపాదించుకొని మంచి చదువులు చదువుతున్న వారు కూడా ఉన్నారు.

ఈ రకంగా పని చేస్తున్నటువంటి కస్తూర్బాగాంధీ పాఠశాలలను సమర్థవంతంగా ఉపయోగించుకొని చదువుకోవడం వల్ల అతి చిన్న వయసులో జరిగే వివాహాలను వాయిదా వేయవచ్చు, లేదా నిలిపివేయవచ్చు, ఒక ఇంటిలో స్త్రీ చదువుకోవడం వల్ల భవిష్యత్తులో ఆ ఇల్లంతా చదువులమయం అవుతుంది. ఈ పాఠశాలలలో పౌష్టికాహారం ఇవ్వడం వల్ల ఆడపిల్లలు యుక్త వయస్సులో ఆరోగ్యంగా వుండి, ఆటలు, పాటలు, చదువులో రాణిస్తారు.

ఫలితంగా దేశంలో ఆరోగ్యవంతులైన పౌరులుగా తీర్చిదిద్దబడతారు. ఈ పాఠశాలలో చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలను సంపాదించుకోవడం వల్ల వారి కాళ్ళపై వాళ్ళు నిలబడతారు.

**- శ్రీమతి. జి. వరలక్ష్మి**
*స్పెషల్ ఆఫీసర్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం*
*కిస్మత్‌పూర్, రాజేంద్ర నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా*



# పంచాయితీల్లో పారిశుధ్య నిర్వహణకు 'గార్బేజి' వాహనాలు

**రాష్ట్ర చరిత్రలో నెల్లూరు జిల్లాకు ఒక ప్రాముఖ్యత ఉంది. ఉద్యమాల జిల్లాగా, రాజకీయంలో చైతన్య జిల్లాగా, విద్యా కేంద్రంగా, సినిమా థియేటర్లలోను హోటల్స్‌లోను ఇలా చెబుతూపోతే నెల్లూరు జిల్లాకు ఘన చరిత్ర ఉంది.**

ఇప్పటికే జిల్లా పరిషత్ అధికారాలన్నింటిని సక్రమంగా నిర్వహిస్తూ, రాష్ట్ర స్థాయిలో జిల్లా పరిషత్ ఛైర్మన్ 'గిరి' కో వన్నె తెచ్చి ఆదర్శ ఛైర్మన్‌గా అభినందనలందుకున్న 'కాకాని' జిల్లాలో రాజకీయాలను ప్రక్కన బెట్టి, గ్రామాల అభివృద్ధి కోసం, ప్రజలకు మౌలిక వసతులు, సౌకార్యాల కల్పన కోసం తన వంతు కృషి చేస్తూ, మరో వినూత్న పథకం ప్రారంభించారు.

జిల్లాలో 46 మండలాల్లోని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు, తద్వారా గ్రామాల్లో పరిశుభ్రతకు, వ్యాధుల నుండి ప్రజలను రక్షించే ప్రక్రియకు అక్టోబర్ 9, 2010న గార్బేజి వాహనాలను మండలాలలో ఏర్పాటు చేసి రాష్ట్ర చరిత్రలోనే పంచాయితీ పాలనలో వినూత్న కార్యక్రమం చేపట్టారు.

జిల్లాలో మొదట విడతగా 29 గార్బేజి వాహనాలను కోటి రూపాయలతో కొనుగోలు చేసి 25 మండలాలకు అందజేయడం జరిగి ంది. 12వ ఆర్థిక సంఘం (సుమారు కోటి) నిధుల ద్వారా ఈ వాహనాలను ఏర్పాటు చేసి గ్రామాలలోని చెత్తా చెదారాలను దూరంగా పారద్రోలేందుకు మొత్తం 29 గార్బేజి వాహనాలు, 25 వాహనాలను ఆయా మండల అధికారులకు అందజేసి, 4 వాహనాలను జిల్లా పరిషత్ ఆఫీస్‌లో స్పేర్‌గా ఉంచారు. ఈ వాహనాలను అవసరమైన మండలాల వారు వినియోగించేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. 13వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2వ విడతలో మరో 17 వాహనాల ను కొనుగోలు చేసి 4 మండలాల్లో చెత్త చెదారాలు నిల్వ ఉండే సమస్య తలెత్తకుండా గ్రామ పంచాయితీలు పారిశుధ్యంలో పరిశుభ్రతను పాటించి, వివిధ వ్యాధులను నివారించేందుకు ఈ వాహనాలు బహుళ ప్రయోజనకారిగా ఉన్నాయి. వీటిని జిల్లాలోని జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. జిల్లా పంచాయితీ అధికారి పర్యవేక్షణలో సక్రమంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాయి.

ఈ వినూత్న ప్రయోగం ద్వారా ప్రస్తుత సీజన్‌లో మలిన పదార్థాలను, చెత్త చెదారాలను గ్రామంలో నుండి తక్షణమే తొలగించటానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని పంచాయితీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు భావిస్తున్నారు.

### డంపింగ్ యార్డుల ఏర్పాటు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. రాంగోపాల్ మాట్లాడుతూ, గార్బేజి వాహనాలకు మన జిల్లాలోనే ఛైర్మన్‌చే శ్రీకారం చుడుతున్నామని, ఈ వాహనాలు మంచి ఫలితాలు ఇవ్వాలంటే ప్రతి పంచాయితీలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని పంచాయితీలకు సూచించారు. తద్వారా గ్రామాలలో పారిశుధ్యం లోపాన్ని నివారించి, పరిశుభ్రతను నెల కోల్పెందుకు చక్కటి అవకాశంగా ఆయన వివరించారు.

### పరిశుభ్రతతో వ్యాధులను పారద్రోలండి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్ పి. ఇ. దామోదర్ ఈ వాహనాలు వల్ల ప్రయోజనాలను వివరిస్తూ, ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు విస్తృతంగా వ్యాపించి ఉన్నాయని, సగం వ్యాధులు అపరి



# ఆరోగ్యంగా ఉండాలంటే చేతులు శుభ్రపర్చుకుంటే చాలు



**ఆహారం లేదా భోజనం చేసే ముందు, ఆహార పదార్థాలు తయారు చేసేముందు, మల విసర్జన అనంతరం చేతులు శుభ్ర పర్చుకోవటం ద్వారా డయేరియా వ్యాప్తిని 40 శాతం మేర అరి కట్టవచ్చు.**

డయేరియా సంబంధ మరణాలను అరికట్టడంలో చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవటం అనేది అత్యంత సమర్థవంతమైన చర్యగా పలు పరిశోధనలు తెలియచేస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్ వాడీ సెంటర్లలో చేతులు శుభ్రపర్చుకొనే అలవాట్లు పాటించటం వల్ల డయేరియా వ్యాప్తిని 30% అరికట్టవచ్చు.

మహిళలు, పిల్లల స్థితిగతులపై ఐక్య రాజ్య సమితి 2008లో విడుదల చేసిన నివేదిక ప్రకారం సబ్బుతో చేతులు శుభ్ర పర్చుకోవటం అనే అలవాటు ద్వారా 5 సంవత్సరాలలోపు పిల్లల్లో వచ్చే న్యూమోనియాను 50% శాతం నివారించవచ్చు. 5 సంవత్సరాలలోపు పిల్లల మరణాలకు కారణమవుతున్న వ్యాధులలో మొట్టమొదటిది న్యూమోనియా. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏటా 1.8 మిలియన్ పిల్లలు న్యూమోనియాతో మరణిస్తున్నారు.

శ్వాసకోస సంబంధ వ్యాధులను అరికట్టడంలో సబ్బుతో చేతిని కడుకోవటం అన్న అంశం ప్రధానమయింది. 2006లో సంభవించిన సార్స్ వ్యాధిపై జరిగిన పరిశోధనలలో, రోజుకి 10 సార్ల కన్నా ఎక్కువగా చేతులు శుభ్రపర్చుకొనటం ద్వారా వ్యాధి వ్యాప్తిని 55% తగ్గించవచ్చని నిరూపితమైంది. ప్రసవ సమయంలో సహాయం చేసే మంత్రసానులు లేదా ఎ.ఎన్.ఎమ్‌లు మెడికల్ సిబ్బంది, తల్లులు తమ చేతులను సబ్బుతో పరిశుభ్రపర్చుకోవటం వల్ల నవజాత శిశువుల మరణాలను 44% తగ్గించవచ్చు.

ఇటీవల జరిగిన పరిశోధనల ఫలితంగా తేలినదేమంటే, చేతులను పరిశుభ్ర పర్చుకోవటం వల్ల కలిగే లాభాలను పాఠశాలల్లో వివరించటం వల్ల, పాఠశాలల్లో ఈ విధానం పాటించటం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో తరగతులకు హాజరు శాతం నిలకడగా ఉంటోంది. చైనాలోని పాఠశాలల్లో ఉచితంగా సబ్బుని సరఫరా చేయటం వల్ల హాజరు శాతం పెరిగినట్లు ఋజువు అయ్యింది. ■

శుభ్రత ద్వారానే ప్రబలుతాయని, గార్బేజి వాహనాలను సకాలంలో పంచాయతీలు ఉపయోగించుకుని వ్యాధులను పారద్రోలాలని చెప్పారు. ఈ కార్యక్రమం చేపట్టిన ఛైర్మన్‌ను ఆయనను అభినందించారు.

పంచాయితీ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ప్రజాప్రతినిధులుండాలని ఆకాంక్షించే ఛైర్మన్ 'కాకాణి' స్థానిక సంస్థలకు అధికారాలన్నీ బదిలీ కావాలని పలు సందర్భాలలోను ఉన్నతస్థాయి అధికార్ల ముందు డిమాండ్ చేశారు.

ఇటీవల అపార్డ్‌లో జరిగిన 183 జిల్లా పరిషత్ ప్రతినిధుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్థానిక సంస్థలకు అధికారాలు బదిలీ చేయటం ద్వారా నిజమైన గ్రామాల అభివృద్ధి ప్రక్రియ జరుగుతుందని చెప్పటం జరిగింది.




అంతేకాకుండా జిల్లాస్థాయిలో అధిక నిధులు సమకూర్చి అభివృద్ధి [illegible] చేపట్టడం, విద్య, వైద్య శాఖలను అప్రమత్తం చేయటం, క్రీడాకారుల [illegible]త్సహించేందుకు ఛైర్మన్ కప్ క్రీడలు నిర్వహించటం, జిల్లాలోని [illegible] జిల్లా పరిషత్ స్కూల్, విద్యార్థుల కోసం (10వ తరగతి గైడ్) విజయ [illegible] అనే పుస్తకాలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా [illegible] చేయటం, ప్రతి ఏటా ప్రతిభా అవార్డులు అందజేయటం [illegible] ఉత్తమ పాలనను అందిస్తూ అన్ని శాఖలను అన్ని వర్గాల ప్రజల [illegible] ఆకట్టుకుంటున్న ఛైర్మన్ లాంటి నేతలు, పాలకులుగా పదికాలాల [illegible] ఉండాలని కోరుకుందాం. ■

# బలే మంచి చౌకబేరం

కె.ఎస్.వి. పద్మావతి

**"ఏమండి ఒకటే ఒళ్ళు నొప్పులు. లేవలేకపోతున్నాను. లేచి పాలుపెట్టి కాఫీ కాసివ్వండి".**

**"అప్పడే మొదలు పెట్టావు సుప్రభాతం" అంటూ రాఘవరావు మాష్టారు లేచి కాఫీపెట్టి భార్యకు ఇచ్చాడు. జానకమ్మ చాలా నీరసంగా లేచి కాఫీ త్రాగింది.**

**"ఏమిటి? డీలా పడిపోయావు జానకి. మందులు వేసుకున్నావా?" అని అడిగారు రాఘవరావు.**

**"వేసుకున్నాను కాని ఈ కీళ్ళనొప్పులు, కళ్ళు మంటలు తగ్గటంలేదు. ఏమి అనుకోకుండా స్కూల్ నుంచి వచ్చేటప్పుడు మందులు తీసుకొని రండి" అని చెప్పి ముక్కుతూ, మూలుగుతూ నిదురలోకి జారిపోయింది.**

రాఘవరావు ఆలోచిస్తున్నాడు. 'ఎక్కడ చూసినా ఒళ్ళునొప్పులు, జ్వరాలు. డాక్టర్స్ దగ్గరికి వెళ్ళితే రకరాకాలు పేర్లు చెప్పి డబ్బులు వదిలిస్తున్నారుకాని, జబ్బులు వదలించటం లేదు. రకరకాల టెస్ట్‌లు చేసి మనీ వేస్ట్ చేయిస్తున్నారు' అని ఆలోచిస్తూ స్కూల్‌కి సైకిల్‌పై బయలుదేరి వెళ్తున్నారు. తన కిష్టమైన డైమండ్ టీ స్టాల్ వద్ద సైకిల్ పెట్టి టీ తదేకంగా త్రాగుతున్నారు.

''బలే మంచి చౌకబేరం, రండి బాబూ... రండి జ్వరాలు, ఒళ్ళునొప్పులు అని, చికెన్ గున్యా, డేంగ్యూ అని మదనపడిపోతున్నారా? ఇలాంటి మందు చవగ్గా, కారుచవగ్గా దొరకదు. ఇలాంటి మందు ఎక్కడా విని ఉండరు. ఇలాంటి మందు ఎక్కడా కొని ఉండరు'' అంటూ బీసెంట్‌రోడ్ సెంటర్‌లో ఓ ఖాళీ ప్రదేశంలో నిల్చున్న, మైక్‌లో అరుస్తున్న అతని చుట్టూ క్షణంలో జనం గుమిగుడారు. టీ త్రాగుతున్న మాష్టారు రాఘవరావు కూడా ఆ మాటలు విన్నారు.



ప్రథమ బహుమతి పొందిన హాస్య కథ

''ఈ చేతి మందు దోమలకు వైకుంఠమాత్ర. ఈ మందు వాడితే భారత్ వారి చేతిలో పిట్టర్లాలి పోయిన పాకిస్తానీల్లా దోమలు రాలిపోతాయి. దోమలరాజ్యాన్ని సములంగా నాశనం చేద్దాం రండి. ఆరోగ్య రాజ్యాన్ని సృష్టిద్దాం రండి''.

అతని మాటలు లక్షణంగా ఉన్నాయి. రూపం విలక్షణంగా వుంది. వింత దుస్తులతో అందరిని ఆకర్షిస్తున్నాడు. ఒక చేత్తో మైకు, మరొక చేత్తో మందు పొట్లాలు పట్టుకొని ఉన్నాడు. అతను ఆ పొట్లాల కంపెనీకి ప్రొప్రయిటర్ కమ్ సేల్స్ రిప్రజెంటెటివ్ అని అనుకోవచ్చు.

'మనదేశంలో, మన రాష్ట్రంలో ఎక్కడ చూచినా జనం రాలిపోతున్నారు. అది బాంబుల వలన కాదు వాటి బాబులాంటి దోమలవలన. అవి కుడితే వచ్చే జ్వరాల వలన' అని లెక్చరిస్తున్నాడు. రాఘవరావు మాష్టారు పరిశీలనగా చూస్తున్నారు. వింటున్నారు.

ఒక రాజకీయ నాయకునిలా, ఒక ఉపాన్యాసకునిలా అలవొకగా దోమల గురించి, వాటివలన వచ్చే వ్యాధులు గురించి చెప్తున్నాడు.

''ఓ జనులారా! వినండి ఇప్పుడొస్తున్నవి మామూలు జ్వరాలు కావు. అవి విషపూరిత జ్వరాలు. డేంగీ, చికెన్‌గున్యా మొదలగు భయంకర వ్యాధులు. వైరల్ ఫీవర్ అంటూ డాక్టర్లు భయ పెడుతున్నారు. దోమలు మన రక్తాన్ని పీల్చే భూస్వాములు. ఈడిస్ దోమల వీర విహారాలు'' అని పేరడి పాట కూడా పాడసాగాడు. అక్కడ జనం అలా నవ్వుతూ వింటున్నారు.

దోమల రాజ్యం విచ్ఛినం చేయాలి. కలరా, మలేరియాలు పోయాయి. ఎయిడ్స్ మరుగున పడింది. చికెన్ గున్యా తెరమీదకి వచ్చింది. చికెన్ జాయింట్లతో చేసే డిష్ అనుకోకండి. మన జాయింట్లను పట్టేసే జబ్బు ఇది. దీన్ని ఎలాగోలా కుంటుకుంటూ మర్చిపోదామంటే 'డేంగ్యూ' వచ్చింది. మన రాష్ట్రంలో 'స్వైన్‌ఫ్లూ' దాపురించింది. అక్కడితో ఆగకుండా 'డేంగ్యూ జ్వరాలు'. ఇవి ఈడిస్ దోమల వలన వస్తాయి. ఈ దోమ కుట్టగానే నలుగురికి సరిపడే జ్వరం ఒక్కరికి వస్తుంది. తెల్ల కణాలు తగ్గిపోతాయి. రక్తం చిక్కబడిపోతుంది. ఇలా ఎన్నో అంటువ్యాధులు. ప్రభుత్వం, ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. వీటి నివారణ గురించి ప్రజలకు తెలియ చేస్తున్నారా? ఈ వ్యాధికి మందు కని పెట్టలేదు.

నివారణ చర్యలు చేపట్టలేదు. భయపడకండి, భయపడకండి, మీ కోసం నేనున్నాను.

డేంగ్యూ, చికెన్‌గున్యా సోకితే మనిషికి శ్వాస ఆడుతుంది. కాని రక్తపోటు వేగంగా పడిపోతుంటుంది. ఇవన్నీ చెప్పి మిమ్మల్ని భయపెట్టడం నా ఉద్దేశ్యం కాదు.

మిమ్మల్ని భయభ్రాంతుల్ని చేయడానికి స్టార్‌టీవీలు ఉన్నాయి. గోరంతలు కొండంతలు వ్రాసే పత్రికలు ఉన్నాయి. ఈ రోజున దొంగలు ఉన్నా భయంలేదు. బందిపోట్ల కన్నా దోమ కాట్లకు హడలిచస్తున్నారు. ఇళ్ళల్లోకి దోమలు దూరకుండా జాగ్రత్తపడుతున్నారు.

ఈ అనారోగ్యాలకు మూలమైన దోమలను మనం హతమార్చాలి. పందులను చంపుతున్న మన ప్రభుత్వం, దోమల సంహారానికి సమాయత్తం అవ్వాలి. అలాగే ముందు మనం చాలా చెయ్యాలి''.

''ఏం చెయ్యాల్లో చెప్పవయ్యా!'' అని జనంలో ఒకరు అడిగారు.

''ముందు మనం శుభ్రంగా ఉండాలి. మనం శుభ్రంగా ఉండటమే కాకుండా, మన పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. మన ప్రభుత్వమే కాదు, మనం చాలా చేయాలి. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయరాదు. మురుగు కాల్వలు పూడుకుపోయి పిల్ల నదుల్లా-పారకూడదు. వాన నీరు మడుగుల్లా ఉండరాదు. ఇవన్నీ రోజూ వినే సుత్తేకదా! అనుకుంటున్నారా? సుత్తి అనుకుంటే మనం ఏమి సాధించలేం.

''అసాధ్యం అన్నది మనిషి చరిత్రలో ఉండకూడదు. చెత్తశుద్ధి కావాలంటే చిత్తశుద్ధి ఉండాలి. పాలకుల్లోనే కాదు, పాలితుల్లోనూ చిత్తశుద్ధి ఉండాలి. అది లేకనే చెత్త ఎక్కడ పడితే అక్కడ పేరుకు పోతుంది''.

అలా చెప్తూ మంచినీళ్ళు త్రాగి, ''మరలా పరిశుభ్రంగా ఉండే మేడల్లోకి ప్రవేశిస్తుంది. దీనికి రాజు-పేద అని భేదంలేదు. దానికి మంత్రి-కంత్రి అనే బేధం లేదు. దోమలు రాజ్యాన్ని యద్దేచ్ఛగా పాలిస్తున్న మన పాలకులకు దోమకుట్టిన దోమల నివారణ చర్య చేపట్టాలని లేదు. వానకాలం వచ్చే వ్యాధులకు ముందస్తు నివారణా చర్యలు లేవు.

ఈ విధంగా మనం ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు. కాబట్టి మన దోమల్ని మనమే సంహరిద్దాం ఈ వనమూలికల ఔషధం వాడండి'' అన్నాడు.

''అందుకు మీ మందే వాడాలా?''

నా మందే వాడమని నేను చెప్పను. వాడే ముందు ఔషధం గొప్పతనం, వాడే విధానం తెల్సుకోవాలి.''

''అయితే చెప్పండి''.

నేను తయారు చేసిన మందు ఔషధం గుణాలమూలికలతో తయారు చేయబడింది. ఈ మందు వాడితే జాగింగ్లూ, వాకింగ్‌లు తయారు చేయనవసరంలేదు. అనవసర ఖర్చుండదు.''

''అదెలాగో చెప్పండి'' అన్నారు మాష్టారు.

''దోమలు ప్రాతఃకాలంలోను, సంధ్యాసమయాలలోను ఎక్కువగా ఇళ్ళల్లో దూరతాయి. ఆ సమయంలో ఈ మందును ఉపయోగిస్తే వ్యాయామానికి వ్యాయామం, దోమలపీడ విరుగుడు అవుతుంది. ఈ మందు ఎక్కువ ఖర్చుండదు. కరెంట్‌తో పనిలేదు. నిప్పులు, నీళ్ళతో పనుండదు. ఒంటికి రాసుకునే పనిలేదు'' అన్నాడు.

''మరెలా వాడాలి?'' అని ఒక నడి వయస్సు మగువ అడిగింది.

''ఎలా వాడాలో అంతా వివరంగా కాగితం మీద వ్రాశాను. అది ప్రతి మందు పాకెట్‌లో ఉంటుంది. ఒక్క జాగ్రత్త తీసుకోవాలి. సూర్యరశ్మి తగలకూడదు'' అని సంచిలో పాకెట్స్ తీశాడు.

''కేవలం అయిదు రూపాయలు మాత్రమే'' అని అన్నాడు. అంతే క్షణాల్లో అవి హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. మాష్టారు కూడా ఒక పాకెట్ తీసుకున్నారు.

ఊరుకోక రాఘవ మాష్టారు అందరు వెళ్ళాక ''బాబూ, నీవు చెప్పిన ఈ మందు బాగా పని చేస్తుందంటావా?''

''అయ్యా! ఒకసారి తీసి చూడండి'' అన్నాడు.

పాకెట్‌లో పొడి ఉంది.

''ఏమిటి నాయనా ఈ పొడి?'' అని అడిగారు.

''ఏముందండి ఇటుకరాయి. వేపపౌడర్ పొడి మిశ్రమం''.

''మీరు ప్రజల్ని మోసం చేయటం లేదూ?''

''నేనేం మోసం చేయటం లేదు. ఉన్నవి లేనివి చెప్పి ప్రకటనల ద్వారా మా ప్రాడక్ట్ వాడండి అని డబ్బును దోచుకోవటంలేదు. కాగితం మీద వ్రాసింది చదవండి సార్.''

''ముందు దోమను పట్టుకోండి, దాని చంకలో కితకితలు పెట్టండి. అప్పుడది నవ్వుతుంది. వెంటనే దాని నోట్లో మందుపోసేయాలి. చావకపోతే వట్టు''.

''ఓరి భడవా ఇది మోసం కాదంటావా? మాటలు చెప్పి నువ్వు అందరిలాగే మోసం చేస్తున్నావు. ఇది తప్పుకాదంటావా?''

''మాష్టారు! మీరు ఎన్ని చెప్పినా నేను చేసేది మోసం కాదని నా మనస్సాక్షి చెప్తుంది. ఇందులో రాయిపొడి, వేపాకుపొడి కలిసి ఉంది. దోమల్ని పట్టుకోవాలంటే ఎగరాలి. వంగాలి, పరుగుతీయాలి. తర్వాత ఆ పొడి వాడటం వలన ఎటువంటి అపకారం ఉండదు. మరల 'మంచి చౌకబేరం'. వేలకు వేలు టి.వీ.లలో అబద్ధం ప్రచారం చేసే కూల్ డ్రింక్లూ, వివిధ రకాల సంస్థలవలే మేం ప్రజలను ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా దోచుకోవటం లేదు. నేను చేసే ఈ చిన్న వ్యాపారంలో ఈ పాకెట్ వెల 5 రూపాయలే. వారికేం నష్టం ఉండదు''.

''నువ్వు బలే సమర్థించుకుంటున్నావు. నీ చమత్కారం, తెలివైన మాటలు విని పాఠాలు చెప్పే ఈ మాస్టారికే పాఠాలు చెప్తున్నావు. నీలో మంచి సామర్ధ్యం ఉంది. చేసేపనిలో వారితో శ్రమచేర్చి, తెలివితో ఇంకా బాగా మంచి మందు అందచేసి, ప్రజలకు మేలు చేయి''.

''అలాగే సార్. మీరు మరో నాలుగు పాకెట్స్ తీసుకోండి. మీరు చెప్పిన దారిలో ముందుకు నడుస్తాను''.

పాకెట్స్ పట్టుకొని నోరు వెళ్ళబెట్టిన మాష్టారు - రాఘవ రావుగారు అవాక్కయ్యారు. వెంటనే నోట్లోకి దోమ దూరింది. ■

# Training on PESA Act





With an aim to identify training needs of officials and public representatives on 'PESA' guidelines of Panchayatraj Act which was extended to Scheduled Areas, APARD and NIRD held a one-day workshop at Integrated Tribal Development Authority (ITDA), Rampachodavaram. As representatives of 120 gram panchayats in 7 mandals of agency area, 28 Serpanches, 3 Mandal parishad presidents, 12 MPTC members and 11 officials participated in the workshop.

Sri Steven Neil, Faculty member, APARD who coordinated the programme outlined briefly the circumstances that led to formulation of PESAAct, 1996 and the slew of measures taken by Andhra Pradesh government for implanting the act. Sri Ronald Rad, IAS, Project Director, ITDA inaugurated the workshop.

Speaking on the occasion, he said PESA act would provide more empowerment to Panchayatraj institutions in tribal areas and with the special powers given to gram sabhas, it becomes an effective tool for panchayats to strive for tribal welfare. He said Public representatives could excel if they have clear understanding of guidelines of Panchayatraj Act.

Sri K.V.V. Satyanarayana Reddy, local MLA who took part in the workshop said the public representatives who attended the programme should suggest APARD and NIRD about what type of training they needed most. Local Parliament Member, Smt T Ratna Bai who attended the workshop as one of the chief guests said the central government, while recognising culture and heritage in tribal areas, has enacted PESA Act. Stating that it is a boon to scheduled areas, she said that is a good development that the state government has recently issued guidelines on PESA Act in line with Andhra Pradesh Panchayatraj Act. Sri Trinadha Rao, legal expert explained the salient feature in G.O No. 66 which was issued by the government in accordance with Andhra Panchayatraj Act.

Prof. Annamalai and Steven Neil who conducted the programme divided the participants into three groups and discussed on

1. What type of capabilities is needed for implementation of PESA Act.
2. What type of responsibilities has to be carried out by public representatives and officials in connection with PESA Act.
3. The duration of training programme and other issues.

Subjects related to imparting knowledge, skills and attitudes are identified through discussions. On the whole, the one-day workshop at Rampachodavaram has enabled the participants to have an idea of training module that has to be prepared on PESA Act guidelines. Sri N. madhusudan, Principal, Extension training Centre, Samalkote, faculty member Sri Ravi Sankar and Sri P.V.V Satyanarayan, District training Manager attended the programme. ■

# Cheeded Farmers to adopt Zero Budget Natural Farming

In a move to encourage the farmers to practice sustainable agriculture practices, APARD had organized an awareness camp on Zero Budget Based Natural Farming in Cheeded Village on 15th April 2011. Sri Ravishankar, a noted practitioner of Zero Based Natural Farming had conducted the awareness camp for the farmers of Cheeded Village.



Sri Ravi Shankar along with his team members has visited the CheededVillage and interacted with the local farmers. Sri Ravishankar has explained about the Zero Budget Based Natural Farming and shared his experiences with the local farmers.

According to Sri Ravi Shankar, Zero Budget Based Natural Farming is a unique method of farming which requires absolutely no monetary investment for purchase of key inputs like seeds, fertilisers and plant protection chemicals from the market. The farmer can grow local varieties of crops without application of fertilisers and pesticide, he added. It is cost effective, reduces dependence on hired labor and does not need initial seed money, he stated.



Further he stated "all that is required is a native breed of cattle which, in any case forms an integral part of farming families in rural areas". One cow is sufficient to take up this method of farming on 30 Acres of land, he said.

Sri Ravi Shankar has explained the preparation of various natural extracts like Beejamrutham, Jeevamrutham, Ghana Jeevamrutham which help as natural pest controls and maximizes the yield. He also explained the method of mulching, mixed cropping to get maximum productivity from the land available. With the inspiration given by Sri Ravi Shankar, the Bharat Nirman Volunteers have resolved to bring 50 acres of barren land available in the village under this Zero Budget Based Natural Farming. The BNVs are gearing up to attend for a more intensive training on this method of cultivation and APARD is facilitating this too. ■

# "Bring decentralisation of self governance"

*Dr. Manmohan Singh, Prime Minister*



The National Panchayati Raj Divas was observed with a call from the Prime Minister Dr. Manmohan Singh to act collectively in bringing decentralisation of self governance at the grass root level. He said though the concept of Self Government has now constitutional and legal recognition but still we have to go a long way . Dr. Manmohan Singh was addressing the Sarpanch and Village Pradhans came from across the country at a function organised to mark the enactment of the Constitution (73rd Amendment) Act, 1992 from 24thApril, 1993 which institutionalized Panchayati Raj through theVillage, Intermediate and Distri ct levels Panchayats.

Dr. Manmohan Singh expressed gratitude to the whole hearted efforts of Prime Minister Rajiv Gandhi in setup through about 600 District Panchayats, 6000 intermediate Panchayats and 2, empowering Panchayats and said the impact of the 73rd Amendment on the administration of the country is very much visible and was his endeavour that today nearly 28 lakh people have a formal place in our democratic 30,000 Gram Panchayats.

The Prime Minister said Panchayats have a definitive role in preparing village level schemes on the basis of local needs and requirement. Panchayats also play an important role in the implementationof Mahatma Gandhi National Rural Employment Guarantee Programe and the Indira Aawas Yozana. He said decentralized and perspective Planning is a pre requisite in the Backward Regions Grant Fund Scheme. This emanates from village level so as to cater the local needs. He said the government is considering on the means of capacity building of Panchayats so that they could deliver in a more effective and efficient way.

Speaking on the occasion the NAC Chairperson Smt. Sonia Gandhi stressed upon the need to strengthen the Panchayati Raj institutions and called for Gram Sabha meetings regularly with a fair representation of women participants. She also called for utmost transparency and accountability in the working of Panchayats.

On this occasion the Panchayat Empowerment & Accountability Incentive Scheme (PEAIS)Awards for 2010-11 2011 were also given to the Government of Kerala, Karnataka, Sikkim, West Bengal, Rajasthan, Maharashtra and Haryana by the Prrime Minister and the NAC Chairperson jointly.

Earlier welcoming the Prime Minister and the NAC Chairperson the Union Panchayati Raj and Rural Development Minister Shri Vilasrao Deshmukh said strengthening of Gram Sabha is a priority for his ministry as otherwise , the people of this country will be deprived of their legitimate rights.

Paying tribute to the efforts of Rajiv Gandhi in empowering the Panchayats the minister called for pooling in joint efforts.

Shri Deshmukh said for recognizing and encouraging the Panchayats for outstanding performance through effective Gram Sabhas, his Ministry has instituted "Rashtriya Gaurav Gram Sabha Puraskar". He congratulated the Gram Sabhas and Gram Panchayats who have received this award. He said the Award money will be utilized by the Panchayats at its discretion.

Shri A.N.P.Sinha, Secretary, Ministry of Panchayati Raj while giving his vote of thanks said the most important aspect of self-governance is devolution of Functions, Funds and Functionaries to the Panchayats. It is necessary for the states to expedite devolution of 3 Fs. The Union Government also has a critical role in the devolution of 3Fs because it makes increasingly large fiscal transfers to the States in the functional domain of the PRIs, mainly through CSSs and ACAs. He urged the Prime Minister to give a major role in the 12th Plan to the Panchayats in planning and implementation of all Central & State Schemes.

A Roadmap for the Panchayati Raj (2011-16) : An All India Perspective with focus on Gram Sabha" has been released by Hon. Prime Minster and this document charts future path of decentralization agenda for the Panchayat bodies in India for 2011-2016 that would set out strategies and action plan to accomplish the desired goal. It is expected that this roadmap will lead strengthening of Panchayati Raj Institutions; real devolution of power; proper functioning of Panchayats; and establishment of efficient and accountable Panchayats. Sri K. Jana Reddy, Hon. Minister for Panchayat Raj and Rural Water Supply along with State PR Officials and 60 Elected Representatives from Andhra Pradesh have participated in this conference and shared their views on road map.

# Secretary, Rural Development, Government of India, B.K. Sinha Visits Cheeded

"The social awareness that dawned on the villagers of Cheeded that people's participation is a must for comprehensive development of rural areas stands as a role-model to the entire country", said sri B.K. sinha, Secretary, Union ministry of Rural Development.

Sri B.K. Sinha, Secretary, Union ministry of Rural Development, Sri Niten Chandra, Joint Secretary, Sri Reddy Subramanyam, Principle Secretary, Ministry of Rural Development, Government of Andhra Pradesh, Sri K Chandra Mouli, IAS, Commissioner, APARD and several other higher officials visited Cheeded village on 14.4.2011.

Speaking on the occasion Sri B.K. Sinha said "Lab to Land programme" is being implemented in this village superbly. He said the motivation given by APARD through this programme had led to blossoming of social consciousness among the villagers and this consciousness is very important for village development. He enquired about how prohibition is being enforced in the village. Stating that prohibition is a very good decision that can be emulated by other villages as it leads to development of a person, the Union secretary commended the villagers for taking such a noble decision. He congratulated Sarpanch Smt Anasuya and members of several village committees. He introduced Joint Secretary Sri Nitesh Chandra who formulated "lab to land programme" to members.

Sri B.K. Sinha said he was really amazed with the results of "Lab to Land programme" in Cheeded village and he never expected these results while formulating this programme. He said this is the reason why he is doing night halt in the village as he wants to explore further about the changes that were ushered in by this programme and learn a few lessons from the results. On the occasion Sri Sinha discussed with the members of prohibition committee, drinking water and sanitation committee, health care committee, agricultural committee, livestock committee, forest conservation, employees committee and other committees and enquired about their activities. He discussed with the delegates of all political parties. He expressed satisfaction with the way the village is being developed above politics. Sri Sinha said it is a good trend that all political parties are supporting development agenda.




Sri Sinha asked the farmers about the sustainable cultivation methods being practised by them in the village. NPM activist informed him that NPM activities are underway in 25 villages in the mandal. Sinha enquired about these activities in detail. The farmers informed him that 45 farmers are irrigating their lands through this NPM method and it is found highly profitable. The farmers told him that they are following certain uncompromising principles in this method and there is no need to use any type of pesticides in this method.

Later, Sri Sinha visited Nutrition Centre being run by










Society for Elimination of Rural Poverty (SERP) and evinced keen interest to know its activities. He met women self-help groups in the village and asked about the activities taken up by them to achieve financial independence. He also enquired about the activities of Gramaikya Sangham. He observed how village committees as small groups have been managing financial transactions. On the occasion gramaikya sangham informed him that out of total 22 self-help groups in the village, 19 groups are performing well and the performance of remaining three groups derailed and efforts are on to bring them on the track.



Sri Sinha also showed interest to know about the implementation of Mahatma Gandhi National Rural Employment Guarantee Programme in the village and discussed with the 'Shrma sakthi' groups about how NREGP works are being taken up. On the occasion, Sri Reddy Subramanyam, Priniciple Secretary, Rural Development, Government of Andhra Pradesh said the works to be taken up under this programme in coming three to four years are already identified and allotted to Shram Sakthi groups. He said the attendance of labourers is being recorded in E-M.M.S system and E-check measurement system, e-fund transfer systems are being practised to ensure that payments are made in stipulated time.

Sri K Chandra Mouli, Commissioner, APARD on the occasion explained the efforts made by APARD for implementation of "Lab to Land" programme. He said Cheeded village came into light today due to hard work, perseverance and strong commitment of local villagers. The successful results in this village are an outcome of APARD's 'Lab to Land' committee's visit to Cheeded every Friday to guide the villagers about the programme. Sri H Kurma rao made a power point presentation on the change and awareness that came in the lives of Cheeded villagers due to Lab to Land programme.

Later Sri BK Sinha, Sri Niten Chandra, Sri K Chandra Mouli spent the night in the village. If the visit of these higher officials to the village was beyond the imagination of local people here, they were more surprised and their joy knew no bounds with their night halt here. The officials woke up at 5AM in the early morning and visited the field of one farmer, called Gandaiah at Nomula village in Manchala mandal and enquired about the sustainable cultivation methods being practised by him.

District DRDA, DWAMA Project Directos, Tahasildar, MPDO and officials of agriculture, animal husbandry, medical, irrigation and other departments took part in the programme. APARD faculty members - Prof. Suryanarayana Reddy, Dr. Srinivas, Santhi Kumar, Sri Lakshmi, Sripathi Rao, Subhash Chandra Goud and others coordinated the programme.



# Training to Bharat Nirman Volunteers at APARD

A three-day training programme was organised for 216 Bharat Nirman volunteers from 18 panchayats in Manchal mandal from 7th to 9th at APARD. These mandals were chosen on pilot basis under "Lab to Land – Key Cap" experiment. During this three-day training programme, awareness was created among volunteers on various aspects of rural development schemes under the aegis of Sri Kurma Rao, Head, and CNRM Centre.

Participating in the programme, Sri K Chandramouli, Commissioner, APARD, recalled how the youngsters during freedom movement sacrificed their lives for achieving independence to the country and called upon the youth to play a key role in national developement. He enthused the youth to take up another movement to eradicate existing evils from rural areas and sensitise people about them.

Participating in the programme, Vandemathram Foundation member Sri Ravindra emphasised the need for bringing awakening among rural people by Bharat Nirman volunteers. He said people are being exploited due to their lack of awareness and the youth should come forward to save people from this exploitation. He said nothing is impossible for youth ifthey sincerely put in efforts and commended the volunteers for coming forward to serve rural areas with devotion towards nation sans vested interests. He said every youngster has to learn a lot from lives and self-less sacrifices of Sardar Bhagat singh, Netaji Subhash Chandrabose and Sukha Dev. "Those who sacrifice their lives will remain as great people and others as ordinary people in the annals of history . The jawans who stay far away from their families have been doing yeomen services to the nation by fighting against enemies along the country's frontiers. They lay down their lives with their valiant and heroic deeds in chasing away enemies. Our service to rural areas is very little when compared with the sacrifices of soldiers. However, we get recognition from people if we serve them sincerely. Bharat Nirman volunteers should recognise that serving the unknown people falls under service and the same is termed as responsibility when we do it for people known to us", sri Ravindra said.

Speaking on the occasion, Prof. Sudarshanacharya, Resource person, Lead India Foundation said 75 per cent of country's population is set to constitute only youth by



2020 and country' s development will not be on the expected lines if youth do not become partners in national construction by imbibing good conduct. In the process of national reconstruction, Bharat Nirman volunteers should create awareness among public through various methods. He motivated the volunteers to rededicate themselves to public service with disciple and commit ment. He asked them to inculcate amo ng themselves the three qualities - knowledge, skills and attitude which are important for a person's development. It is nothing but inevitable for the youth to gear up if poverty, illiteracy, unemployment and other problems have to be solved in India by 2020. Prof Sudarshanacharya called upon the volunteers to develop the nation by developing themselves first. He opined that the youth should take responsibility if villages are to be developed.

Vandemathram foundation members Madhava, freelance reporter Ramesh were among trainers who took part in the programme and imparted training to Bharat Nirman volunteers on various aspects. Speaking on the occasion, APARD commissioner Sri K Chandramouli said training would be imparted to Bharat Nirman volunteers on personality development and communication skills very soon with an aim to encourage them in their work.



# APARD ORGNISES EXPOSURE VISIT
# Cheeded farmers Visit Nomula Village

About 30 villagers from Cheeded village visited the fields of farmers Gandaiah and Narasamma who chose Sri Vari cultivation that calls for no capital coupled with less expenses and physical labour sans fertilisers and pesticides. On the occasion, Gandaiah explained to farmers about Sri Vari cultivation. After ploughing the land and using 'marker', a seed is sown for every 20 cms in a row. With this method, two kilos of seeds are enough for every acre. On the other hand, 25 to 30 kilos are required per acre in traditional method of cultivation. After the paddy nurseries grew up, the veeder is turned in all four directions – north, south, east and west and weed plants are removed. These weed plants are mixed in soil to make them compost fertilisers which in turn provide lot of strength to soil. The



bacteria which make compost fertilisers turn the soil very loose so that the plants get sufficient air. This veeder is required to be used once every 15 days and atleast three times in the total crop period. The livestock dung has to be collected in a pot and livestock urine has to be mixed with it once every four or five days in SriVari cultivation. This water should be kept at the water flow point and from there it spreads across the entire field with water and turns into a good nature-based fertiliser. There is no need to stock water for this method. Very little water can be used at a later stage. Gandaiah said he was able to get a yield of 30 to 40 bags of paddy per acre through Sri vari cultivation without any investment and by using natural fertilisers and little quantity of water. This type of cultivation has impacted the farmers of Cheeded a lot. They have also decided to take up Sri Vari cultivation.

Woman farmer Narasama explained about sustainable agricultural methods. She is able to raise 7 types of crops at a time in her 37 sft. of land through 36-model N.PM (sustainable agriculture). The crop variety included root-based vegetables, legumes such as soya and cabbage, fruit plants, and multi-annual crops such as red gram. With an income of Rs 1,000 per Square feet, she said she has been able to get an income of Rs 36,000 per annum for the last three years. This type of cultivation that enables to earn good income with low expenditure has impacted Chidedu farmers a lot.

The above cultivation methods attracted the farmers. The Cheeded farmers said they would follow Sri Vari cultivation and achieve higher yield with zero budget, less number of labourers and without using any fertilisers or pesticides but only naturally available fertilisers. ■









# TNA Workshop on Road Safety

APARD is ramifying its act ivities to empower the rural community at large, and in near future it is going to undertake a mass campaign for rural road safety, said Sri Chandramouli, Commissioner APARD. APARD had organized a one day workshop on road safety on 13th April 2011 with select officers from Transport Department.

The objectives of the workshop include i) identification of the training needs of officers of Transport Department, ii) content identification, iii) finalisation of duration of the course, iv) identification of the trainers, v)Preparation of a Road map for conduct of Training programmes.

While addressing the participants of the workshop, Sri Chandramouli had welcomed the initiative taken byTransport Department to sensitize of ficials about road safety , and termed it as a progressive step towards implementation of UN declaration about Decadal Action for Road Safety (2011-20).

Sri.L.Premachandra Reddy, IAS, Commissioner, Transport Department, while inaugurating the workshop, gave a brief account of various components of Road Safety and importance of training to the officers of transport department at all levels.

Sri.T.Krishna Prasad, IG, Road Safety explained the concept of Road Safety in the present context covering wide range of issues. He gave details of proposal made for Road Safety in Andhra Pradesh.

Sri.A.Nageswara Rao, Rtd Executive Director , APSRTC addressed the participants and mentioned about road design, vehicle control and decision making skills in road safety. The participants present in the workshop suggested various issues that need to be included in the trainings on road safety.

The participants were divided in to two groups and discussed at length and identified the content to be included in the course module. The identified content includes Provisions related to Motor Vehicle Act and Technical Skills of the officers, administrative issues, taxation, and computers skills. Around 20 participants from Transport department, experts on Road Safety participated in the workshop.




Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**

జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవంలో అవార్డులను ప్రదానం చేస్తున్న భారత ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్



## అపార్డ్ - గ్రామ వికాసం
## దూరదర్శన్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల వివరాలు

| తేది | కార్యక్రమం |
|---|---|
| **09-05-2011** | సమాచార హక్కు - డాక్యుమెంటరీ ఫిల్మ్, చర్చ |
| **23-05-2011** | జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందటం ఎలా - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| **06-06-2011** | పిల్లల్లో వైకల్య నివారణ - డాక్యుమెంటరీ ఫిల్మ్, చర్చ |

**సమయం:** రాత్రి 8.00 గంటల నుండి 8.30 గంటల వరకు డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శన
రాత్రి 8.30 గంటల నుండి ఉదయం 9.00 గంటల వరకు ప్రత్యక్ష ఫోన్ ఇన్ ప్రోగ్రాం.

సంప్రదించవలసిన ఫోన్ నెం.: **040-27031431, 27031432, 27031433**



# వేసవిలో... చల్లచల్లగా...

వేసవి దాన్ని వెన్నంటి వస్తుందో.. లేక
వేసవిని తనే ఎర్రగా వంటికి పూసుకొని మోసుకొస్తుందో తెలీదుకానీ
ఎన్నెన్నో ఎండిన గొంతులకి రిఫ్రిజిరేటర్ అవుతుంది.
తోపుడుబళ్ళవాళ్ళు దాన్ని కత్తికోముక్కగా నరికినా
వారి ఆకలి మండుటెండలకి ఉపాధిగొడుగులు పడుతూనే ఉంటుంది.
దాని విత్తనాలు బిడ్డల్నందరూ మునిపళ్ళతో ఏరి ఊసేస్తూ
ఎర్రటి సారాన్నంతా ఆబగా జుర్రుకొన్నా
మిగిలిన తన ఆకుపచ్చని చర్మం ముక్కలతో
బజారు పశువుల పంక్తి భోజనాలకు వడ్డించిన విస్తరవుతుంది.
వళ్ళంతా పచ్చదనంతోనూ
గుండెల్నిండా ఎర్రదనంతోనూ
వడదెబ్బ బాధితుల
ఆకస్మిక అస్వస్థతలకి తాత్కాలిక ప్రాణదాతే అవుతుంది.
ఇసుక నేల పొత్తిళ్ళలోంచి
చల్లదనంతో ఊరూరా వలస పోతూ
గ్రీష్మానికి చెంపదెబ్బలా పనిచేస్తుంది.
రోడ్లపక్క.. గుట్టలు గుట్టలుగా.. రాశులు రాశులుగా..
ఎండలో దొర్లిపోతూ
సూర్యకిరణాలు తననేమీ చేయలేవంటూ
గర్వంగా తన చారల మీసాలను తిప్పుతుంది.
చల్లదనంతో వేసవితాపాన్ని తరిమేస్తూ
తియ్యదనంతో చెక్కర తత్వాన్ని కూడా మరిపిస్తుంది.
నోరూరించే రుచుల్ని పంచిస్తూ
అనారోగ్యాల్ని ఆవలితీరం లోనికి అదిలిస్తూ
తడారిన గొంతులకి అమృతభాండమే అవుతుంది.
ఇసుక నేలల్లో పుట్టుకొచ్చి
దాహార్తుల గొంతుల్లో నూతనోత్తేజాన్ని నింపడం కోసం
పూర్తిగా తన అస్తిత్వాన్ని కోల్పోయే
ఈ పిచ్చి పుచ్చకాయను తిన్నట్లయితే
మండు వేసవిలోనైనా తొలకరి జల్లులు కురవాల్సిందే

- అద్దంకి శ్రీనివాస్

